



ఈనాడు

విజయవాడ 19-1-2019 శనివారం సిటీ సంపుటి 45 . సంచిక 159

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

జయహో భారత్

ఆస్ట్రేలియాతో వన్డే సిరీసూ కైవసం



భారత్ అదరగొట్టింది.. ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో గెలిచి 2-1తో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. బ్యాటింగ్‌లో ధోని (87 నాటౌట్), జాదవ్ (61 నాటౌట్).. బౌలింగ్‌లో చాహల్ (6/42) మెరవడంతో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో కంగారూ జట్టును ఓడించింది. ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. అంతే కాదు ఒక్క ఫార్మాట్లోనూ సిరీస్ కోల్పోకుండా ఆస్ట్రేలియా పర్యటనను ముగించిన తొలి జట్టుగా కూడా కోహ్లి సేన ఘనత సాధించింది. టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసిన భారత్.. టెస్టు సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఛాంపియన్ లో



చదివించే వాతావరణం.. ఓ విజయ సోపానం

- పరీక్షల సమయంలో విద్యార్థులకు అండగా నిలవాలి
- తల్లిదండ్రులదే కీలక పాత్రే అంటున్న నిపుణులు

ఈనాడు, హైదరాబాద్, అమరావతి

రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివేవారు తప్ప మిగిలిన విద్యార్థులు పాఠశాల్లో గడిపేది రోజుకు ఎనిమిది నుంచి పది గంటలు మాత్రమే. మిగిలిన సమయంలో ఎక్కువగా ఇంట్లోనే ఉంటారు కాబట్టి, వాళ్ల చదువులో రాణించేందుకు ఇంటి వాతావరణం ఎంతో ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కనీసం పరీక్షలకు ముందు రెండు నెలలపాటైనా చదివేందుకు తగిన వాతావరణం కల్పిస్తూ తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, పరీక్షల సన్నద్ధతకు ఆటంకాలు, ఇబ్బందులు రాకుండా చూడాలని సలహా ఇస్తున్నారు. ఈ కొద్దిరోజులు పిల్లలకు అండగా నిలిస్తే పరీక్షల్లో నెగ్గుకొస్తారని చెబుతున్నారు. తెలంగాణలో (మిగతా 14లో)

	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
పదోతరగతి విద్యార్థుల సంఖ్య	5.30 లక్షలు	6.14 లక్షలు
నాన్ రెసిడెన్షియల్ విద్యార్థుల సంఖ్య	3.50 లక్షలు	3.20 లక్షలు
ఉత్తీర్ణత	83-85%	94%

తెలుగుజాతిని అడ్డుకోలేరు

- ఎన్టీఆర్ స్ఫూర్తితో తెదేపా ధర్మపోరాటం
- ఏపీకి ప్రత్యేకహోదా ఎందుకు ఇవ్వరు?
- మోదీ అనుకూల కూటమిలో కేసీఆర్, జగన్
- ఆ ముగ్గురూ ఒక్కటై రాష్ట్రంపై దాడి
- రాష్ట్ర హక్కులను హరించే అధికారం కేంద్రానికి లేదు
- సత్తెనపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2లో

ప్రధాని మోదీతో బాగున్నంతవరకు తెలంగాణ ముఖ్యమంత్రి మనతో బాగానే ఉన్నారు. ఎప్పుడైతే మోదీతో విభేదించామో అప్పటి నుంచి కేసీఆర్ రాష్ట్రంపై కక్ష కట్టారు. ఆయన రిటర్న్ గిఫ్ట ఇస్తే మూడు గిఫ్టులు తిరిగి ఇస్తామే తప్ప వదిలిపెట్టేది లేదు.

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఏ ముఖం పెట్టుకుని కడపలో పర్యటిస్తున్నారు? ప్రత్యేక హోదా విషయంలో మోసం చేసి మళ్లీ ఎందుకు వచ్చారో చెప్పాలి. కడప జిల్లాకు స్టీల్‌ప్లాంట్ ఇవ్వకుండా అసత్యాలతో దుష్ప్రచారం చేయడమే వాళ్ల ఉద్దేశం. అక్కడి ప్రజలే వారికి సమాధానం చెబుతారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



సత్తెనపల్లిలోని తారకరామసాగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భారీ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్నికల ప్రకటన మార్చి మొదటి వారంలో

- లోక్‌సభతో పాటు ఏపీ సహా 4 శాసనసభలకూ..

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల తేదీలను మార్చి మొదటి వారంలో ఎన్నికల సంఘం ప్రకటిస్తుందని శుక్రవారం విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ప్రస్తుత లోక్‌సభ పదవీ కాలం జూన్ మూడో తేదీన ముగియనుండడంతో ఆలోగానే ఎన్నికల నిర్వహణపై సన్నాహాలు ఆరంభమయ్యాయి. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలి? ఏయే నెలల్లో జరపాలి? అన్న దానిపై ఇప్పటికే కసరత్తు జరుగుతోంది. భద్రతా దళాల అందుబాటు, తదితర అంశాల ఆధారంగా ఎన్ని దశల్లో నిర్వహించాలన్నది నిర్ణయిస్తారు. సంప్రదాయాన్ని అనుసరించి లోక్‌సభ ఎన్నికలతో పాటు కాలపరిమితి ముగియనున్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీల ఎన్నికలు కూడా జరిపే అవకాశం ఉంది. రద్దయిన జమ్ము-కశ్మీర్ అసెంబ్లీకి కూడా లోక్‌సభతో పాటే ఎన్నికలు నిర్వహించే అవకాశాలను పరిశీలించవచ్చు. సంక్లిష్టమైన శాంతి భద్రతల పరిస్థితి దృష్ట్యా అక్కడ కాస్త ముందుగానే అసెంబ్లీ ఎన్నికలు జరిపే అవకాశాలు కూడా లేకపోలేదు. అన్ని (మిగతా 2లో)



కష్టాలను ఎదుర్కొనే ధైర్యం ఎవరికుంటుంది...
యువతకే

సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా ఎవరి సొంతం..
యువత సొంతం

ఈ వాక్యాలను అక్షరసత్యాలని నిరూపిస్తున్నారు ఇద్దరు యువకులు. వ్యవసాయంలో కలుపు సమస్యకు ఒకరు పరిష్కారం కనుక్కొంటే... పేదల బస్తీల్లో ఉపాధి బాటలు పరుస్తున్నాడు మరో యువకుడు. కాస్త పట్టుదల, ఇంకాస్త సృజనాత్మకత ఉంటే... సమాజంలో సామాన్యులు ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించవచ్చని నిరూపించిన యువకుల గురించి చదివేయండి 7లో

గాలిబుడగల గగన విహారం

- అరకులో ప్రారంభమైన బెలూన్ ఉత్సవం
- 15 దేశాల నుంచి హాజరైన ఔత్సాహికులు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ జిల్లా అరకులో గాలిబుడగల గగన విహారం సందర్శకులను అబ్బురపరుస్తోంది. 15 దేశాల నుంచి వచ్చిన ఔత్సాహికులు ఎగరవేసిన 21 బెలూన్లు ఒకేసారి ఆకాశంలో విహరిస్తూ చూపరులను అలరించాయి. మూడు రోజుల పాటు నిర్వహించే అరకు బెలూన్ ఫెస్టివల్ శుక్రవారం స్థానిక ఎన్‌టీఆర్ మైదానంలో ప్రారంభమైంది. పొగమంచు కారణంగా.. ఉదయం 8 గంటలకు జరగాల్సిన కార్యక్రమం 10.30 గంటలకు ఆరంభమైంది. అనంతరం వివిధ (మిగతా 5లో)



ఆకాశంలో విహరిస్తున్న ఎయిర్ బెలూన్లు

అబ్బబ్బ పులుపు.. అదిరే ఎరుపు!

అబ్బురపరుస్తున్న ‘అనంత రుధిర’ చింత రకం

- రుచిలో పుల్లదనం, చూపులకు ఎర్రదనం దీని ప్రత్యేకం
- గతేడాది విడుదల చేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం
- జెల్లీ, చాక్లెట్ల తయారీకి అనువైన రకం
- అంటుకట్టి వృద్ధి చేస్తున్న అనంత ఉద్యాన పరిశోధనా కేంద్రం

2లో



ఏపీకి ప్రత్యేక ప్రాధాన్యం

- కాంగ్రెస్‌తో కలిస్తే భూస్థాపితమే
- కడపలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

కడప - ఈనాడు

‘నేను ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి ఓ మాట చెప్పదలచుకున్నా.. గతంలో మేం చెప్పినట్లు ఈ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఆ దిశగా కృషి చేస్తున్నాం. మేం చేస్తున్న కార్యక్రమాలకు గతంలో మీ ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పుడు ప్రత్యేకహోదా మంత్రం జపిస్తూ ఆయన మాకు సరైన సూచనలు, సలహాలు ఇవ్వడం లేదు. దీంతో అవరోధం ఏర్పడుతోంది. ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ కాదు.. ప్రత్యేక ప్రాధాన్యం (ట్రీట్‌మెంట్) ఇస్తూనే ఉన్నాం.. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు పదేళ్లలో చూపాల్సిన ప్రగతిని నాలుగున్నరేళ్ల కాలంలోనే 80 శాతం (మిగతా 2లో)



‘చారిత్రక అవసరం మళ్లీ మోదీ’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, రాష్ట్ర అధ్యక్షుడు కన్నా, తదితరులు

కుల ధ్రువీకరణ జీవితకాలం చెల్లుబాటు

- ఆదాయ ధ్రువీకరణ పత్రానికి నాలుగేళ్ల కాలపరిమితి

ఈనాడు డిజిటల్, అమరావతి: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ, మీ సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే ఇబ్బందుల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, లబ్ధిదారులకు విముక్తి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఒకసారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం జీవితాంతం చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను 15 రోజుల్లో జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకుఅవసరమైన (మిగతా 2లో)

సిద్ధమవుతున్న బడ్జెట్ స్వరూపం

- ఫిబ్రవరి 5న శాసనసభకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమర్పణ
- ప్రతిపాదనలపై చర్చించనున్న ఆర్థిక మంత్రి యనమల

16లో

ఇదీ సంగతి!



ఆఖరి ప్రయత్నంగా ఈ స్తంభాన్ని బద్దలు కొట్టి చూద్దాం సార్, దాన్లోంచి లోక్‌పాల్ బయటకు రావచ్చు. కమిటీలతో పనిగావట్లేదు.



2018 ఏడాదికిగాను జాతీయ సాహస పురస్కారాలకు భారత బాలల సంక్షేమ మండలి ఎంపిక చేసిన చిన్నారుల బృందచిత్రం

సాహస బాలలపై గందరగోళం

- కేంద్రం, ఐసీసీడబ్ల్యూ సమాంతర కసరత్తు

ఈనాడు, దిల్లీ: సాహస బాలల అవార్డుల అంశం గందరగోళంలో పడింది. ఇప్పటివరకూ అనుసరిస్తున్న విధానానికి భిన్నంగా కొత్త ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. 1957 నుంచి జాతీయ సాహస బాలలను ఎంపికను చేపడుతున్న భారత బాలల సంక్షేమ మండలి (ఐసీసీడబ్ల్యూ)ను పక్కన పెట్టేసింది. ఈ స్వచ్ఛంద సంస్థ 'ఆర్థిక నిబద్ధత'ను ప్రశ్నిస్తూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. విభిన్నఅంశాల్లో ఆవిష్కరణలు, క్రీడలు, కళలు, సంస్కృతి, సంగీతం, సామాజిక సేవవిభాగాల్లో ప్రతిభ చూపిన బాలలకు ఏటా ఇచ్చే అవార్డుల్లోనే కొత్తగా సాహస విభాగాన్నీ చేర్చి అందరికీ 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' పేరిట అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. దీని కింద అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 26 మంది చిన్నారులను ఎంపిక చేసింది. వీరికి ఈనెల 22న రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డులు అందజేయనున్నారు. మరోవైపు ఐసీసీడబ్ల్యూ కూడా ఈ ఏడాదికి సంబంధించి 21 మంది సాహస బాలలను ప్రకటించింది. దిల్లీలో శుక్రవారం వారిని మీడియాకు పరిచయం చేసింది. ఈ ఏడాది అవార్డులకు సంబంధించి తమకు కేంద్రం నుంచి సమాచారం అందలేదని ఐసీసీడబ్ల్యూ ప్రతినిధులు తెలిపారు. కాగా ఐసీసీడబ్ల్యూ ఎంపిక చేసే అవార్డుల నుంచి దూరం జరుగుతున్నట్లు ఆ సంస్థకు సకాలంలోనే తెలియజేసినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు.



తెలుగుజాతిని అడ్డుకోలేరు

- సత్తెనపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

ఆత్మగౌరవంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే తెలుగుజాతిని ఎవరూ అడ్డుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, నియంతృత్వ పోకడలపై నాడు ఎన్టీఆర్ పోరాటం చేశారని, రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం కుదరదని కరాఖండీగా చెప్పారని ఆయన గుర్తు చేశారు. 'పెత్తందారీతనంపై పోరాటం, నిరంకుశత్వాన్ని ఎదిరించడం ఎన్టీఆర్ నేర్పిందే. ఇప్పుడు నిరంకుశత్వం భాజపా రూపంలో... పెత్తందారీతనం నరేంద్రమోదీ రూపంలో ఉన్నందునే తెదేపా ధర్మపోరాటం చేస్తోంది. కోల్‌కతాలో శనివారం జరుగుతున్న భాజపాయేతర పార్టీల ర్యాలీకి నేను హాజరవుతున్నా. తెరాస, వైకాపా మినహా భాజపాయేతర పార్టీల నాయకులందరూ కోల్‌కతా వస్తున్నారు. దాన్ని బట్టే ఆ రెండు పార్టీలు ఎవరి పక్షాన ఉన్నాయో అర్థమవుతోంది. దేశంలో ప్రస్తుతం మోదీ అనుకూల, వ్యతిరేక కూటములు రెండే ఉన్నాయి. తెరాస, వైకాపాలు మోదీ అనుకూల కూటమిలో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది...' అని చంద్రబాబు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ 23వ వర్ధంతిలో పాల్గొన్నారు. అలాగే ఉదయం పార్టీ నేతలతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సత్తెనపల్లిలో 57 ఎకరాల చెరువు మధ్యలో ఏర్పాటు చేసిన 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇక్కడే తారకరామాసాగర్, ఎన్టీఆర్ గార్డెన్స్‌ను, వావిలాల ఘాట్‌ను ప్రారంభించారు. రూ.35 కోట్లతో కేంద్రీయ విద్యాలయం, రూ.92 కోట్లతో రైల్వే వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీకి ప్రత్యేకహోదా ఎందుకు ఇవ్వరని నిలదీశారు. కడప జిల్లాకు స్టీల్‌ప్లాంట్ ఇవ్వలేదని, అసత్యాలతో దుష్ప్రచారం చేయడమే వాళ్ల ఉద్దేశమని, అక్కడి ప్రజలే వారికి సమాధానం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. అవినీతిని అంతం చేస్తామంటూ జగన్ కేసుల మాఫీకి కేంద్రం వత్తాసు పలుకుతోందన్నారు. కోడికత్తి కేసు ఏ ఏజెన్సీకి ఇచ్చినా అభ్యంతరం లేదని, రాష్ట్ర హక్కులను హరించే అధికారం కేంద్రానికి లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.



గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. వేదికపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ కోన శశిధర్, సభాపతి కోడెల శివప్రసాద్‌రావు, ఎంపీ రాయపాటి సాంబశివరావు, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, ఆహార కమిషన్ ఛైర్మన్ జేఆర్ పుష్పరాజ్

పార్టీ కోసం ఏం చేయాలని ఆలోచించాలి..!

'ఎన్నికలకు ఇంకా 100రోజులే గడువు ఉంది. ఈ ఎన్నికల్లో తెదేపా ఘనవిజయం సాధించాలి. దేశ రాజకీయాల్లో మనం కీలక భూమిక పోషించాలి. రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చాలి. 5కోట్ల ప్రజల హక్కులను కాపాడాలి. మనందరం కలిసి అద్భుత బృందంగా పనిచేయాలి. కలిసి వచ్చేవాళ్లందరినీ వెంట తీసుకెళ్లాలి. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా పనిచేయాలి. ప్రజలు, ప్రభుత్వం, పార్టీ... ఇలా అన్ని వేదికల్నీ సమర్థంగా వినియోగించుకోవాలి. నాతో సహా ఎవరికీ మినహాయింపుల్లేవు. మనందరం ఒకే కుటుంబ సభ్యులం. ఎవరికి ఏ పదవి వచ్చినా అది పార్టీ వల్లే. పార్టీ మన కోసం ఏం చేసిందని కాకుండా.. పార్టీ కోసం మనం ఏం చేయాలని ఆలోచించాల్సిన సమయం ఇది..." అని పార్టీ నేతలకు చంద్రబాబు చెప్పారు. ప్రజలపై గురుతర బాధ్యత ఉందని, పిల్లల భవిష్యత్తు కోసం ఇంటికో మనిషి తెదేపాకు అండగా ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంపై జరుగుతున్న దాడిని గట్టిగా తిప్పికొట్టాలన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

ఉత్తమ విద్యార్థిగా, ఆదర్శ ఉద్యోగిగా, గొప్ప కళాకారుడిగా, నిస్వార్థ ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోతారు. మహానాయకుడు, యుగపురుషుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో నేతలంతా ప్రజాసేవకు పునరంకితం కావాలి. సత్తెనపల్లికి వన్నె తెచ్చేలా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎన్టీఆర్ హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుని విగ్రహం పెడితే... కోడెల సత్తెనపల్లి చెరువులో ఎన్టీఆర్ విగ్రహం పెట్టారు. ఆయన వర్ధంతి ఒక సంకల్ప దినం. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన స్ఫూర్తితో అంకితభావంతో పనిచేయాలి. పేదరికంపై గెలుపు సాధించడమే ఆయనకు నిజమైన నివాళి. సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆద్యుడు. ఆయన ఆదర్శాలను మనం కొనసాగిస్తున్నాం. పేదలకు పింఛను 10రెట్లు పెంచడం ఒక రికార్డు. నేరుగా నగదు బదిలీ... విద్య, వైద్యం, ఆహారం రూపంలో సంక్షేమం... ప్రతి కుటుంబఆదాయం పెంచి, నెలకు కనీసం రూ.10 వేల ఆదాయం వచ్చేలా చేయడం... అన్న మూడు పద్ధతుల్లో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఈ మూడూ సాధించాలంటే సుస్థిర వృద్ధి ఉండాలి. అందుకే వ్యవసాయ అనుబంధరంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. పారిశ్రామికీకరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం..." అని చంద్రబాబు వివరించారు. తెలుగుజాతి ఉనికి కాపాడిన గొప్ప వ్యక్తి, ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని సభాపతి కోడెల శివప్రసాద్‌రావు కీర్తించారు. ఎన్టీఆర్ రాజకీయ వారసుడిగా తెలుగువారి స్థైర్యాన్ని ప్రపంచానికి చాటిన నాయకుడు చంద్రబాబునాయుడు అని కొనియాడారు. రూ.1200కోట్లతో సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంపై రాబందులు కన్నేశాయని, కేంద్రం, పొరుగురాష్ట్రం కుట్రలను అడ్డుకోవడానికి ఐదు కోట్ల ఆంధ్రులు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి కోనశశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్, ఎంపీ రాయపాటి సాంబశివరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తాయిలాలకు రూ.లక్ష కోట్లు

- ఎన్నికల ముందు ఖర్చు చేయనున్న కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: ఒకటి పక్కన పన్నెండు సున్నాలు... 10,00,00,00,00000... మన దేశ కరెన్సీలో చెప్పుకుంటే ఒక లక్ష కోట్ల రూపాయలు.. ఇంత భారీ మొత్తాన్ని కేవలం ఎన్నికల ముందు ఖర్చు చేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధమయింది. రైతులే లక్ష్యంగా ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు జరిపే అవకాశాలు ఉన్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ కథనం పేర్కొంది. వ్యవసాయ రుణమాఫీలు, ఇతర సంక్షేమ పథకాలు; వాటిపై అవగాహన కలిగించడానికి ర్యాలీల నిర్వహణ, కరపత్రాల ముద్రణకు కూడా నిధులు ఇవ్వనుంది. ఎన్నికల కోడ్ రాకముందే అమలయ్యేలా చూడాలని భావిస్తోంది. ఈ కారణంగా బడ్జెట్‌లో లోటు పెరిగిపోయే ప్రమాదం ఉన్నా దాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. స్థూలజాతీయ ఉత్పత్తి (జీడీపీ) విలువలో 3.3 శాతానికి మించి బడ్జెట్ లోటు ఉండకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ దాన్ని పట్టించుకోకూడదని భాజపా భావిస్తోంది.

రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు

రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వివిధ పథకాల ప్రయోజనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ఆలోచన ఉన్నట్టు తెలిసింది. దీనిపై భాజపా ఆర్థిక వ్యవహారాల విభాగం అధికార ప్రతినిధి గోపాల్ కృష్ణ అగర్వాల్ మాట్లాడుతూ "రైతుల దుస్థితికి పరిష్కార మార్గాలు చూపడం చాలా ముఖ్యం. ఆర్థిక వ్యవస్థను విస్తరించే విధానాన్ని ఇప్పుడు అనుసరించాలి. అభివృద్ధిని పట్టించుకోవాలి. ద్రవ్యలోటు గురించి కాదు" అని అన్నారు.

వడ్డీలేని రుణాలా? ఆర్థిక సాయమా?

రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలా? నేరుగా ఆర్థిక సహాయం అందించాలా? అన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. రైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తే వాటిపై వడ్డీని ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకు ఏటా రూ.12,000 కోట్లు ఖర్చు కానున్నట్టు అంచనా. ఇది కాకుండా ప్రతి రైతుకు హెక్టారుకు రూ.2000 నుంచి రూ.4000కు ఇవ్వాలన్న మరో ప్రతిపాదన కూడా ఉంది. దీనికయితే రూ.లక్ష కోట్లు అవసరమవుతాయి. దీనిని అమలు చేస్తే వడ్డీలేని రుణాల పథకాన్ని పక్కనపెట్టే అవకాశం ఉంది. రైతులకు కేవలం వడ్డీ లేని రుణాలు ఇస్తే సరిపోదని, రూ.40 వేల కోట్ల మేరకు ఇతర రూపాయల్లో సాయం చేయాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఎన్నికల ప్రకటన మార్చి మొదటి వారంలో

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీల కాలపరిమితి అయిదేళ్లు కాగా, జమ్ము-కశ్మీర్‌కు మాత్రం ఆరేళ్లు ఉంటుంది. వాస్తవానికి 2021 మార్చి 16 వరకు గడువు ఉన్నప్పటికీ 2018 నవంబరులోనే రద్దు చేశారు. ఆరు నెలల్లోగా అంటే మే నెలలోగా దీనికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సిక్కిం అసెంబ్లీ గడువు మే 27న, ఆంధ్రప్రదేశ్‌ది జూన్ 18న, ఒడిశాది జూన్ 11న, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ గడువు జూన్ 1న ముగుస్తాయి. ఈ విషయాన్ని ఎన్నికలసంఘం అధికార ప్రతినిధి వద్ద ప్రస్తావించగా, ఎన్నికల తేదీలను ఎప్పుడు వెల్లడించాలన్నదానిపై ఇంకానిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

ఇంతకుముందు ఇలా..

- 2014లో 9దశల్లో ఎన్నికలు జరిగాయి. మార్చి 5న ఎన్నికల ప్రకటన వెలువడింది. తొలి దశ ఏప్రిల్ 7న, చివరిదశ పోలింగ్ మే12న జరిగాయి.
- 2009లో అయిదు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. మార్చి 2న ప్రకటన రాగా, ఏప్రిల్ 16న తొలి దశ, మే 13న చివరి దశ ఎన్నికలను జరిపారు.
- 2004లో నాలుగు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 29న ప్రకటన వెలువడగా, తొలి దశ ఏప్రిల్ 20న, ఆఖరి దశ మే 10న నిర్వహించారు.

నేడు, రేపు పొగమంచు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా, చిత్తూరు జిల్లాలను పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి నుంచి తెల్లవారే వరకూ ఈ ప్రభావం ఉంటోందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వివరించారు.

అబ్బబ్బ పులుపు.. అదిరే ఎరుపు!



ఈనాడు-అమరావతి: చింతకాయంటే పైన పెంకు లేత పచ్చదనంతో కూడిన గోధుమరంగులో.. లోపల కండ తెలుపు రంగులో, చింతపండంటే పెంకు గోధుమ రంగులో..లోపల కండ తేనె రంగులో ఉంటుందని మనకు తెలుసు. అనంత రుధిర అనే రకం చింతకాయ మాత్రం పైన సాధారణ చింతకాయలాగే ఉన్నా లోపల మాత్రం ఎరుపు రంగులో ఉండి ఆశ్చర్యం కలిగిస్తుంది. చిన్న ముక్క విరిచి రుచి చూస్తే నోరంతా ఎర్రగా మారుతుంది. పచ్చడి చేస్తే పండు మిరపనే తలదన్నేలా ఉంటుంది. అనంతపురం జిల్లా రేగులగుంటలోని ఉద్యాన పరిశోధనా కేంద్రంలో ఈ రకం చింతను చూడొచ్చు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం గతేడాది ఈ రకాన్ని విడుదల చేసింది. దీనికి అనంత రుధిర అని పేరు పెట్టారు.

ఎక్కడిదీ చింత

చింతలో 41 రకాలున్నాయి. వీటికి సంబంధించిన జీవద్రవ్యం (జర్మ్‌ప్లాజం) విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉంది. ఇందులో నుంచే అరుదైన ఎర్ర చింతను బయటకు తెచ్చారు. దశాబ్దాల కిందట అంతరించిపోయిన అనంత రుధిర.. ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల కృషితో వెలుగులోకి వచ్చింది.

నాలుగైదేళ్లలో కాపు



- ఎర్రచింత సాధారణ రకాల మాదిరిగానే నాలుగైదేళ్లలో కాపునిస్తుంది.
- ఇందులోని కండ ఎర్రగా.. రక్తవర్ణంలో ఉంటుంది.
- పండుగా మారే నాటికి ఎర్రదనం కాస్త తగ్గుతుంది.
- ఏటా జూన్, జులైలో పూత మొదలై ఫిబ్రవరిలో పండు వస్తుంది.
- సాధారణ రకాలతో పోలిస్తే.. కాయలు గుత్తులుగా అధిక పరిమాణంలో ఉంటాయి.

ఈ చింతతో ఏంటీ ప్రయోజనం?



- వంటకాల్లో వాడే కృత్రిమ రంగుల్లో కొన్ని ఆరోగ్యానికి హానిచేస్తాయి. సహజ ఎర్రదనం ఉండే అనంత రుధిర చింతతో పులుపుతోపాటే ఎర్ర రంగు అదనపు లాభం అన్నమాట.
- పప్పులో వాడినా.. రసంలో వాడినా వంటకం ఎర్రగా కన్పిస్తుంది.
- పుల్లగా ఎర్రగా ఉండే చాక్లెట్లను, జెల్లీలను ఈ చింతతో తయారు చేస్తే సహజంగానే పులుపురంగుతో కూడిన ఎర్రదనం వస్తుంది.

విలువ ఆధారిత ఉత్పత్తులపై పరిశోధనలు

అనంత రుధిర చింత నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడంపై పరిశోధనలు చేస్తున్నాం. చింత తొక్కుతో జామ్, చాక్లెట్లు తయారీపై దృష్టి పెట్టాం. మరికొన్ని కూడా పరిశీలిస్తున్నాం. అయిదారు నెలల్లో ఫలితాలు విడుదల చేస్తాం. ఇందులోని ఔషధ, పోషక విలువలపైనా అధ్యయనం చేస్తున్నాం.

– డాక్టరు బి.శ్రీనివాసులు, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా కేంద్రం, అనంతపురం

రైతులకు అందుబాటులో

అనంత రుధిర రకాన్ని అంటు కట్టి రైతులకూ విక్రయిస్తున్నారు. ఒక్కో మొక్క ధర రూ.50 చొప్పున నిర్ణయించారు. ఇప్పటికే రెండు వేల మొక్కల వరకు అందించారు. ఈ ఏడాది 30వేల మొక్కలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అనంతపురం ఉద్యాన కేంద్రంతోపాటు నెల్లూరు, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని ఉద్యాన కేంద్రాల్లోనూ మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

అనంత రుధిర ప్రత్యేకతలు			
	పొడవు 15.22 సెం.మీ	బరువు 22.43 గ్రా॥	గుజ్జు 42.69%

కుల ధ్రువీకరణ జీవితకాలం చెల్లుబాటు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ 'ప్రతి పౌరునికి కులం, పుట్టిన తేది, పుట్టిన ప్రదేశంలో మార్పులు ఉండనందున కుల ధ్రువీకరణ పత్రం ఒకసారి జారీ చేస్తే సరిపోతుంది. ఈ ధ్రువపత్రం కోసం 6 నెలలకోసారి విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను రెవెన్యూ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిప్పడం సరైన విధానం కాదు. ఆదాయంలో మార్పు వచ్చే వీలున్నందున ఈ ధ్రువీకరణ పత్రాన్ని నాలుగేళ్ల వరకు చెల్లుబాటయ్యేలా జారీ చేయాలి' అని అధికారులను ఆదేశించారు. వీటి జారీపై అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ధ్రువపత్రాల జారీ విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 21 నాటికి మంత్రిమండలి ఆమోదించవలసిన అన్ని ఫైల్స్ సిద్ధం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని చెప్పారు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలను అధ్యయనం చేసి ఆ నిధులను పూర్తిస్థాయిలో పొందడానికి ప్రయత్నించాలన్నారు.



దుండగులు తగలబెట్టడంతో బూడిద అయిన దస్త్రాలు

పంచాయతీ కార్యాలయంలో దస్త్రాలు దహనం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా వాల్మీకిపురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం పైకప్పు తొలగించి లోనికి చొరబడి దస్త్రాలకు నిప్పుపెట్టారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 12 నుంచి 18 వరకు పంచాయతీ కార్యాలయానికి సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దుండగులు పథకం ప్రకారం 17న రాత్రి ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఇక్కడ దశాబ్ద కాలంగా భద్రపరిచిన దస్త్రాలతోపాటు పంచాయతీకి సంబంధించిన వివరాలు నిక్షిప్తం చేసిన డిస్క్‌లను, కంప్యూటర్లను సైతం తగలబెట్టారు. ఈ విషయం శుక్రవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఉలాసయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

సాధించాం. మరో ఒకటి రెండేళ్లలో నూరు శాతం సాధిస్తాం..."అని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నందునే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గౌరవంలో దేశగౌరవం.. దేశగౌరవంలో ఆంధ్రప్రదేశ్ గౌరవం ఇమిడి ఉందని వ్యాఖ్యానించారు. శుక్రవారం కడపలో జరిగిన రాయలసీమలోని 8 పార్లమెంటరీ నియోజకవర్గాల భాజపా శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జిల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం కడపకు చేరుకున్న రాజ్‌నాథ్‌కు అధికారులు, నేతలు ఘనస్వాగతం పలికారు. రోడ్డుమార్గంలో కందుల ఎస్టేట్‌లో సమావేశం వద్దకు చేరుకున్న ఆయనకు మహిళా కార్యకర్తలు వీరతిలకం దిద్ది హారతులిచ్చారు. తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించి.. హిందీలో కొనసాగించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ దానిని తర్జుమా చేశారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని తొలుత నందమూరి తారక రామారావును రాజ్‌నాథ్‌సింగ్ స్మరించుకున్నారు. ఆంధ్రుల పక్షాన నిలిచి, కాంగ్రెస్ కుట్రలపై పోరాడిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తో కలిస్తే భూస్థాపితమేనని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న ఏ ప్రాంతీయ పార్టీ అయినా చివరకు మునగాల్సిందేనని, ఇప్పటివరకు జత కట్టిన ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం తన జీవితాన్నే ధారపోసిన పీవీ నరసింహారావు పట్ల కాంగ్రెస్ దుష్ట వైఖరి అవలంబించిందని.. ఆయన పార్థివ దేహాన్ని పార్టీ కార్యాలయంలోకి రానివ్వకుండా కుయుక్తి ప్రదర్శించిందని విమర్శించారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ మాట్లాడుతూ తన కుర్చీకే భద్రత లేని చంద్రబాబు దేశాన్ని కాపాడుతానంటూ మహాకూటమి పేరుతో రాష్ట్రాలు తిరుగుతున్నారని.. తెలంగాణలోనూ మరో వ్యక్తి కూటమి పేరుతో హాస్యాస్పదమైన రాజకీయం చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాజపా అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కడపకు ఉక్కు పరిశ్రమ రావడం చంద్రబాబుకు ఇష్టం లేదని, కేవలం కేంద్రంపై నిందలేయడం, తిట్టడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయబాబు రచించిన 'చారిత్రక అవసరం మళ్లీ మోదీ' పుస్తకాన్ని రాజ్‌నాథ్‌సింగ్ ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పురందేశ్వరి, సునీల్ దేవధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కందుల రాజమోహన్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వారు భాజపాలో చేరారు.

ఏపీకి ప్రత్యేక ప్రాధాన్యం

బాధ్యతల్లేకుండా హక్కులంటేనే..

బాధ్యతల మాటెత్తకుండా హక్కులను మాత్రం దక్కించుకోవాలని ప్రయత్నం చేసినప్పుడే హింస అన్నది అనివార్యంగా పొడసూపుతుంది.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

19–1–2019 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: మ. 3.45 తదుపరి చతుర్దశి
మృగశిర నక్షత్రం: ఉ. 8.51 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: రా. 10.10 నుంచి 11.41 వరకు
వర్జ్యం: సా. 4.50 నుంచి 6.21 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6.38 నుంచి 8.07 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-43
శనిత్రయోదశి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	14.9	30.9
కడప	15.0	33.0
శ్రీకాకుళం	16.0	26.0
విశాఖపట్నం	17.0	28.6
తిరుపతి	17.2	30.0
రాజమహేంద్రవరం	17.5	32.5
అనంతపురం	17.6	32.3
గుంటూరు	17.8	30.5
కర్నూలు	18.2	33.7
విజయవాడ	20.0	30.2
ఒంగోలు	20.3	31.4
తాడేపల్లిగూడెం	21.0	25.3
నరసాపురం	21.0	28.2
నెల్లూరు	21.0	30.0

రాజకీయ రంగానికీ వన్నెతెచ్చిన ఎన్టీఆర్

ఎమ్మెల్యే బాలకృష్ణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: సినీ రంగంతో పాటు రాజకీయ రంగానికీ వన్నెతెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని నందమూరి బాలకృష్ణ శ్లాఘించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అమరజ్యోతి ర్యాలీని నిర్వహించారు. హైదరాబాద్ బేగంపేట రసూల్‌పురా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జ్యోతి వెలిగించి ర్యాలీని బాలకృష్ణ ప్రారంభించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెతెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాలకు చెందిన ఎన్టీఆర్ అభిమాన సంఘాల ప్రతినిధులు, పార్టీ నేతలు హాజరయ్యారు. ర్యాలీ ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్న అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రతి ఒక్కరి హృదయంలో జీవించే ఉంటారన్నారు.

కుటుంబ సభ్యులు, నేతల ఘన నివాళి

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకుని నివాళులు అర్పించారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు బాలకృష్ణ, భువనేశ్వరి, బ్రాహ్మణి, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్, రామకృష్ణ, సుహాసిని వచ్చి ఎన్టీఆర్ సమాధిపై పుష్పగుచ్ఛాలుంచారు. సినీ దర్శకులు క్రిష్, వైవీఎస్ చౌదరి, తెతెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సాయిబాబా, తెదేపా నుంచి బహిష్కరణకు గురైన మోత్కుపల్లి నర్సింహులు నివాళులర్పించారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో నారా బ్రాహ్మణి, బాలకృష్ణ సతీమణి వసుంధర ఇతర కుటుంబ సభ్యులు రోగులకు పండ్లు పంచారు. ప్రజల నుంచి ఎన్టీఆర్ జీవిత విశేషాలను తెలుసుకునేందుకు వీవ్ మీడియాస్ ఆధ్వర్యంలో వ్యాసాల పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్' వెబ్‌సైట్‌లో లేదా 85003 61735 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. పోటీల గోడపత్రికలను బాలకృష్ణ, భువనేశ్వరి, బ్రాహ్మణి.. ఎన్టీఆర్ ఘాట్‌లో ఆవిష్కరించారు.

ట్రస్టు భవన్‌లో రక్తదాన శిబిరం

ప్రతి రక్తపు బొట్టు అమూల్యమైనదని, ఆపత్కాలంలో ప్రాణం నిలపడంలో రక్తదానం ఎంతో కీలకమని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ట్రస్టు భవన్‌లో 'లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్' నిర్వహించారు. నారా భువనేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని శ్లాఘించారు. మూడేళ్లుగా జనవరి 18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని వందలాది ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం 100కు పైగా ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు.

తెలుగు ప్రజల గుండె చప్పుడు: కళా వెంకట్రావు

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండె చప్పుడని, తెలుగుజాతి పౌరుషాన్ని, ఖ్యాతిని దశదిశలా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి ఆయనతో పాటు మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను కళా వెంకట్రావు ప్రారంభించారు. తెలుగు విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరితో పాటు పలువురు తెలుగు యువత, తెలుగు విద్యార్థి నాయకులు రక్తదానం చేశారు. అనంతరం కళా వెంకట్రావు మాట్లాడుతూ.. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఎన్టీఆర్ అంచెలంచెలుగా ఎదిగి దేశరాజకీయాలను శాసించారన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. తెదేపాను అణచివేసేందుకు ప్రస్తుతం కుట్రలు జరుగుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ఎన్టీఆర్‌కు మనమిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కూడా నివాళులర్పించారు. రక్తదానం చేసిన తెలుగు యువత, విద్యార్థి నాయకులకు ధ్రువపత్రాలు అందజేశారు.





ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌ఘాట్‌లో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. పక్కన నందమూరి రామకృష్ణ తదితరులు ■ ఎన్టీఆర్‌ట్రస్ట్ భవన్‌లో రక్తదానం చేస్తున్న నారా భువనేశ్వరి ■ గుంటూరులో రక్తదానం చేసిన తెలుగు యువత నాయకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి లోకేశ్

కేసీఆర్ కుట్రలో జగన్ పావు

- సొంత ప్రయోజనాలకు రైతుల భవిత తాకట్టు
- ఒక్క రోజైనా తెలంగాణలోని అక్రమ ప్రాజెక్టులపై నోరు మెదిపారా?
- మీకొచ్చే కమీషన్ ఆగిపోతుందనే దుర్బుద్ధితో సహకరిస్తున్నారు
- ప్రతిపక్ష నేతకు కళా వెంకట్రావు 10 ప్రశ్నలతో బహిరంగ లేఖ

ఈనాడు - అమరావతి

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తన సొంత ప్రయోజనాలకు రాష్ట్ర రైతుల భవిష్యత్తును తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాకట్టు పెడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు ధ్వజమెత్తారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన జలాలను పంచకుండా అడ్డుకుంటున్న ఆయనతో పొత్తు పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాలకు తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఆయన జగన్‌కు 10 ప్రశ్నలతో ఒక బహిరంగ లేఖ రాశారు. కేసులు మాఫీ, మీ ఆస్తులు, బినామీలను కాపాడుకునేందుకు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తే అంగీకరించబోమని భీష్మించిన వాళ్లతోనే కలుస్తున్నారని దుయ్యబట్టారు.

- ఆంధ్రప్రదేశ్‌లో తాగేందుకు నీరు కూడా లేకుండా చేయాలని కేసీఆర్ పన్నిన కుట్రలో మీరు పావులుగా మారుతున్నారు. బచావత్, బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పులకు, విభజన చట్టానికి విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరు మీకు కన్పించడం లేదా?



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న కళా వెంకట్రావు. చిత్రంలో పార్టీ నేతలు

- బాబ్లీతో పాటు 11 అక్రమ ప్రాజెక్టులపై పోరాటం చేసినప్పుడు చంద్రబాబుతో పాటు తెదేపా నేతలు జైలుకు వెళ్లారు. ఇప్పుడు రాష్ట్రాన్ని ఎడారిగా మార్చేలా కుట్రలు చేస్తున్నా ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఖండించలేదు.
- శ్రీశైలం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి తీసుకున్న నీటిని తక్కువ చేసి దొంగ లెక్కలు చూపించారు. అక్రమంగా 120 టీఎంసీల నీటిని ఉపయోగించుకునేలా పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాలకు తెలంగాణ శ్రీకారం చుట్టింది. అయినా స్పందించటానికి మీరు ఎందుకు ధైర్యం చేయలేకపోయారు?

> కేసీఆర్ నిర్మించే అక్రమ ప్రాజెక్టులకు వైకాపా నేతలు ప్రధాన గుత్తేదారులుగా ఉన్నారనేది జగమెరిగిన సత్యం. ఎక్కడ ఆ ప్రాజెక్టులను అడ్డుకుంటే వారి ద్వారా మీకొచ్చే కమీషన్ ఆగిపోతుందనే దుర్బుద్ధితో మీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా మీరు ఒక్క రోజైనా అక్రమ ప్రాజెక్టులపై నోరు మెదిపారా?
>
> మిగులు జలాల్లో వాటా వద్దని ఆనాడు మీ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి లేఖ ఇచ్చి రాష్ట్రం గొంతు కోస్తే.. రాష్ట్ర రైతాంగానికి ద్రోహం చేస్తున్న కేసీఆర్‌కు ఇప్పుడు మీరు అండగా నిలిచారు.

- దేశానికే ఆదర్శంగా నిలిచిన పట్టిసీమ ప్రాజెక్టులో తెలంగాణకు ఒక్క చుక్క నీటిపైనా హక్కు లేదని ఒక్కరోజైనా మీరు మాట్లాడారా?
- విభజన సమయంలో వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేసిన అపెక్స్ కౌన్సిల్‌కు కూడా కేసీఆర్ మొండిచేయి చూపారు. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకుంటామని కేంద్ర జలవనరులశాఖ మంత్రి ముందు చెప్పి.. ఆ తర్వాత నీటి విడుదల విషయంలో ఆటంకాలు సృష్టించారు. అయినా మీరెందుకు ప్రశ్నించలేకపోయారు?
- నాగార్జునసాగర్ కుడికాలువ గేట్ల వద్దకు ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అధికారులను రానీయకుండా తెరాస ప్రభుత్వం ఆటంకాలు సృష్టించింది. అయినా మీరు స్పందించకపోవడం దేనికి సంకేతం?
- పట్టిసీమ, పురుషోత్తపట్నం, ముచ్చుమర్రి ప్రాజెక్టులను నిలిపేయాలని హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాస్తే మీరు సంతోషించారు. పరివాహక ప్రాంతాలు దాటి కృష్ణా జలాలు వినియోగించకుండా కట్టడి చేసి.. వాటిని మళ్లీ కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసే మొండివాదనకు మీరు సహకరించడం ఏమిటి?



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కొనకళ్ల నారాయణరావు, చిత్రంలో తెదేపా నాయకులు

విలువల రాజకీయాలకు చిరునామా

- ఎంపీ కొనకళ్ల నారాయణరావు
- ఒకేరోజు 20 ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే : విలువలతో కూడిన రాజకీయాలకు ఇప్పటికీ ఎన్టీఆర్ చిరునామాగా ఉన్నారని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు మండలంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు తదితరులతో కలిసి ఎంపీ కొనకళ్ల శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రోజు 20 గ్రామాల్లో 20 ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. దీంతో అన్ని గ్రామాల్లోనూ ఎన్టీఆర్ విగ్రహాలున్న మండలంగా గుడ్లవల్లేరు రికార్డు సృష్టించింది. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికే మూడింటిలో ఎన్టీఆర్ విగ్రహాలున్నాయి. మిగతా గ్రామాల్లోనూ విగ్రహాలను ఏర్పాటు చేయాలని తెదేపా మండల కమిటీ ఆలోచన చేసింది. అందుకు అనుగుణంగా పార్టీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి నేతృత్వంలో 20 పంచాయతీల్లో రూ.20 లక్షల వ్యయంతో విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వాటిని ఆవిష్కరించారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

దుబాయ్‌లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం

ఈనాడు డిజిటల్, అమరావతి: తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రవాసాంధ్రులు కొనియాడారు. దుబాయ్‌లో శుక్రవారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వారితో పాటు తమిళ, కన్నడ ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని నివాళి అర్పించారు. దేశవిదేశాల్లోని తెలుగు ప్రజలకు ఉన్నతమైన స్థానం లభించడం ఎన్టీఆర్ ఆనాడు చేసిన సేవల ఫలితమేనని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో నిరంజన్ కంచర్ల, విశ్వేశ్వరరావు, ముక్కు తులసికుమార్, చైతన్య, వేణు, రమేశ్, హరి, రాజు, ఉమా, ప్రిన్స్ ఎలవర్సన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం విచ్ఛిన్నానికి కుట్ర: యనమల

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో తెదేపా రథచక్రాలను ఆపలేరని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి ఆయన మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ప్రధాని మోదీ, కేసీఆర్, జగన్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. ప్రధాని మోదీ ప్రోత్సాహంతోనే జగన్ పనిచేస్తున్నారన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వబోమని తెగేసి చెప్పిన మోదీకి జగన్ ఎలా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు.

జగన్‌కు అధికారం ఇస్తే రాజధాని ఇడుపులపాయలో

మంత్రి అయ్యన్నపాత్రుడు ఎద్దేవా

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు అధికారం ఇస్తే రాజధాని ఇడుపులపాయలోని దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సమాధి వద్ద పెట్టుకుంటారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో ఎన్టీఆర్ వర్ధంతి సభలో మంత్రి ప్రసంగించారు. ఆడవారిని కించపరిచే పార్టీ తెదేపా కాదని, జగన్ సోదరి షర్మిల అంతరాత్మకూ ఈ విషయం తెలుసన్నారు. జగన్‌ను సీఎం చేయడం కోసం ఆమె ఆరోపణలు గుప్పిస్తున్నారని విమర్శించారు.

రూ.3 వేల కోట్లు రుణం ఇవ్వండి

జగన్-కేటీఆర్ కలుసుకుని ప్రత్యేకహోదాపై కృషి చేస్తామని చెప్పడాన్ని అయ్యన్నపాత్రుడు ఆక్షేపించారు. ఏపీ మీద అభిమానమే ఉంటే తెరాస ప్రభుత్వం రాష్ట్రానికి రూ.3 వేల కోట్లు అప్పు ఇవ్వాలని, అలాగే రూ.5,200 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. ఏపీకి ప్రత్యేకహోదాపై గతంలో కేసీఆర్, కేటీఆర్ ఏమన్నారో సామాజిక మాధ్యమాల్లో చూడాలని ప్రజలను కోరారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తే మాకూ ఇవ్వాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారని, ఇప్పుడు మాట మారుస్తున్నారని, ఆయనది నోరా.. తాటిపట్టా? అని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. జగన్ దొంగ.. అయనను తెలంగాణ జైల్లో ఉంచొద్దని కేసీఆర్ కుమార్తె కవిత చెప్పారని, ఆంధ్రులను తరిమి తరిమి కొడతామని హరీష్‌రావు అన్నారని ప్రస్తావిస్తూ.. తెరాస, వైకాపా కౌగిలించుకోవడం రాజకీయాల్లో విలువలు లేని పరిస్థితికి అద్దం పడుతోందన్నారు.

కేసీఆర్, జగన్ కలిస్తే మూడో ఫ్రంట్ వస్తుందా?: రఘువీరా

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, వైకాపా అధ్యక్షుడు జగన్ కలిసినంత మాత్రాన మూడో ఫ్రంట్ వస్తుందా అని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రశ్నించారు. అనంతపురం జిల్లా మడకశిరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భాజపా పోటీ చేయలేని రాష్ట్రాల్లో ఇలాంటి ప్రాంతీయ పార్టీలను బీ టీమ్‌గా ఎంపిక చేసుకుంటుందని తెలిపారు. జగన్, కేసీఆర్ దాగుడు మూతలు ఆడాల్సిన అవసరం లేదని కలిసి పోటీ చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రత్యేక హోదా ఎన్నికల ప్రణాళికలో లేకపోతే మునిగిపోతామని, హోదా సాధిస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. దేశంలోని 12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, 200 పార్లమెంటు స్థానాలు గెలిచి రాహుల్‌గాంధీ ప్రధానిగా ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఆంధ్రులను దూషించి ఎలా వస్తారు?

- కేసీఆర్‌ను ప్రశ్నించిన ప్రత్యేక హోదా సాధన సమితి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: "తెలంగాణ జాగో..ఆంధ్రా భాగో" అంటూ ఇక్కడి ప్రజలను దుర్భాషలాడి, ఈ ప్రాంతానికి ఎలా వస్తారని? తెలంగాణ సీఎం కేసీఆర్‌ను ప్రత్యేక హోదా సాధన సమితి సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశానికి అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కేసీఆర్ చేసే రాజకీయాలను ముక్తకంఠంతో ఖండించారు. సమితి కన్వీనర్ ఆచార్య శామ్యూల్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి కేసీఆర్ చేసిన అన్యాయం, అవమానం మరవలేమని, ఏ ముఖం పెట్టుకొని ఇక్కడికి వస్తారని ప్రశ్నించారు. ఆంధ్రులు దోపిడిదారులు, దొంగలని మాట్లాడిన మిమ్మల్ని ఎలా క్షమిస్తామని ప్రత్యేక హోదా సాధన సమితి ఏఎన్‌యూ కన్వీనర్ డాక్టర్ సింహాచలం అన్నారు. చేసిన తప్పులు ఒప్పుకున్న తర్వాతే, కేసీఆర్ ఇక్కడికి రావాలని స్పష్టం చేశారు. యువజన, విద్యార్థి సంఘాల నాయకులు డాక్టర్ మండూరి వెంకటరమణ మాట్లాడుతూ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఏపీకి అన్యాయం చేయడానికి కేసీఆర్ ఎత్తుగడలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న మీ సానుభూతి మాటలు మాకు అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు పెమ్మసాని నరసింహారావు, ఇతర ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ, అధ్యాపక సంఘాల నాయకులు

సత్తా చాటుతాం: మందకృష్ణ మాదిగ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఉనికిని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో వచ్చే నెల 19న అమరావతిలో నిర్వహించనున్న విశ్వరూప మహాసభ ద్వారా మాదిగల సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీలో మాలలు 41 లక్షలు ఉంటే, మాదిగలు 39 లక్షలు మంది ఉన్నారన్నారు. ఇక్కడ మాదిగలు లేరని మాలల్లో కొంతమంది నాయకులు, అధికార, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు సైతం ఆ వర్గానికే వంత పాడుతున్నారని ఆరోపించారు. సభకు సీఎం చంద్రబాబు, జగన్, పవన్‌తోపాటు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులను ఆహ్వానిస్తామని.. ఈ సమయంలోనే వారి వైఖరిని తెలుసుకుంటామని వివరించారు.

షర్మిల ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో ఆరుగురు?

ఈనాడు, హైదరాబాద్: వైకాపా నాయకురాలు వై.ఎస్.షర్మిలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తూ, ఆమె ప్రతిష్ఠకు భంగం కలిగించేలా యూట్యూబ్‌లో వీడియోలను అప్‌లోడ్ చేసిన వారిని సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. యూట్యూబ్ ప్రాంతీయ ప్రతినిధులు ఇచ్చిన సమాచారంతో పోలీస్ అధికారులు పలువురి ఐపీ చిరునామాలను గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక యువతి కూడా ఉన్నట్టు తెలిసింది. బీటెక్ పూర్తి చేసిన ఓ యువకుడు 'వై.ఎస్.షర్మిల, ప్రముఖ కథానాయకుడు ప్రభాస్‌తో సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే వ్యాఖ్యానాలతో కూడిన వీడియోను తయారు చేసినట్టు' పోలీసులు విచారణలో గుర్తించారు. అలాగే యూట్యూబ్‌లో ఒక ఛానెల్ పేరుతో విద్వేష ప్రచారాల వీడియోలను పోస్ట్ చేస్తున్న ప్రతినిధిని కూడా పోలీస్ అధికారులు విచారించినట్టు సమాచారం. 'తాము సదరు సమాచారాన్ని నిర్ధారించుకున్న తర్వాతే యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేందుకు అనుమతిస్తున్నామని, కిందిస్థాయి సిబ్బంది విషయాన్ని (కంటెంట్) మార్చి అప్‌లోడ్ చేసుండొచ్చని' సదరు ప్రతినిధి పోలీసులకు వివరించినట్టు తెలిసింది. మరోవైపు వై.ఎస్.షర్మిలకు వ్యతిరేకంగా వీడియోలు, ఆడియోలు పోస్ట్ చేస్తున్న పది ఛానెళ్లను సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. యూట్యూబ్ ప్రాంతీయ ప్రతినిధులకు వాటి సమాచారం పంపి, ఐపీ చిరునామాలను కోరేందుకు సిద్ధమవుతున్నారు.

ఈనాడు

నరకానికి నకళ్లు

తెలుగుగడ్డపై అధికశాతం సర్కారీ వసతి గృహాల్లో సంక్షేమ భావన కొల్లబోతోంది. పేదింటి పిల్లల విద్యాభ్యాసం చమురు లేని దీపమై కొడిగట్టరాదన్న ఉదాత్త ఆశయంతో వారికి ఆసరా, ఆశ్రయం కల్పించడానికి ఉద్దేశించిన ఎన్నో హాస్టళ్లు సమస్యల నెలవులై భ్రష్టుపడుతున్నాయి. కిటికీలు, తలుపులు సరిగ్గా లేని వసతిగృహాల్లో మంచాలు, దుప్పట్లకు సైతం నోచని బడుగు బలహీనవర్గాలకు చెందిన అభాగ్య విద్యార్థులెందరో చలి తీవ్రతకు గజగజలాడుతున్నారు. వసతి గృహాల్లో కనీస సదుపాయాలూ కొరవడ్డాయంటూ సుమారు ఏడేళ్లక్రితం దాఖలైన వ్యాజ్యాన్ని విచారిస్తూ 'ఈ పిల్లలు మనుషులు కాదా?' అని ఉన్నత న్యాయస్థానం అప్పటి ప్రభుత్వాన్ని నిగ్గదీసింది. వివిధ సందర్భాల్లో మానవ హక్కుల సంఘం, కాగ్, లోకాయుక్త సైతం సంక్షేమ హాస్టళ్ల దురవస్థను సూటిగా తప్పుపట్టాయి. దురదృష్టవశాత్తు దళిత, గిరిజన, వెనకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, వికలాంగుల వసతి గృహాల స్థితిగతుల్లో మెరుగుదల నేటికీ ఎండమావినే తలపిస్తోంది! ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, ఉత్తరాంధ్ర; తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్... ఏ జిల్లాను ప్రాంతాన్ని పరికించినా సంక్షోభ హాస్టళ్ల ముఖచిత్రం నివ్వెరపరుస్తోంది. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవంతులు, అరకొర వసతుల అద్దె భవనాలు, దుర్గంధ భూయిష్ఠమైన మరుగుదొడ్లు, తగినన్ని స్నానాల గదులు కరవై బాలికల నరక యాతనలు... తరతమ భేదాలతో దాదాపు అన్నిచోట్లా ఇదే కథ. తాగునీరు అందుబాటులో లేక పారిశుద్ధ్యానికి అతీగతీ లేని అపరిశుభ్ర వాతావరణంలో రక్తహీనత, అనారోగ్య సమస్యలు పెచ్చరిల్లుతున్నాయి. తిరగని ఫ్యాన్లు, విరిగిన మంచాలు, వెలగని దీపాలు, పేరుకుపోయిన వ్యర్థాలతో హాస్టళ్లు- నరక కూపాలకు నకళ్లుగా ప్రభుత్వాల అలసత్వానికి అద్దం పడుతున్నాయి.

రెండు పూటలా తిండిపెట్టి చదివించే స్తోమత లేని నిరుపేదల బిడ్డలే వసతి గృహాల్ని ఆశ్రయిస్తున్నారని, అలా వస్తున్న వారి తల్లిదండ్రుల్లో సగంమందికి పైగా నిరక్షరాస్యులేనని సామాజిక అభివృద్ధి మండలి నివేదికాంశాలు వెల్లడిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సుమారు అయిదు వేల ఎస్సీ, ఎస్టీ బీసీ తదితర సంక్షేమ హాస్టళ్లను కొండంత ఆశతో శరణు వేడుతున్నవారిలో అత్యధికులు కడగండ్ల పాలబడటం సంక్షేమ స్ఫూర్తినే ప్రశ్నార్థకం చేస్తోంది! దశాబ్దం క్రితం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల గతిరీతులపై ఐఐఈ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్స్) చేపట్టిన అధ్యయనం ఎన్నో చేదు నిజాలను వెలుగులోకి తెచ్చింది. మెస్ ఛార్జీలను గుట్టుగా స్వాహా చేస్తున్న బాగోతాలను అది రట్టుచేసింది. ఇటీవల ఐఐపీఏ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో నిర్వహించిన అధ్యయనం సంక్షామ హాస్టళ్లెన్నో సమస్యల కూపంలో కూరుకుపోయే ఉన్నట్లు ధ్రువీకరించింది. చాలాచోట్ల అనారోగ్యకర, అమానవీయ పరిస్థితులు నెలకొని ఉన్నాయన్న నివేదిక- ప్రాంతాలవారీగా సమస్యల పద్దును ఏకరువు పెట్టింది. ఐఐపీఏ అధ్యయనంలో మూడో అధ్యాయంగా పొందుపరచిన 'ప్రధాన నివేదిక' ఇరు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కేటాయింపులు అన్నార్తులను ఆదుకోలేకపోతున్నాయని సోదాహరణంగా చాటింది. అది ఎత్తిచూపిన లోటుపాట్లను తీవ్రంగా పరిగణించి సత్వర దిద్దుబాటు చర్యలు చేపట్టడంలోనూ ప్రభుత్వాల అలసత్వం- అక్రమార్కులకు అయాచిత వరమవుతోంది.

నిబంధనల ప్రకారం కనీసం 20-30 సెంట్ల స్థలంలో వసతి గృహం నెలకొల్పాలి. ప్రతి పదిమంది విద్యార్థులకొక స్నానాల గది, మరుగుదొడ్డి ఏర్పరచాలి. నిర్ణీత గడువులోగా దుస్తులు, దుప్పట్ల పంపిణీ పూర్తయిపోవాలి. ఎక్కడైనా అక్షరాలా అలాగే జరుగుతోందా? ఉదయం సాయంత్రం అల్పాహారంగా, రెండు పూటలా భోజనంలో ఏ రోజు ఏమేమి ఇవ్వాలో నిబంధనలు స్పష్టీకరిస్తున్నా- సవ్యంగా అమలుకు నోచుకుంటున్నదెక్కడ? అనుదినం గుడ్డు, వారానికి ఒక మారు మాంసాహారం దస్త్రాలకే పరిమితమవుతున్నాయి. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైయెత్తున అధికారులు, నాయక శ్రేణుల దాకా అవినీతి 'వాటా'వరణం ముమ్మరించి- బస్తాల కొద్దీ బియ్యం, టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు నల్లబజారుకు తరలుతున్నాయి. ఎస్సీ హాస్టళ్లు, గురుకులాల దుస్థితిపై ఆరా తీసిన ఏపీ నిఘాదళం (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్)- విద్యార్థుల వాస్తవ హాజరుకు, రికార్డుల్లో పేర్కొంటున్న సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు ధ్రువీకరించింది. తెలంగాణవ్యాప్తంగా వసతి గృహాలు, గురుకుల ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్ని సందర్శించిన సీఎస్‌డీ (సాంఘికాభివృద్ధి మండలి)- సిబ్బంది కొరతను, బడ్జెట్లో స్వల్ప కేటాయింపుల్ని తప్పుపట్టింది. నాణ్యమైన ఆహారం అందించడానికి ప్రత్యేక పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు కావాలనీ సూచించింది. ఉభయ రాష్ట్రాల్లో ప్రభుత్వ వసతి గృహాలను నిర్లక్ష్యం, అలసత్వం, అవినీతి, పర్యవేక్షణ లోపాలు చెండుకు తింటున్నాయన్నది చేదు నిజం. వాటికి చెల్లుకొట్టి సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో జవాబుదారీతనం పెంపొందించే నిర్ణయాత్మక కార్యాచరణకు ఇరు ప్రభుత్వాలూ నిబద్ధం కావాలి. ఇతోధిక కేటాయింపుల్లో ప్రతి రూపాయీ సద్వినియోగమయ్యేలా విధినిషేధాలు కట్టుదిట్టమై సవ్యంగా అమలు జరిగితేనే, వసతి గృహాల్లో గూడుకట్టిన విషాదం చెల్లాచెదురయ్యేది!

స్వేచ్ఛా విపణే సిసలైన సంస్కరణ

మార్కెట్ రూపాంతరీకరణ నేటి అవసరం



ఎస్.మహేంద్ర దేవ్



భారతదేశం తన 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని 2022లో జరుపుకొంటుంది. అప్పటికి మన వ్యవసాయాన్ని రూపాంతరం చెందించి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి నీతి ఆయోగ్ ఒక వ్యూహ పత్రాన్ని వెలువరించింది. ఇటీవల కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రైతుల ఆగ్రహ సెగ తగిలి భారతీయ జనతాపార్టీ ఓడిపోవడంతో ఈ వ్యూహాన్ని తప్పక అమలు చేయాల్సిన అవసరం ఎన్డీయేకు తన్నుకొస్తోంది. నీతి ఆయోగ్ పత్రం మూడు వ్యూహాలను సూచించింది. 1. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి పంటల వైవిధ్యాన్ని, ఉత్పాదకతను పెంచడం 2. పూర్తిగా వ్యవసాయం మీదనే దృష్టి కేంద్రీకరించకుండా ప్రైవేటు భాగస్వామ్యంతో వ్యావసాయిక వ్యాపారాలను ప్రోత్సహించడం. చిన్న, మధ్యతరహా రైతులు వ్యవసాయ వ్యవస్థాపకులుగా మారడానికి తోడ్పడటం. 3. గ్రామాల్లో ఆధునిక మౌలిక వసతులు నిర్మించి, వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ జోడించడానికి ఆహార శుద్ధి పరిశ్రమలను విస్తరించడం, తద్వారా వ్యవసాయ ఎగుమతులను భారీగా పెంచడం! లక్ష్యాలు బాగున్నా ఈ త్రిముఖ వ్యూహంలో కొంత అస్పష్టత ఉంది. వ్యవసాయ ఉత్పత్తి వ్యయం, ధరల సంఘం (సీఏసీపీ) స్థానంలో రాజ్యాంగంలోని 323 బి అధికరణ కింద వ్యవసాయ ట్రైబ్యునల్‌ను ఏర్పరచాలని వ్యూహ పత్రం సూచించింది. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు బదులు కనీస రిజర్వు ధర (ఎంఆర్పీ)ను ప్రవేశపెట్టాలన్నది ఆ సూచన. మండీల్లో వేలాలకు ఎంఆర్పీ ప్రారంభ ధర కావాలని సూచించింది. ఈ అంశాలపై పత్రంలో తగినంత స్పష్టత లేకపోవడం పెద్ద లోటు.

మెరుగైన ధరలకు మార్గం

మెరుగైన మార్కెట్లు ఏర్పడి వాటిలో రైతులు స్వేచ్ఛగా విక్రయాలు జరుపుకొనే పరిస్థితి నెలకొంటే పంటలకు అధిక ధరలు లభించి రైతు ఆదాయం రెట్టింపవుతుంది. కానీ, గడచిన 70 ఏళ్ల నుంచి రైతులకు గిట్టుబాటు ధరలే లభించనప్పుడు వారి ఆదాయాలు పెరగడమెలా సాధ్యం? విత్తనాలు, ఎరువుల వంటి ఉత్పత్తి సాధనాలపై రైతు చేసిన వ్యయానికి కుటుంబ సభ్యుల శ్రమ విలువను జోడించగా వచ్చే ధరకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ధరను కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయిస్తోంది. నిజానికి భారతీయ రైతుకు ఎంఎస్పీ, సబ్సిడీలు ఇస్తున్నా సక్రమంగా పంట సేకరణ జరగనిదే ప్రయోజనం ఉండదు. రైతుకు గిట్టుబాటు ధర చెల్లించడానికి 2018 కేంద్ర బడ్జెట్‌లో ప్రధానమంత్రి అన్నదాత ఆయ సంరక్షణ పథకం ప్రవేశపెట్టారు. మద్దతు ధర, విపణి ధరకూ మద్దతు ధరకూ మధ్య వ్యత్యాసం, ప్రైవేటుగా పంట సేకరణ, నిల్వ పథకం అనే మూడు అంశాలతో రూపొందిన ఆయ సంరక్షణ అభియాన్ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.

పైన చెప్పుకొన్న పథకాలకన్నా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకం వెయ్యి రెట్లు మేలు. తెలంగాణలో సంవత్సరానికి రెండుసార్లు (ఖరీఫ్, రబీ సీజన్లలో) 58.3 లక్షల మంది రైతులకు తలా రూ.4,000 చొప్పున పెట్టుబడి సాయం అందుతోంది. అంటే ప్రతి రైతుకు ఏడాదికి రూ.8,000 చొప్పున లభిస్తోందన్నమాట. ఇకపై ఏటా రూ.10,000 చొప్పున చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఒడిశా సైతం ప్రస్తుత సీజను నుంచి రూ.5,000 చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. రెండు సీజన్లకు రూ.10,000 చొప్పున అందనుంది. ఆ రాష్ట్రంలో మొత్తం 30.2 లక్షలమంది రైతులకు ఈ విధమైన చెల్లింపులు జరపడానికి రూ.3,016 కోట్లు కేటాయించారు. చిన్న, మధ్యతరహా రైతులకు సాగు పెట్టుబడి కింద ఈ సొమ్ము అందిస్తారు. ఇంకా 10 లక్షల భూమిలేని కుటుంబాలకు వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో జీవనాధారం కోసం కుటుంబానికి రూ.12,500 చెల్లిస్తారు. అందుకు ఏటా రూ.1,250 కోట్లు కేటాయించారు. 10 లక్షలమంది వ్యవసాయ కూలీలకు రూ.10,000 చొప్పున చెల్లించడానికి రూ.500 కోట్లు కేటాయించారు. తెలంగాణ, ఒడిశా పథకాలు ఎంతో ఆచరణీయంగా, ప్రయోజనకరంగా ఉండటంతో ఇతర రాష్ట్రాలూ ఈ తరహా నగదు బదిలీ పథకాలను ఆదర్శంగా తీసుకోవచ్చు. అయితే దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పంటలకు సుస్థిర ఏకీకృత జాతీయ విపణిని ఏర్పాటు చేయడం ఉత్తమ పరిష్కారమవుతుంది. దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. వ్యావసాయిక ఎగుమతుల వృద్ధికి అనువైన విధానాల రూపకల్పన సులువు అవుతుంది. కానీ, భారత్‌లో ఇంతవరకు చేపట్టిన వ్యవసాయ విపణి సంస్కరణలు చాలా పరిమితం. ఇవి దళారుల పాత్రను తగ్గించలేకపోవడం శోచనీయం. విపణి గొలుసులు, భౌతిక కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో వృద్ధి చెందలేదు. అందుకే కొన్నిసార్లు వినియోగదారులు కిలో టమాటాకు రూ.40 చెల్లిస్తున్నా రైతుకు కిలోకు ఒక్క రూపాయే అందుతోంది. వ్యవసాయ విపణులను సంస్కరించడం ద్వారా ఇలాంటి సమస్యలను పరిష్కరించవచ్చు కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కారణాలవల్ల సంస్కరణలను చేపట్టలేకపోతున్నాయి. జాతీయ వ్యవసాయ విపణి సృష్టికి కేంద్రం ఇ-నామ్ వేదికను సృష్టించాలని తలపెట్టినా, ఆ దిశగా పెద్ద పురోగతి లేదు. ఏ రకంగానైతేనేం రైతు తన ఉత్పత్తిని గిట్టుబాటు ధరకు అమ్ముకునే స్వేచ్ఛ ఉంటేనే వ్యవసాయం వర్ధిల్లుతుంది.

వ్యవసాయ విపణి సంస్కరణలకు కర్ణాటక అనుభవం ఉపయోగపడుతుంది. ఈ తరహా సంస్కరణలకు నియమ నిబంధనలను రూపొందించి అమలుచేసే సంస్థాగత ఏర్పాట్లు ఉండాలి. వ్యవసాయదారులు విపణుల్లో స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించగలగాలి. ఆధునిక వ్యాపార నిర్వహణకు తగిన వేదికలు కల్పించాలి. ఈ మూడు పనులు జరగనిదే విపణి సంస్కరణలు విజయవంతం కావు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రధానంగా వరి, గోధుమలకు వర్తింపజేస్తూ మిగతా పంటలపై శీతకన్ను వేయడం పెద్ద లోపం. ఈ మద్దతు ధరలు కూడా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే చెల్లిస్తున్నారు. చిరు ధాన్యాలు, పప్పు గింజలు, పండ్లు, కూరగాయలు, చేపలు, పాడి ఉత్పత్తులకూ మద్దతు ధరలు ఇవ్వాలి. పంటల వైవిధ్యంతో రైతుల ఆదాయాలు పెరగడంతోపాటు పర్యావరణ సంరక్షణా సిద్ధిస్తుంది. దేశంలోపల వ్యవసాయోత్పత్తుల వ్యాపారాన్ని మరీ ఎక్కువగా నియంత్రించినా, భూకమతాలు, ఆహార శుద్ధి పరిశ్రమల పరిమాణం, రుణ విపణి మీద అతిగా పరిమితులు విధించినా ప్రైవేటు పెట్టుబడులు ముందుకురావు. వ్యవసాయం, గిడ్డంగులు, సరకుల బట్వాడా, ఆహార శుద్ధి, మార్కెటింగ్, చిల్లర వర్తకం ఒకే గొలుసులా అభివృద్ధి చెందినప్పుడే సేద్యంలో విప్లవాత్మక మార్పు సిద్ధిస్తుంది. వ్యవసాయ ఎగుమతులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. మరో రకంగా చెప్పాలంటే సేద్యంలో గొలుసు అనేది పంట ఉత్పత్తితో మొదలై ఆహార శుద్ధితో ముగుస్తుంది. కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాల్లో గిడ్డంగులు, ఆహార శుద్ధి, వ్యవసాయ టోకు, చిల్లర వర్తకాలు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడంతో వ్యవసాయ గొలుసు సమర్థ ఫలితాలను ఇవ్వలేకపోతోంది. ప్రైవేటురంగ భాగస్వామ్యంతో పరిస్థితి మెరుగుపడుతుంది.

ఆదాయానికి అదనపు మార్గాలు



మన గ్రామాలు, పట్టణాలు వేగంగా రూపాంతరం చెందుతున్న దృష్ట్యా వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలు రెండూ అభివృద్ధి చెందితేనే సమగ్ర, సుస్థిర ప్రగతి సాధ్యపడుతుంది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావాలన్నా ఇది కీలకం. వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి గ్రామీణులకు జీవనాధారం ఏర్పరుస్తూనే క్రమంగా పల్లె జనాన్ని వ్యవసాయేతర రంగాలకు తరలించాలి. వర్షాభావ ప్రాంతాల్లో సన్నకారు, చిన్నకారు రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి. హరిత విప్లవానికి నోచుకోని తూర్పు భారత ప్రాంతాలను ముందుకు తీసుకురావాలి.

ఎగుమతి విధానాల అండ

భారతదేశ వ్యవసాయ ఎగుమతులను ప్రస్తుత 3,000 కోట్ల డాలర్ల నుంచి 2022కల్లా 6,000 కోట్ల డాలర్లకు పెంచాలన్నా, అప్పటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నా సమర్థమైన జాతీయ ఎగుమతుల విధానాన్ని రూపొందించడం ముఖ్యం. కానీ, మన ప్రభుత్వం ఇంతవరకు దీర్ఘకాలిక వ్యూహాన్ని సిద్ధం చేయకపోవడం శోచనీయం. పైగా చీటికిమాటికి వ్యవసాయ ఎగుమతులపై నిషేధాలు విధిస్తోంది. ఉల్లి, పప్పు గింజల ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారులకు నష్టం కలగకూడదని ఆ పంటల ఎగుమతిని నిషేధించే ప్రభుత్వం, అది రైతులకు నష్టదాయకమని గ్రహించడంలేదు. ఆకస్మిక నిర్ణయాలు కాకుండా స్థిరమైన కార్యాచరణకు పట్టం కట్టే దీర్ఘకాలిక ఎగుమతి విధానాన్ని ఇకనైనా రూపొందించాలి. పల్లె ప్రజలకు ఆరోగ్య బీమా కల్పించాలి, విద్యా వసతులు విస్తరించాలి. గ్రామీణులకు కనీస ఆదాయం లభించేలా తగు విధానాలు రూపొందించాలి. భూతాపాన్ని తట్టుకుని నిలిచే వంగడాలను రూపొందించి రైతులకు అందించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి. తక్కువ ఉత్పత్తి సాధనాలు, వనరులతో ఎక్కువ దిగుబడి సాధించే నవ్యరీతులను నేర్పాలి. ప్రకృతికి భంగం కలిగించకుండా సేద్యం చేయడం, జీరో బడ్జెట్ సహజ వ్యవసాయం వంటి నూతన వ్యవసాయ విధానాలతో వాతావరణ మార్పులను అధిగమించి దిగుబడి పెంచాలి. ఒప్పంద సేద్యాన్ని ప్రోత్సహించడం, కేరళలో మాదిరిగా కుటుంబశ్రీ మహిళా సంఘాలను, స్వయంసహాయక సంఘాలను పటిష్ఠపరచడం, రైతు సమాఖ్యల ఏర్పాటు, కాల్వలు, భూగర్భ జలాలను సమర్థంగా ఉపయోగించి ఎక్కువ ఉత్పాదకత సాధించడం వంటివి చేపట్టాలి. ఇందుకు సంబంధించిన సంస్థలను బలోపేతం చేయాలి. నీతి ఆయోగ్ వ్యూహ పత్రం లక్షించినట్లు రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడంతోపాటు అన్ని వర్గాలూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలి. నిలకడగా సమ్మిళిత అభివృద్ధి సాధించాలి. రుణమాఫీలు తాత్కాలిక ప్రయోజనాన్ని కలిగిస్తాయని గ్రహించి వ్యవసాయంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచినప్పుడు దీర్ఘకాల ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

(రచయిత- ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ సంచాలకులు, ఉపకులపతి)

బహుళ ప్రయోజనకర బంధం



మహేంద్రబాబు కురువ

బంగ్లాదేశ్ ఎన్నికల్లో వరసగా మూడోసారి విజయం సాధించడం ద్వారా అవామీలీగ్ పార్టీ అధినేత షేక్ హసీనా చరిత్ర సృష్టించారు. అంతకుముందు 2008, 2014 ఎన్నికల్లోనూ ఆమె గెలుపొందారు. మొత్తం 300 స్థానాలకుగాను 288 కైవసం చేసుకోవడం ద్వారా హసీనా తన పట్టు నిరూపించుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే హసీనాతో ఫోన్లో మాట్లాడిన ప్రధాని మోదీ- పొరుగుదేశంగా బంగ్లాతో అనుబంధం, ప్రాంతీయాభివృద్ధి, భద్రత, సహకారం తదితర అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా రెండు విషయాలను విశ్లేషించాలి. దక్షిణాసియాలో ప్రబలశక్తిగా ఉన్న భారత్ విదేశాంగ విధానం ప్రాతిపదికన దాదాపు 16 కోట్ల ముస్లిం జనాభా గల బంగ్లాదేశ్ ప్రాధాన్యాన్ని గుర్తించాలి. తూర్పుదిశగా కార్యాచరణ (యాక్ట్ ఈస్ట్) పేరిట భారత్ ప్రారంభించిన విధానంలో హసీనా పోషించగల పాత్రను మదింపు చేయాల్సి ఉంది.

వ్యూహాత్మక భాగస్వామ్యం

బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ కీలకపాత్ర పోషించింది. దానికి అన్ని విధాలా అండదండలు అందించింది. బంగ్లాదేశ్ ఏర్పాటుతో దక్షిణాసియా రాజకీయాల్లో మార్పులు వచ్చాయి. రెండు దేశాలు నాలుగు వేల కిలోమీటర్లకు పైగా సరిహద్దులను పంచుకుంటున్నాయి. ఇది తరచూ వివాదాలకు దారితీస్తోంది. సరిహద్దుల్లో బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాట్లు జరుగుతున్నాయి. ఇవి భారత్‌కు తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. అదే సమయంలో తూర్పు ఆసియాతో అనుసంధానానికి ఈ సరిహద్దు అవకాశం కల్పిస్తుంది. భారత్‌కు సంబంధించినంత వరకు వ్యూహాత్మకంగా బంగ్లాదేశ్ ముఖ్యమైనది. భారత విదేశాంగ విధానంలో, ముఖ్యంగా 'యాక్ట్ ఈస్ట్'కు సంబంధించి బంగ్లాదేశ్ కీలకం కానుంది.

'లుక్ ఈస్ట్' (తూర్పు దేశాల వైపు దృష్టి సారించడం) విధానం 1990లో ప్రారంభమైనప్పటి నుంచి ఆగ్నేయాసియా దేశాలతో భారత్ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. 2002 నుంచి భారత్ ఏటా 'ఆసియాన్' దేశాలతో శిఖరాగ్ర సదస్సులు నిర్వహిస్తోంది. 2009లో 'ఆసియాన్'తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. వ్యూహాత్మక సంబంధాలు మెరుగుపరచుకోవడం ద్వారా 2012లో భారత్-ఆసియాన్ సంబంధాలు మరో మైలురాయిని దాటాయి. ఫలితంగా రక్షణ, భద్రత పరంగా సంబంధాలు విస్తృతం కావడానికి అవకాశం ఏర్పడింది. సేవలకు సంబంధించి 2014లో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనుబంధాన్ని కొత్తతీరాలకు తీసుకెళ్లింది. దీంతో భారత్ 'లుక్ ఈస్ట్' విధానాన్ని 'యాక్ట్ ఈస్ట్' విధానంగా మార్చుకుంది. మోదీ చొరవతో ఆయా దేశాలతో సంబంధాలు బలోపేతం అయ్యాయి. ఇప్పుడు భారత్‌కు ఆసియాన్ నాలుగో అతిపెద్ద వ్యాపార భాగస్వామి కావడం విశేషం. గత రెండు దశాబ్దాలుగా రెండు వైపులా పెట్టుబడులు ఏడు వేల కోట్ల డాలర్లకు చేరడం విశేషం. ఈ నేపథ్యంలో భారత్



భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు

'లుక్ ఈస్ట్' విధానాన్ని ముందుకు తీసుకెళ్లడంలో బంగ్లాదేశ్ ప్రధాని హసీనాది కీలకపాత్ర అని చెప్పవచ్చు.

బంగ్లాదేశ్ వ్యూహాత్మకంగా కీలకస్థానంలో ఉంది. అందువల్ల దక్షిణాసియా, ఆగ్నేయాసియాల మధ్య ఆ దేశం వారధిలా వ్యవహరిస్తుంది. కాబట్టి తూర్పు ఆసియాతో వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానానికి సంబంధించి కీలకంగా ఉన్న బంగ్లాతో సత్సంబంధాలు నెరపాల్సిన అవసరం భారత్‌కు ఉంది. రవాణాతో పాటు భారత్‌లోని కొత్త విపణులకు చేరువ కావడానికి, అవకాశాల వృద్ధికి, ఈ బంధం అవకాశం కల్పిస్తుంది. బంగ్లా తన ఓడరేవులను, భూభాగాన్ని వాడుకునేందుకు అనుమతి ఇవ్వడంతో భారత్ పని తేలికైంది. ఇది ఇరు పక్షాలకూ మేలు చేసే నిర్ణయమే. బంగ్లాదేశ్‌కు సైతం దీనివల్ల ప్రయోజనం చేకూరనుంది. ఈశాన్య భారత్‌లోని మార్కెట్లు బంగ్లా వ్యాపారులకు అందుబాటులోకి వస్తాయి. భారత్ వ్యతిరేకిగా ముద్రపడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత ఖలేదా జియా అధికారంలో ఉంటే ఇది సాధ్యపడేది కాదు. తమ భూభాగాలను వాడుకునేందుకు భారత్‌ను ఆమె అనుమతించే వారు కారు.

హసీనా ఎన్నికతో రెండు దేశాల మధ్య భద్రతాపరమైన సంబంధాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. భారత్ అనుకూలవాదిగా, నమ్మకమైన నేస్తంగా ఆమెకు పేరుంది. బంగ్లా గడ్డపై భారత వ్యతిరేక కార్యకలాపాలను హసీనా గట్టిగా అడ్డుకున్నారు. ఈశాన్య భారతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న తీవ్రవాదుల పీచమణచారు. తమ దేశంలో తలదాచుకున్న తీవ్రవాద సంస్థ 'ఉల్ఫా' (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం) ప్రధాన కార్యదర్శి అనూప చెతియాను భారత్‌కు అప్పగించి నిబద్ధతను చాటుకున్నారు. బంగ్లాదేశ్ మద్దతు కొరవడటంతో మేఘాలయ, త్రిపురల్లోని తీవ్రవాద సంస్థలు ఆయుధాలు విడిచిపెట్టక తప్పలేదు. దీంతో తూర్పు సరిహద్దుల్లో ప్రశాంతత నెలకొని భారత్ ఊపిరి పీల్చుకుంది. తాజాగా ఉభయ దేశాలు వాణిజ్యం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల నిరోధంలో సహకరించుకునేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయి.

చైనాను నిలువరించడంలో మద్దతు

దక్షిణాసియాలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి భారత్‌కు బంగ్లా మద్దతు తప్పనిసరి. హసీనా హయాములో భారత్ పట్ల బంగ్లాదేశ్ సానుకూలంగా ఉంటున్న మాట వాస్తవమే. అదే సమయంలో చైనాతోనూ హసీనా సర్కారు సారథ్యంలోని బంగ్లాదేశ్ బలమైన స్నేహానుబంధం ముడివేసుకుని ఉండటం విస్మరించరానిది! రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం బంగ్లా వాణిజ్యంలో చైనా పెద్ద భాగస్వామి. బంగ్లాకు పెద్దయెత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్న దేశాల్లో చైనా మొదటిస్థానంలో ఉంది. చైనా నుంచి కొనుగోలు చేసిన జలాంతర్గాములను త్వరలోనే బంగ్లా ప్రారంభించనుంది. దానివల్ల బంగాళాఖాతంలో బలాబలాలపై ప్రభావం పడనుంది. తాను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బెల్ట్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)లో భాగంగా బంగ్లాదేశ్‌లో 2,400 కోట్ల డాలర్లను చైనా పెట్టుబడిగా పెట్టనుంది. చైనా పన్నిన అప్పుల ఉచ్చులో చిక్కుకుని శ్రీలంక, మాల్దీవులు, మలేసియా వంటి దేశాలు ఎన్నో చేదు అనుభవాలు ఎదుర్కొన్నాయి. వీటి నుంచి హసీనా పాఠాలు నేర్చుకోవలసి ఉంది. ఈ నేపథ్యంలో చైనా వలలో బంగ్లాదేశ్ పడకుండా చూడాల్సిన బాధ్యత భారత్‌పై ఉంది. భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు, దక్షిణాసియా విస్తృత ప్రయోజనాల రీత్యా ఇది చాలా అవసరం!

(రచయిత- హెచ్ఎన్‌బీ ఘర్వాల్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ డీన్)

ఉక్తి


మన అభిప్రాయాన్ని బయటకుచెప్పే వాగ్రూపమైన మాటను ఉక్తి అంటాం. మూకాభినయం ద్వారా కూడా మన అభిప్రాయాన్ని ఇతరులకు చెప్పగలం. కానీ ఆ ప్రక్రియలో స్పష్టత అంతగా ఉండదు.

మనసు లోపల బాగా ఆలోచన జరిగిన తరవాత బయటకు వచ్చిన ఉక్తిని (మాటను) యుక్తి అంటాం. యుక్తిలో చాతుర్యం ఉంటుంది. చమత్కారం ఉంటుంది. ఇది మాట్లాడేవారి కుశాగ్రబుద్ధిని వ్యక్తం చేస్తుంది. వింటున్నవారికి తన ఆశయాన్ని హత్తుకొనేటట్టు చేస్తుంది. యుక్తి శ్రోతల హృదయాల్లో తన ఉద్దేశాన్ని చెరగని ముద్రగా వేస్తుంది.

విశ్వామిత్రులవారి యాగం నిర్విఘ్నంగా పరిసమాప్తమైంది. ఆ తరవాత విశ్వామిత్ర మహర్షి మిథిలానగరంలో జరగబోయే సీతాదేవి స్వయంవరాన్ని తిలకించడానికి రామలక్ష్మణులను తనవెంట తీసుకువెళ్లాడు. రాజవీధిలో పురజనులు రామలక్ష్మణుల అలౌకిక రూప సౌందర్యాలను ముగ్ధులై చూడసాగారు. సీతమ్మ చెలికత్తెల్లో ఒకామె కూడా వారిరువురినీ చూసింది. రామలక్ష్మణుల రూప సౌందర్యాలను గురించి ఆమె సీతాదేవితో చెప్పింది- 'జానకమ్మా! ఆ సోదరుల రూపలావణ్యాలను వర్ణించి చెప్పడానికి నాకు మాటలు చాలవమ్మా. కానీ ఒక మాట చెప్పగలను. అదేమిటంటే నా నేత్రాలు వారిరువురినీ చూశాయి కానీ వారిని చూసిన నా కళ్లు మాట్లాడలేవు కదా. నా నాలుక మాట్లాడగలదు కానీ మాట్లాడగలిగిన నా నాలుకకు కళ్లు లేవు' అని చమత్కరించింది. ఆ యువకులిద్దరూ ఎంతటి రూపసులో సీతమ్మకు చక్కగా అర్థమైంది. చెలికత్తె మాటల్లోని చమత్కారానికి ఎంతగానో ఆనందించింది. అభినందించింది.

కొన్ని యుక్తులు శ్రోతలకు ఉపకారం చేస్తున్నట్లుగా ఉంటాయి. కానీ ఆ మాటలు స్పష్టంగా ఉండవు. అయితేనేం, లోలోపల మాత్రం ఆ మాటలు శ్రోతలకు సహాయాన్నే కాంక్షిస్తాయి. అందిస్తాయి.

నల దమయంతుల వివాహాన్ని కుదర్చడంలో హంసరాయబారం ప్రముఖపాత్ర వహించింది. బ్రహ్మదేవుడి రథాన్ని లాగే హంసల్లో అది కూడా ఒకటి. ఒకనాడు ఆ రాజహంస దమయంతితో అంది- 'కల్యాణీ, నీ వివాహం నలుడితో తప్పక జరుగుతుందని నాకు తెలుసు. ఎందుకంటే నేనొకనాడు విధాత రథాన్ని లాగుతూ నల మహారాజుకు భార్య ఎవ్వరవుతారని అడిగాను. రథచక్రాల శబ్దం వల్ల స్పష్టంగా వినిపించనప్పటికీ నీ పేరే విధాత చెప్పినట్టుగా



అంతర్యామి

అనిపించింది.' నలుడిపై దమయంతికి గల ప్రేమ ఎంతటి గాఢమైనదో తెలుసుకోవడానికి ఇలా యుక్తిగా మాట్లాడింది హంస.

యుక్తిలో ఉన్న శక్తి అమోఘమైనది. ఇలాంటి యుక్తితోనే గుహుడు భగవంతుడి అనుగ్రహాన్ని పొందగలిగాడు. సీతాలక్ష్మణులతో రామచంద్రుడు అరణ్యవాసం చేస్తున్న సందర్భంలో తమను గంగానది దాటించమని రాముడు గుహుడిని అడుగుతాడు. రాముడిని భగవంతుడిగా భావించిన భక్తుడు కాబట్టి తన భక్తిని రామచంద్రుడికి అన్యాపదేశంగా నివేదించుకున్నాడు గుహుడు- 'చిత్తం ప్రభూ! అలాగే. తమ ఆజ్ఞను పాటిస్తాను. కానీ నాదొక చిన్న మనవి. తమ పాదాలను కడగనిదే ఈ నా పడవ మీద తమ పాదాలను పెట్టనీయను. ఎందుకంటే తమ పాదధూళి సోకితే కఠినమైన రాయీ స్త్రీగా మారిపోయిందని విన్నాను. తమ పాదాలకున్న ధూళిని కడగనట్లయితే నా పడవ స్త్రీగా మారిపోతుందేమో! అలాంటప్పుడు ఈవలి ఒడ్డు నుంచి ఆవలి గట్టుకు జనాల్ని చేరవేస్తూ వారిచ్చే బాడుగతో పొద్దు గడిపే నా జీవితం ఎలా సాగుతుంది? కాబట్టి మొదట నేను పాదాలను కడుగుతాను. ఆ తరవాతే మీరు పడవలోకి వద్దురుగాని' అని వినయంగా అన్నాడు. రాముడు గుహుడి అభిప్రాయాన్ని గ్రహించి యుక్తితో వ్యక్తం చేసిన అతడి భక్తికి లోలోన ఆనందించాడు.

కొన్ని ఉక్తులు సూక్తులుగా రూపాంతరం చెంది ప్రజలకు ఉపయోగపడుతుంటాయి. భర్తృహరి సూక్తులు ఇలాంటివే. తరాలు మారినా రామాయణ మహాభారతాల్లో ఉన్న ధార్మిక, సామాజిక సూక్తులు నేటికీ ప్రజల్ని ఆదర్శమార్గంలో నడిపిస్తున్నాయి.

- రొబ్బి శివమాలతి

కోసుకుపోతున్న కరకట్టలు

- 40 ఏళ్లలో 20 మీటర్ల మేరకు కోత
- ప్రమాదకరం కాకున్నా చర్యలు అవసరం
- 15 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు
- కృష్ణా, తుంగభద్ర నదులపై ఐఐటీ మద్రాస్ అధ్యయనం

ఈనాడు - అమరావతి

కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత 40ఏళ్ల(1973-2011)ల్లో సమస్యాత్మక ప్రాంతంలో సరాసరిన 20మీటర్లు కుడి, ఎడమ గట్లు కోతకు గురైనట్లు ఐఐటీ మద్రాస్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. కోతకు గురయ్యేది తక్కువగా ఉన్నప్పటికీ కొన్ని రక్షణ చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉందని పేర్కొంది. కృష్ణా, తుంగభద్ర నదులకు వరదలు వచ్చిన సమయంలో కరకట్టలు కోతకు గురికావడం, నది స్వరూపం, ప్రవాహంలో వస్తున్న మార్పులు, ప్రాజెక్టుల్లోకి చేరుతున్న పూడికపై ఐఐటీ మద్రాస్ అధ్యయనం నిర్వహించింది. ఈ నివేదికను శుక్రవారం విజయవాడలో కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సీఈలు డి.రంగారెడ్డి, రవిశంకర్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్



శ్రీనివాసన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం విజయవాడలో కృష్ణానదీ ప్రాంతాన్ని పరిశీలించారు. కృష్ణా, తుంగభద్ర నదుల పరివాహకంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేసే బాధ్యతను కేంద్ర జల సంఘం, కేంద్ర జలవనరుల శాఖలు ఐఐటీ మద్రాస్‌కు అప్పగించాయి. 15 నదుల అధ్యయనం చేసే బాధ్యతను దేశంలోని పలు ఐఐటీలకు అప్పగించారు. ఇందులో భాగంగా ఐఐటీ మద్రాస్ అధ్యాపకులు కేపీ సుధాకర్, బాలాజీ నరసింహన్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం అధ్యయనం నిర్వహించింది.

ప్రతి 50 కిలోమీటర్లుకు ఒక భాగంగా..

30ఏళ్ల శాటిలైట్ చిత్రాలు, 10సంవత్సరాల సీడబ్ల్యూసీ వివరాలు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, భారత సర్వే శాఖ ఇచ్చిన వివరాలు, గణాంకాలను విశ్లేషించి ఐఐటీ బృందం నివేదికను రూపొందించింది. కృష్ణా నదిని ప్రతి 50 కిలోమీటర్లకు ఒక భాగంగా విభజించి విశ్లేషించారు. ప్రకాశం బ్యారేజీకి దిగువన, సముద్రంలో కలిసే ప్రాంతానికి సమీపంలో 1973-2011మధ్య కాలంలో కొన్ని ప్రాంతాల్లో వరదల కారణంగా 67.4మీటర్ల వరకు కరకట్ట కోతకు గురైనట్లు నివేదికలో వెల్లడించారు. అత్యధికంగా కోతకు గురైన ప్రాంతాలు ప్రకాశం బ్యారేజీకి దిగువనే ఉన్నాయి. ఎగువన మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో 22.6మీటర్లు, కర్ణాటకలో 37.3మీటర్ల మేర కట్ట కోతకు గురైనట్లు పేర్కొంది.

అధ్యయన ప్రాంతాలు

కృష్ణాలో కొయినా నదీ కలిసే ప్రాంతం నుంచి బంగాళాఖాతంలో కలిసే ప్రాంతం వరకు.. దీనికి ప్రధాన ఉపనదులుగా ఉన్న తుంగభద్ర, భీమాలను అధ్యయనానికి తీసుకున్నారు. తుంగ, భద్ర నదులు కలుస్తున్న ప్రాంతం నుంచి కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరం సమీపంలో కృష్ణా, తుంగభద్ర నదుల కలయిక ప్రాంతాన్ని పరివాహక ప్రాంతంగా తీసుకున్నారు. దీన్ని 11విభాగాలు విభజించి అధ్యయనం చేశారు. ఈ రెండు నదుల పరివాహక ప్రాంతాల్లో ఎగువ ప్రాంతాల్లోనే ఎక్కువగా వర్షపాతం నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. కరకట్టల విషయంలో కృష్ణాలో 10 సమస్యాత్మక ప్రాంతాలు, తుంగభద్రలో ఐదు సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నట్లు వెల్లడించారు.

నదీ స్వరూపంలో మార్పునకు కారణాలివే..

- ★ నదీ పరివాహక ప్రాంతంలో కట్టలు కోతకు గురికావడం
- ★ తక్కువ కాలంలో సంభవించే ప్రమాదకర వరద
- ★ ప్రాజెక్టుల నిర్మాణం
- ★ పరివాహక ప్రాంతంలో మట్టి, ఇసుక వెలికితీత
- ★ నీటి వాడకంలో మార్పులు
- ★ ఉపరితల ప్రాంతంలో భూవినియోగం
- ★ వాతావరణ మార్పులు
- ★ వ్యవసాయ సాగు
- ★ వృక్ష సంపద తరిగిపోవడం

ఉపశమన చర్యలు..

సమస్య పరిష్కారానికి కొన్ని ఉపశమన చర్యలను సూచించింది. మరింత అధ్యయనం చేయాల్సి ఉందని పేర్కొంది.

- ★ నదీ పరివాహక ప్రాంత కట్టల సక్రమ నిర్వహణ
- ★ ప్రాజెక్టుల నిర్మాణంపై తగిన జాగ్రత్తలు
- ★ వృక్ష సంపద పెంపు
- ★ నదీ పరివాహక ప్రాంతంలో వ్యవసాయాన్ని నియంత్రించడం
- ★ పరివాహక ప్రాంతాల్లో మట్టి, రాయి, ఇసుక తవ్వకాలను నియంత్రించడం

ఫిట్‌మెంట్ 50 శాతం ఇవ్వాల్సిందే

ఆర్టీసీ ఈయూ నేతల స్పష్టీకరణ

ఈనాడు-అమరావతి: తాము కోరుతున్న విధంగా 50శాతం ఫిట్‌మెంట్ ఇవ్వకపోతే సమ్మెకు వెనకాడబోమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. ఉద్యోగుల వేతనాల సవరణపై శుక్రవారం ఆర్టీసీ హౌస్‌లో ఆర్టీసీ ఎండీ ఎన్వీ సురేంద్రబాబుతో జరిపిన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొందని తెలిపారు. 20 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని యాజమాన్యం ప్రతిపాదించగా తాము అంగీకరించలేదని నేతలు వివరించారు. ఈ నెల 22న మరోసారి సమావేశమై చర్చించాలని నిర్ణయించామన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియ ఈ నెలాఖరు నుంచి ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ వెంటనే చేస్తామని, డిజ్ ఎంగేజ్‌లో ఉన్న వారిని ఖాళీల్లో తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. 2016 లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను ఈ నెల 24 లోపు చెల్లించేందుకు అంగీకరించారన్నారు. శనివారం మధ్యాహ్నం అన్ని కార్మిక సంఘాలతో చర్చించి అవసరమైతే ఐక్య ఉద్యమాన్ని ఏర్పాటు చేస్తామని ఈయూ నాయకులు దామోదరరావు తెలిపారు.

'గీతం'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు ఉపకులపతి శివప్రసాద్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి 22 వరకు దేశంలోని 50 పట్టణాల్లో ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్‌తోపాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, సికింద్రాబాద్, నాగోలు ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో 500 లోపు మార్కులు సాధించిన వారికి ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి నేరుగా ఫీజు తగ్గింపు ఉంటుందని వివరించారు. బీటెక్ కోర్సులో తొమ్మిది విభాగాలు, ఎంటెక్‌లో ఏడు విభాగాలతోపాటు బీఫార్మసీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో చేరాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు.

నౌహీరాకు ఫిబ్రవరి 1 వరకు రిమాండు పొడిగింపు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: గొలుసుకట్టు పథకం(మినీ సర్క్యులేషన్) పేరిట కోట్ల రూపాయలు స్వాహా చేసిన 'హీరా' గ్రూపు కంపెనీల అధినేత నౌహీరా షేక్‌కు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు రిమాండు విధిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని కలకడ, తిరుపతిలో హీరా గ్రూప్‌పై కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే కలకడ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో జిల్లా కోర్టు ఈ నెల 25 వరకు ఆమెకు రిమాండు విధించిన విషయం విదితమే. దీనిలో భాగంగా కలకడ, సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించి విచారణ నిమిత్తం పీటీ వారెంట్‌పై సీఐడీ పోలీసులు స్థానిక సబ్‌జైలు నుంచి ఆమెను కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నిందితురాలికి ఫిబ్రవరి ఒకటో తేదీవరకు రిమాండు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పోలీసులు ఆమెను స్థానిక సబ్‌జైలుకు తరలించారు.

ట్రంప్ సలహా సంఘంలో భారతీయ అమెరికన్‌కు చోటు!

వాషింగ్టన్: భారత సంతతి వ్యక్తులకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగిస్తున్న అధ్యక్షుడు ట్రంప్... కీలకమైన తన సలహా సంఘంలో కూడా ఓ భారతీయ అమెరికన్‌కు చోటు కల్పించాలని యోచిస్తున్నారు. గురువారం శ్వేతసౌధం వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. 'ఈరోస్ ఇంటర్నేషనల్' ఉత్తర అమెరికా వ్యవహారాల అధ్యక్షుడు, ఆ గ్రూప్ ప్రధాన ఆర్థికాధికారి పరమేశ్వరన్ (50)ను 'ఆసియన్ అమెరికన్స్ అండ్ పసిఫిక్ ఐలాండర్స్‌పై అధ్యక్షుడి సలహా సంఘం' సభ్యుడిగా ట్రంప్ నియమించనున్నారని తెలిపాయి. మాజీ అధ్యక్షుడు ఒబామా నెలకొల్పిన ఈ సంఘం... ఆసియా, పసిఫిక్ ద్వీపాల్లో నివసించే అమెరికన్ల ఆర్థిక, విద్య, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తుంది.

అంపశయ్య నవీన్‌కు 'లోక్‌నాయక్' పురస్కారం

- నేడు విశాఖలో ప్రదానం
- హాజరుకానున్న సుప్రీం న్యాయమూర్తులు

పెదవాల్తేరు (విశాఖపట్నం), న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీవేత్త అంపశయ్య నవీన్‌కు ఈ నెల 19న లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం అందజేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ శుక్రవారం విశాఖపట్నంలో తెలిపారు. ఎన్.మంగాదేవి, దివ్యాంగుల కోసం కృషి చేస్తోన్న వంశీ రామరాజులకు జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. విశాఖ మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పాల్గొంటారని తెలిపారు.

తెలుగు భాష, సాహిత్యాల అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

ఆంధ్రప్రదేశ్ భాషా సాహిత్య విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించడం అభినందనీయమని, అయితే గత నాలుగున్నరేళ్లుగా ఈ విషయం ముఖ్యమంత్రికి గుర్తుకు రాలేదా అని యార్లగడ్డ ప్రశ్నించారు. కమిటీవేసినా.. కార్యాలయం, సిబ్బంది, బడ్జెట్ కేటాయించలేదని, దీంతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు భాష, సాహిత్యం అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు.





విశాఖ జిల్లా అరకులో గాలిబుడగల సందడి ★ ఎయిర్ బెలూన్‌లో విహరించడానికి సిద్ధమైన మంత్రి అఖిలప్రియ దంపతులు, మంత్రి శ్రావణ్‌కుమార్

గాలిబుడగల గగనవిహారం

(మొదటి పేజీ తరువాయి)

దేశాల నుంచి తరలివచ్చిన పైలెట్లు ఒకదాని తరువాత ఒకటిగా 21 బెలూన్లను ఎగరవేశారు. గాలి వీచే దిశ ఆధారంగా వాటిని అరకు నలుమూలలా విహరించేలా చేశారు. వాటిని అనుసరించి రెండు పారామోటరింగ్‌లు మైదానం చుట్టూ చక్కర్లు కొట్టాయి. 1300 మీటర్ల ఎత్తువరకు ఎగిరిన బెలూన్లు ఒకదాన్ని ఒకటి అనుసరించి వెళ్లడం కింద నుంచి చూస్తున్న వారికి, బెలూన్లలో ప్రయాణించే వారికి గొప్ప అనుభూతిని మిగిల్చాయి. మొదటిగా ఐటీడీఏ పీవో బాలాజీతో పాటు గిరిజన విద్యార్థులను ఎక్కించుకున్న బెలూన్ గాలిలోకి ఎగిరింది. ముగ్గురు గిరిజన మహిళలతో పర్యాటక శాఖ అధికారి పూర్ణిమాదేవి రెండో దానిలో విహరించారు. ఆ తర్వాత ఏపీటీడీసీ ఎండీ హిమాన్షుశుక్లా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 50 మందికి బెలూన్‌లలో విహరించే అవకాశం కల్పించారు. శుక్రవారం సాయంత్రం బెలూన్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని మంత్రులు భూమా అఖిలప్రియ, శ్రావణ్ కుమార్ సందర్శించారు. అనంతరం వారిద్దరూ కలిసి ఒకే బెలూన్‌లో గగనంలో విహరించారు. సాయంత్రం గాలిబుడగలను వంద అడుగుల ఎత్తులో కట్టి నిర్వహించిన 'రాత్రి వెలుగులు' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

పొగమంచు కారణంగా ఆర్టీసీ బస్సు బోల్తా

13 మందికి గాయాలు

ఆత్మకూరు, సంగం, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ముంబయి రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున మంచు కారణంగా ఆర్టీసీబస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 13 మందికి గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా నంద్యాల నుంచి నెల్లూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని కొండమీద కొండూరు ప్రాంతంలో పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనం కనిపించలేదు. దగ్గరకు వచ్చాక ప్రమాదాన్ని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న పొలాల్లోకి డ్రైవర్ మళ్లించడంతో బస్సు బోల్తాపడింది. ఈ సంఘటనలో 13 మంది గాయపడ్డారు. బాధితులను సంగం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో కర్నూలుజిల్లా ఆళ్లగడ్డ రుద్రవరానికి చెందిన వందా వెంకట లక్ష్మమ్మ, వందా దస్తగిరి, బి. ప్రసాద్ (గోవిందపల్లి), రామలింగం (నంద్యాల), కనక వేటి కృష్ణజ (నంద్యాల), బి అనిల్ కుమార్, బి. మహేష్ (ఆత్మకూరు, కర్నూలు), పి.నాగార్జున, పి. శ్రీవిద్య (సిరివెళ్ల, కర్నూలు), బి మహేశ్వరరెడ్డి (మహానంది), కడప జిల్లా జంగాలపల్లికి చెందిన టి సురేంద్ర ఉన్నారు.

రూ.25 వేల కోట్ల రుణానికి యత్నం

- రైతు సాధికార సంస్థ తెచ్చే రూ.8000 కోట్లకు అదనం
- కార్పొరేషన్ల ద్వారా ఇతర రుణాలకు మంతనాలు

ఈనాడు - అమరావతి

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎదురయ్యే సవాళ్ల నుంచి గట్టెక్కడానికి పెట్టుబడి వ్యయం, రెవెన్యూ వ్యయం డిమాండ్‌ను తీర్చేందుకు జాతీయ బ్యాంకుల నుంచి మరో రూ.25 వేల కోట్ల రుణం తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రైతురుణమాఫీకి సంబంధించి నాలుగు, అయిదో విడతల బకాయిలు చెల్లించేందుకు రూ.8వేల కోట్ల రుణం ఇచ్చేందుకు బ్యాంకులు సుముఖత వ్యక్తం చేసినా కొన్ని అడ్డంకుల వల్ల ఆలస్యమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయం, బాండ్ల అమ్మకం ద్వారా వచ్చే రుణాలు వంటివి పరిగణనలోకి తీసుకున్న తర్వాత అంచనా వ్యయాన్ని, చెల్లింపులను పరిగణనలోకి తీసుకుని రుణ సమీకరణ ఒక్కటే మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. వివిధ జాతీయ బ్యాంకుల నుంచి వివిధ కార్పొరేషన్ల ద్వారా ఈ మొత్తం సమీకరించాలని నిర్ణయించారు.

పెండింగులో బిల్లులు..

ఇప్పటికే జలవనరుల కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్ల రుణం కోసం ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు మంత్రిమండలి ఆమోదించిన విషయం తెలిసిందే. ఆ మొత్తానికి ఇంకా బ్యాంకుల నుంచి ఎలాంటి హామీ లభించలేదు. ఇది కాకుండా ఇతర కార్పొరేషన్ల ద్వారా మరో రూ.15 వేల కోట్లు రుణ సమీకరణ ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ఇందుకు కూడా ప్రభుత్వ గ్యారంటీకి ఆమోదముద్ర వేయిస్తారు. ప్రస్తుతం దాదాపు రూ.12 వేల కోట్ల బిల్లుల చెల్లింపులు పెండింగులో ఉన్నాయి.

వచ్చే ఆదాయం జీతాలు, పింఛన్లకే..

వచ్చే ఆదాయాలను పరిగణనలోకి తీసుకుంటే ఉద్యోగుల జీతాలు, పింఛన్లకే ఎక్కువ మొత్తం సరిపోతుంది. మరో వైపు వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని రెట్టింపు చేశారు. ఈ మూడు నెలలకు సంబంధించి ఆ అంచనా వ్యయమూ రెట్టింపు అవుతుంది. నిరుద్యోగభృతి చెల్లింపులు బడ్జెట్ అంచనాల తర్వాత కొత్తగా వచ్చి చేరినవే. మరికొన్ని ప్రభుత్వశాఖల్లోను బడ్జెట్ అంచనాలు సవరించాల్సి వచ్చింది. పోలవరానికి సంబంధించి నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసినా ఆ మొత్తాలు తిరిగి రావడం లేదు. ఆ భారం ఇప్పటికే దాదాపు రూ.4,000 కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో జాతీయ బ్యాంకుల నుంచి అప్పు తీసుకురాక తప్పదని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

రైతు సాధికార సంస్థకు ఆస్తులు చూపే యత్నం

ప్రస్తుతం రైతు సాధికార సంస్థ ద్వారా రూ.8,000 కోట్ల రుణం ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి. 8.5శాతం వడ్డీకి ఈ మొత్తం ఇచ్చేందుకు మూడు బ్యాంకులు ముందుకొచ్చాయి. ఇప్పటికే ఆ రుణ సమీకరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే కొన్ని అవాంతరాలు ఏర్పడటంతో ఆలస్యమవుతోందని సమాచారం. ఈ నిధులు వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ బకాయిల చెల్లింపు ప్రక్రియ చేపడతారు. రైతు సాధికార సంస్థకు ఆస్తులు ఏమీ లేకపోవడంతో ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సయిజ్‌లో ప్రివిలేజ్ ఫీజును రైతు సాధికార సంస్థకు బదలాయించడంతో పాటు వ్యవసాయ రంగంపై ప్రభుత్వ పరంగా చేసిన ఖర్చు అంతా రైతు సాధికార సంస్థ ద్వారానే చేసినట్లు చూపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ ఖర్చు వల్ల సాధించే ఆదాయం అంతా రైతు సాధికార సంస్థ ఆదాయంగా చూపి రుణం పొందనున్నారు. ఈ నిధులను రైతుల రుణమాఫీ మొత్తంగా వారి ఖాతాలకు బదలాయించేందుకు ఫిబ్రవరి రెండో వారం వరకు పడుతుందని చెబుతున్నారు.

రూ.1500 కోట్ల ఓవర్ డ్రాఫ్టులోనే...

ప్రస్తుతం రూ.1,500 కోట్ల ఓవర్‌డ్రాఫ్టులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉంది. ఈ నెల 20 తర్వాత పరిస్థితి కొంత చక్కబడుతుందని ఆశిస్తున్నారు. కేంద్ర పన్నుల్లో వాటాలు, బాండ్ల అమ్మకం ద్వారా రుణాలతో కొంత నిధులు సర్దుబాటు కానున్నాయి.

10% రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం

హైకోర్టులో డీఎంకే వ్యాజ్యం

చెన్నై (లీగల్), న్యూస్‌టుడే: జనరల్ కేటగిరీలోని పేదలకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పది శాతం రిజర్వేషన్‌ను తమిళనాడులో విపక్ష పార్టీ డీఎంకే సవాల్ చేసింది. వీటిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి శుక్రవారం మద్రాస్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. "రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన కార్యక్రమాలు కాదు. శతాబ్దాలుగా విద్య, ఉద్యోగాలకు నోచుకోని సామాజిక వర్గాల ఉద్ధరణ, సామాజిక న్యాయం కోసమే ఈ విధానం. ఈ నేపథ్యంలో జనరల్ కేటగిరీలో పేదలకు పది శాతం రిజర్వేషన్ అనేది అసంబద్ధం. రాజ్యాంగానికి వ్యతిరేకం. ఇప్పటికే తమిళనాట 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. ఈ పరిమితి దాటకూడదు. రాజ్యాంగ సవరణ చేసినప్పుడు మూల సిద్ధాంతానికి విఘాతం కలగకూడదు'' అని భారతి తరఫు న్యాయవాది పి.విల్సన్ పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.

'ఏఐ'పై ఆన్‌లైన్‌లో ఐఐటీ-మద్రాస్ సిబ్బంది శిక్షణ

ఫిబ్రవరి 1న కోర్సు మొదలు

చెన్నై: కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతపై విద్యార్థులు, నిపుణులకు ఐఐటీ-మద్రాస్ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం వన్‌ఫోర్త్ ల్యాబ్స్ అనే అంకుర సంస్థను ఏర్పాటు చేసి.. 'పడ్-ఏఐ' పేరుతో కోర్సును అందుబాటులోకి తెస్తున్నారు. ఐఐటీ-మద్రాస్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు మితేశ్ ఖాప్రా, ప్రత్యూష్ కుమార్ ఈ సంస్థను నెలకొల్పినట్లు వివరించింది. ఏఐలోని 'డీప్ లెర్నింగ్' అంశంపై ఫిబ్రవరి 1న కోర్సు మొదలవుతున్నట్లు పేర్కొంది. నాలుగు నెలలపాటు సాగే ఈ ఆన్‌లైన్ కోర్సులో మొత్తం 80 గంటల పాఠాలు ఉండనున్నాయి. అసైన్‌మెంట్‌లు పూర్తి చేసేందుకు కూడా అంతే సమయాన్ని విద్యార్థులు వెచ్చించాల్సి ఉంటుంది. గణితం, పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై కనీస అవగాహన ఉన్నవారు దీన్ని నేర్చుకోవచ్చు. అందుకోసం ముందుగానే https://padhai.onefourthlabs.in/ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఈ నెల 24 వరకూ రిజిస్టర్ కావొచ్చు. విద్యార్థులు, బోధన సిబ్బందికి కోర్సు ఫీజు రూ.1000. వృత్తి నిపుణులకైతే రూ.5000.

శ్రీవారి ఆలయ 'భూకర్షణ'కు ఏర్పాట్లు

- పరిశీలించిన తితిదే ఈవో, అధికారులు
- శ్రీవారి సేవకులకు ఆహ్వానం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 31న భూకర్షణం, బీజావాపనం కోసం జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం తితిదే కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో భాస్కర్, చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి గోపీనాథ్‌జెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా సింఘాల్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ ఉదయం 9.15 గంటలకు జరిగే భూకర్షణం కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. ఆగమశాస్త్రం ప్రకారం భూకర్షణం చేయడం ఆనవాయితీ అని చెప్పారు. ఇందుకోసం హోమగుండాలు, వేదిక, ఆలయ నమూనా ఎగ్జిబిషన్, ప్రత్యక్ష ప్రసారాలు, డిస్‌ప్లే తెరల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీవారి కల్యాణోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. భూకర్షణం తర్వాత పది రోజులపాటు అర్చకులు ఆగమోక్తంగా వైదిక కార్యక్రమాలు, హిందూధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణ



వెంకటపాలెం వద్ద ఆలయ నిర్మాణ ప్రదేశంలో ఇంజినీర్లు, ఇతర అధికారులతో చర్చిస్తున్న తితిదే ఈవో సింఘాల్

పనులు ప్రారంభమవుతాయన్నారు.

5 ఎకరాల్లో ఆలయం: "శ్రీవారి ఆలయం కోసం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కేటాయించిన 25 ఎకరాల్లో.. 5 ఎకరాల్లో శ్రీవారి ఆలయం, మిగిలిన 20 ఎకరాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆడిటోరియం, కల్యాణ మండపాలు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. దాదాపు రూ.140 కోట్ల వ్యయంతో ఆలయం నిర్మించేందుకు తితిదే ధర్మకర్తల మండలి నిర్ణయించి టెండర్లకు ఆమోదం తెలిపింది'' అని సింఘాల్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు భూకర్షణం కార్యక్రమానికి శ్రీవారి సేవకులను, భజన మండళ్లను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌ను వీడని 'ఆపరేషన్ కమలం'

ఎమ్మెల్యేలంతా రిసార్టుల బాట

ఈనాడు డిజిటల్ బెంగళూరు: కర్ణాటక రాజకీయాలు మరోసారి రిసార్టుల బాటపట్టాయి. ఇపుడు కాంగ్రెస్ వంతు వచ్చింది. భాజపా కొత్త ఎత్తుగడలను ఓ కంట కనిపెడుతున్న కాంగ్రెస్ పార్టీ శాసనసభా సమావేశాన్ని శుక్రవారం బెంగళూరులో నిర్వహించింది. ఈ సమావేశం అనంతరం.. 'ఆపరేషన్ కమలం కారణంగా మా ఎమ్మెల్యేలకు భద్రత కరవైంది. రానున్న లోక్‌సభ ఎన్నికలపై చర్చించే నిమిత్తం మేమంతా బెంగళూరు నగర శివార్లలోని రిసార్టులో సమావేశమవుతాం' అని సీఎల్‌పీ నాయకుడు సిద్ధరామయ్య ప్రకటించారు. సమావేశానికి నలుగురు మినహా ఎమ్మెల్యేలంతా హాజరైనట్లు ప్రకటించారు. పార్టీకి విధానసభలో 80 మంది సభ్యులున్నారు. తొలి నుంచి పార్టీపై వ్యతిరేకత ప్రదర్శిస్తున్న సభ్యులు రమేశ్ జార్కిహొళితో పాటు మహేశ్ కుమటహళ్లి, బి.నాగేంద్ర, ఉమేశ్ జాదవ్ సమావేశంలో పాల్గొలేదు. వీరిలో నాగేంద్ర, ఉమేశ్ జాదవ్ వ్యక్తిగత కారణాలతో రాలేకపోతున్నట్లు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. అయితే, వీరిచ్చిన సమాచారంలో వాస్తవాన్ని విచారించే నిమిత్తం ఈ నలుగురికీ తాఖీదులు జారీ చేస్తున్నట్లు సిద్ధరామయ్య పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ, అమిత్‌షా విఫల యత్నం చేస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.

గర్భిణికి ఉద్యోగం ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

చెన్నై (లీగల్), న్యూస్‌టుడే: గర్భవతిగా ఉన్న కారణంగా పరుగులో నిర్ణీత సమయం కంటే అర నిమిషం వెనకబడిన మహిళకు మద్రాసు హైకోర్టు అండగా నిలిచింది. తనకు గ్రేడ్-2 పోలీసు కానిస్టేబుల్‌గా గానీ, గ్రేడ్-2 జైలు వార్డెన్‌గా గానీ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ ఆర్.దేవిక అనే మహిళ చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి జస్టిస్ ఎస్.విమల పరిష్కరించారు. ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో మహిళల పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా రుతుక్రమంలో ఉన్న వారిని, గర్భిణుల పరిస్థితిని లెక్కలోనికి తీసుకోవాలని తమిళనాడు యూనిఫార్మ్‌డ్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించారు. ఒక గర్భిణి పరుగులో అర నిమిషం వెనకబడడం ఆమెకు ఉద్యోగం ఇవ్వకపోవడానికి కారణం కాకూడదని స్పష్టం చేశారు. ఇలాంటివి మహిళలకు ఇచ్చే వ్యక్తిగత మినహాయింపులుగా పరిగణించకూడదని, భావి తరాన్ని అందజేస్తున్న వారికి ఇచ్చే గౌరవంగా భావించాలని హితవు పలికారు.

హజ్‌యాత్రకు 2,138 మంది ఎంపిక

ఈనాడు డిజిటల్, అమరావతి: హజ్‌యాత్రకు 2,138 మందిని ఎంపిక చేసినట్లు హజ్‌కమిటీ కార్యనిర్వాహక అధికారి మహ్మద్ లియాఖత్ అలీ తెలిపారు. వీరిలో 2,135 మంది పెద్దలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న వారందరినీ ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారు మొదటి విడత మొత్తం రూ.81 వేలను ఫిబ్రవరి 5లోపు కేంద్ర హజ్‌కమిటీకి చెల్లించాలని సూచించారు. చలానా ధ్రువపత్రాన్ని WWW.APSTATEHAJCOMMITTEE.COM వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్‌లో జమ చేయాలని తెలిపారు. బ్యాంకు అసలు చలానా, పాస్‌పోర్టు, ఛాతి ఎక్స్‌రే రిపోర్టు, రక్త పరీక్ష రిపోర్టు, శారీరక సామర్థ్య ధ్రువీకరణ పత్రాలను కూడా ఫిబ్రవరి 5వ తేదీలోగా విజయవాడలోని ఏపీ స్టేట్ హజ్ కమిటీ వద్ద జమ చేయాలని సూచించారు.

4 నుంచి ఎంఎల్‌పీలకు శిక్షణ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో మిడ్ లెవెల్ ప్రొవైడర్లుగా ఎంపికైన వారందరికీ ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఏపీలోని 13 జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఇగ్నో కేంద్రాల్లో వీరికి ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక విధానాన్ని కౌన్సెలింగ్ ద్వారా చేపట్టనున్నారు. సంబంధిత ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయాల్లో ఈ నెల 25 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులంతా వచ్చే నెల 4న ఆయా కేంద్రాల ఇన్‌ఛార్జులకు రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మధ్యాహ్న భోజన పథకం వంట ధరలు పెంపు

ఈనాడు, అమరావతి: మధ్యాహ్నభోజన పథకం వంట ధరలను 5.35 శాతం పెంచుతూ పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి రూ.4.15 చెల్లిస్తుండగా.. దీన్ని రూ.4.35కు పెంచారు. ప్రాథమికోన్నత, బాలకార్మికుల బడుల్లో విద్యార్థికి రూ.6.18 ఇస్తుండగా.. దీన్ని రూ.6.51కి పెంపు చేశారు.

వైద్య ఆరోగ్యానికి 1692 కోట్లు

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి మంజూరుకు కేంద్రం అంగీకారం
- ఆసుపత్రుల్లో కొత్త పథకాలకూ నిధులిచ్చేందుకు సంసిద్ధత
- ప్రభుత్వాసుపత్రుల్లో మరిన్ని అదనపు సేవలు
- పూనం మాలకొండయ్య వెల్లడి

ఈనాడు – అమరావతి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు కేంద్రం రూ.1,692 కోట్ల నిధుల మంజూరుకు అంగీకరించింది. ఈ మొత్తంలో 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత కింద రానున్న ఈ నిధుల్లో రూ.250 కోట్లను కొత్త పథకాల అమలుకు కేటాయించారు. ఇటీవల దిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య రాష్ట్రంలో చేపట్టిన సంస్కరణల గురించి వివరించగా సానుకూలత కనిపించింది.



కొత్త పథకాల అమలుకూ నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ప్రస్తుతానికి రూ.1,692 కోట్లను కేటాయించినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.

కొత్తగా ప్రభుత్వాసుపత్రుల్లో అదనంగా రాబోతున్న వైద్య సేవల గురించి శుక్రవారం పూనం మాలకొండయ్య వివరించారు. అవి..

★ 148 సామాజిక ఆసుపత్రుల్లో దంత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికి కేంద్రం రూ.12.5 కోట్లను కేటాయించింది.

★ అన్ని జిల్లా ఆసుపత్రుల్లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ యూనిట్లు రాబోతున్నాయి. ఇందుకు కేంద్రం రూ.13 కోట్లు కేటాయించింది.

★ వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా వినికిడి పరికరాలను ఇవ్వనున్నారు. 65 సంవత్సరాలకు పైబడిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకోసం కేంద్రం రూ.15 కోట్లు విడుదల చేసేందుకు సమ్మతిని తెలిపింది. 28 ప్రాంతీయ, 13 జిల్లా ఆసుపత్రుల్లో ఈ యంత్రాలను అందిస్తారు.

★ రాష్ట్రంలో 21 ప్రాంతీయ ఆసుపత్రులు, 13 జిల్లా ఆసుపత్రుల్లో కంటికి సంబంధించిన చికిత్సలు చేయడం, నేత్రాలు భద్రపరచడం కోసం కొత్త పరికరాలతో యూనిట్లు ప్రారంభించనున్నారు. కొత్తగా 122 టెలీ ఆప్తమాలజీ కేంద్రాలు మంజూరయ్యాయి. పట్టణాలు, నగరాల్లోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు అనుసరించి వీటిని ఏర్పాటు చేయనున్నారు.

★ ఏఎన్ఎంలకు అందచేసే ట్యాబ్‌ల కోసం కేంద్రం రూ.14 కోట్లు కేటాయించింది.

★ 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 60 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయస్థాయి ప్రమాణాలతో ప్రసవాల గది(లేబర్ రూములు)లను ఆధునికీకరించనున్నారు. ప్రసవ సమయంలో సౌకర్యంగా ఉండేందుకు గర్భిణిలకు మాతృసమ్మాన్ దుస్తులు అందజేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులు ఇచ్చేందుకూ కేంద్రం అంగీకరించింది.

పొరుగు సేవల సిబ్బందికి వేతనాల పెంపు

ఈనాడు, అమరావతి: పురపాలక సంఘాల్లోని వివిధ విభాగాల్లో పనిచేసే పొరుగు సేవల సిబ్బందికి వేతనం పెంచుతూ పరిపాలనశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. 2016 ఆగస్టులో ఆర్థికశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వర్తింప చేయాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల సాధారణ నిధుల నుంచి వీటిని చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేటగిరి-1లో వారికి రూ.17,500, కేటగిరి-2లో వారికి రూ.15,000, కేటగిరి-3 లోని వారికి రూ.12,000 చొప్పున ఇస్తారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, వర్క్ సూపర్‌వైజర్, టెక్నికల్ సూపర్‌వైజర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు, ల్యాబ్ అసిస్టెంట్ తదితరులు కేటగిరి-2 కిందకు వస్తారు.

సరిదిద్దాలి: వేతనాల పెంపు న్యాయబద్ధంగా లేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రకటనలో పేర్కొంది. వీటిని వెంటనే సరిదిద్దాలని కోరుతూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్‌కు వినతిపత్రం అందించామన్నారు.

ఉద్యమకారుడు తెలకపల్లి నర్సింహయ్య కన్నుమూత



నర్సింహయ్య

కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాకు చెందిన సీపీఎం నేత, ఉద్యమకారుడు తెలకపల్లి నర్సింహయ్య(91) కన్నుమూశారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న కుమారుడు తెలకపల్లి రవి వద్ద గత కొంతకాలంగా ఉంటున్నారు. శుక్రవారం ఇంట్లోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాయంత్రం ఆయన పార్థివదేహాన్ని కర్నూలు కృష్ణానగర్‌లోని స్వగృహానికి తీసుకొచ్చారు. ప్రజల సందర్శనార్థం పార్థివదేహాన్ని శనివారం ఇంటి వద్దే ఉంచి ఆదివారం ఉదయం సుందరయ్య భవన్‌కు తీసుకెళతారు. అక్కడి నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. 1952లో కమ్యూనిస్టు పార్టీలో చేరిన తెలకపల్లి నర్సింహయ్య.. దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు చాలాకాలం జైలు జీవితం గడిపారు. జిల్లాలో కరవు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. గంజి సరఫరా కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశారు.

పలువురి సంతాపం: తెలకపల్లి నర్సింహయ్య మృతికి సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు సంతాపం తెలిపాయి. రాయలసీమ వెనకబాటు, కార్మికుల సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటాలు చేశారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, పి.మధు పేర్కొన్నారు.

ఎకరం రూ.40 లక్షలు

ఈనాడు–అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం మేకవానిపాలెం పరిధిలోని చిలకలపూడి, పోతేపల్లి గ్రామాల్లో 122.95 ఎకరాలను.. ఎకరా రూ.40 లక్షల చొప్పున కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంధన, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు.

విద్యారంగ పరిరక్షణకు ఫిబ్రవరి 19న చలో దిల్లీ

ఈనాడు, అమరావతి: విద్య వ్యాపార, కార్పొరేటీకరణను నిరసిస్తూ జాతీయస్థాయిలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల 19న దిల్లీలో మహాప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం సామాన్యుడికి అందనంత ఖరీదుగా మారిపోతున్నాయని పేర్కొన్నారు. 'సేవ్ ఎడ్యుకేషన్-సేవ్ కంట్రీ' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రెండు రైళ్ల రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: పశ్చిమ మధ్య రైల్వే పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున రెండు ప్యాసింజరు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ మండల వాణిజ్య అధికారి ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విజయవాడ నుంచి బెంగళూరు కంటోన్మెంట్ వెళ్లే రైలు (నం.56504)ను ఈ నెల 19 నుంచి 25 వరకు, బెంగళూరు కంటోన్మెంట్ నుంచి విజయవాడ వచ్చే రైలు (నం. 56503)ను ఈ నెల 20 నుంచి 25 వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

ఏడీసీ డైరెక్టర్‌గా కె.శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: అమరావతి అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా కె.మాణిక్యరాజ్ నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా ఉన్న ఆయనను ఇక్కడకు బదిలీ చేసి.. నియామకానికి వేచి ఉన్న డిప్యూటీ కలెక్టర్ జి.గణేశ్‌కుమార్‌ను ఆ స్థానంలో నియమించారు.





బ్లాస్ట్‌ఫర్నేస్–3 లోపలి భాగంలో మంటలు వ్యాపిస్తున్న దృశ్యం ★ ప్రమాద ఘటనలో కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదం

- మంటల్లో కాలిపోయిన వాహనాలు, యంత్రాలు
- తప్పిన ప్రాణనష్టం
- సామర్థ్యానికి మించి ఉత్పత్తి చేయడమే కారణమా?

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో సాంకేతిక కారణాలతో శుక్రవారం ఉదయం బ్లాస్ట్‌ఫర్నేస్-3లో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. పల్వరైజ్డ్ కోల్ ఇంజిక్షన్ (పీసీఐ) చేస్తున్న క్రమంలో పీసీఐ లాన్స్ పైపులో ఒత్తిడి పెరిగి తెగిపోవడంతో ట్యూయర్ 20లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో పాటు, ముడి సరకు ఎగిసిపడింది. ఈ ఘటనలో 7 ద్విచక్ర వాహనాలు, ఒక పొక్లెయిన్, రెండు ఫోర్క్ లిఫ్టులు కాలిపోయాయి. బ్లాస్ట్‌ఫర్నేస్ చుట్టూ ఉండే నాలుగు టాపింగ్‌ల్లో... 4వ నంబర్ టాపింగ్ చేస్తున్న కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి బయటకు పరుగులు తీశారు. 2వ నంబర్ టాపింగ్ చేసే కార్మికులు అప్పుడే అల్పాహారం చేసేందుకు బయటకు వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న ఉక్కు సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్ సామర్థ్యం 7200 మిలియన్ టన్నులు కాగా, ఒక్కసారిగా 9200 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. మరికొందరు మాత్రం ముడిసరకు అందుబాటులో లేని సమయంలో ఉత్పత్తి తగ్గించుకోవడం, ముడిసరకు రాగానే ఉత్పత్తి పెంచడం ద్వారా యంత్రాల్లో వ్యాకోచ, సంకోచాల కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని పేర్కొంటున్నారు. కర్మాగారంలో స్వల్ప ప్రమాదమే జరిగిందని, ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేదని, ప్రస్తుతానికి బ్లాస్ట్‌ఫర్నేస్-3ను షట్‌డౌన్ చేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంత నష్టం వాటిల్లిందో వెల్లడించలేదు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

- నామినేషన్ల గడువు ముగిసే వరకూ అవకాశం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది

ఈనాడు డిజిటల్ – అమరావతి



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది, తెదేపా నేత వర్ల రామయ్య, వైకాపా నేతలు అంబటి రాంబాబు, మల్లాది విష్ణు, సీపీఎం ప్రతినిధి వై.వెంకటేశ్వరరావు

ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. రాబోయే శాసన సభ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకూ కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి సమస్యనైనా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. శుక్రవారం సచివాలయంలో వివిధ రాజకీయపార్టీలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు ప్రతినిధులు వివిధ అంశాలను ప్రస్తావించగా వాటిని పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ సమావేశానికి హాజరైన తెదేపా, వైకాపా, భాజపా, కాంగ్రెస్, సీపీఎం పార్టీల ప్రతినిధులకు జనవరి 11న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా హార్డ్ డిస్క్‌లను అందించారు. అనంతరం ద్వివేది విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా తనను నియమించారని తెలిసినప్పుడు విస్మయానికి గురయ్యానని, దీనిని ఒక సవాల్‌గా స్వీకరిస్తున్నానన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు కూడా సమావేశంలో తాము లేవనెత్తిన అంశాలను విలేకరుల వద్ద వివరించారు.

తప్పులు సవరించుకోవచ్చు

ఎన్నికలకు మరికొన్ని నెలలు సమయం ఉన్నందున ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో తప్పులు సవరించుకునే అవకాశం ఉంది. మార్పులు చేర్పులు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. –వర్ల రామయ్య, ఆర్టీసీ ఛైర్మన్, తెదేపా ప్రతినిధి

54 లక్షల నకిలీ ఓట్లు

ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో 54,36,579 నకిలీ ఓట్లున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడా ఏపీ ఓటరు జాబితాలో ఉన్నట్లు గుర్తించాం. ఉదాహరణలు, ఆధారాలతో సహా ఎన్నికల ప్రధానాధికారికి సమర్పించాం. నకిలీ ఓట్లను కచ్చితంగా తొలగిస్తామని హామీనిచ్చారు.
– అంబటి రాంబాబు, మల్లాది విష్ణు, వైకాపా ప్రతినిధులు

ఈవీఎంల పరిశీలనలో అవకాశమివ్వాలి

'ఎన్నికల ప్రక్రియ, ఓటరు జాబితా తదితర సమాచారం కోసం జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి హామీనిచ్చారు. ఈవీఎంల పరిశీలనలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా అవకాశమివ్వాలని కోరాం.
–వై.వెంకటేశ్వరరావు, సీపీఎం ప్రతినిధి

అపోహలు తొలగించాలి

'కొందరు మంత్రులు తమ నియోజకవర్గాల్లోని ప్రజలకు ఫోన్ చేసి ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్త స్థాయిని అడుగుతున్నారు. వ్యతిరేకంగా సమాధానం చెబితే తమ ఓట్లను తొలగిస్తారేమోనన్న అపోహ ప్రజల్లో ఉంది. దీన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం. దీనిని తమ దృష్టికి వస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు.'
– జూపూడి రంగరాజు, భాజపా నేత

ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింపు

ఈనాడు–అమరావతి: గ్రేటర్ విశాఖ, గుంటూరు, కర్నూలు, ఒంగోలు, తిరుపతి నగర పాలక సంస్థలు, కందుకూరు పురపాలక సంఘం, రాజంపేట, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీలకు ప్రత్యేకాధికారుల పాలన జనవరి 1 నుంచి జూన్ 30 వరకు మరో ఆరు నెలలు పొడిగిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్ ఉత్తర్వులిచ్చారు.

నిధుల సమీకరణ కోసం: సీఆర్‌డీఏ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు నిధుల సమీకరణ కోసం భూములు హామీగా చూపి బ్యాంకుల నుంచి రుణం కోసం సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఎదుట ఆందోళన

- ఆలస్యం, గుర్తింపు కార్డులు లేవని పలుచోట్ల పరీక్షకు అనుమతి నిరాకరణ

తిరుపతి, పీఎంపాలెం (విశాఖపట్నం), న్యూస్‌టుడే: డీఎస్సీ ఎస్జీటీ పరీక్షల కోసం వచ్చిన సుమారు 80 మందిని ఆలస్యం, గుర్తింపు కార్డులు లేకపోవడంలాంటి కారణాలతో అనుమతించకపోవడంతో అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కేంద్రాల ఎదుట ఆందోళన చేశారు. దీంతో చిత్తూరు జిల్లా తిరుపతి పరిధిలో ఉన్న చెర్లోపల్లి అయాన్ డిజిటల్ జోన్, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాల వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు వచ్చి అభ్యర్థులకు సర్దిచెప్పి పంపించారు. ఉదయం 8.45లోపు, మధ్యాహ్నం 1.45లోపు అభ్యర్థులు హాజరైతేనే అనుమతిస్తామని అధికారులు ఆయా కేంద్రాల వద్ద ప్రచారం చేశారు. తాము 8.45 కంటే ముందుగా వచ్చినా రామిరెడ్డిపల్లె కేంద్రం వద్ద ఉన్న అధికారులు ఇతరులతో మాట్లాడుకుంటూ తమను లోనికి అనుమతించలేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నామని తమ నిరీక్షణ నిష్ఫలమైందని వాపోయారు. దీనిపై తిరుపతి ఉప విద్యాశాఖాధికారి, ఇన్‌ఛార్జి అధికారి విజయేంద్రరావును వివరణ కోరగా.. అభ్యర్థులను అధికారులెవరూ ఆపలేదని బదులిచ్చారు. కొందరు సరైన గుర్తింపు కార్డులు తెచ్చుకోలేదని అలాంటి వారిని మాత్రమే అనుమతించలేదని స్పష్టం చేశారు.

★ విశాఖ నగర పరిధి పీఎంపాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రానికి వచ్చిన తూర్పుగోదావరి జిల్లా అన్నవరానికి చెందిన బి.హేమలతాకుమారి, విజయనగరం జిల్లా మానాపురం వాసి టి.మురళీధర్‌లు ముందే వచ్చినప్పటికీ.. గుర్తింపు కార్డులు తీసుకురాలేదన్న కారణంగా వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. అనంతరం చరవాణిలో ఆధార్‌పత్రాలు చూపినా అప్పటికే సమయం మించి పోవడంతో అనుమతి నిరాకరించారు. కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో గుంటూరు జిల్లాకు చెందిన పల్లా ఉమాదేవి, తూర్పుగోదావరి జిల్లా తుని ప్రాంతానికి చెందిన కాకర నానాజీలకు గుర్తింపుకార్డులు లేని కారణంగా అనుమతి నిరాకరించారు.

బీసీలకు ప్రాధాన్యం ఇచ్చింది తెదేపాయే: తితిదే ఛైర్మన్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజకీయంగా బీసీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన పార్టీ తెదేపాయేనని తితిదే ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెదేపా బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం లేదని తెలంగాణకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారని విలేకరులు ప్రస్తావించగా సుధాకర్ స్పందించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ '1933లో తితిదే పాలకమండలి ఏర్పాటయింది. తొలిసారిగా సీఎం చంద్రబాబు నన్ను ఛైర్మన్‌గా నియమించారు. ఎంతో మంది బీసీలకు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలుగా తగిన ప్రాధాన్యం ఇచ్చింది తెదేపా' అని పేర్కొన్నారు.

దావోస్ సదస్సుకు అమెరికా బృందం దూరం

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు తాను హాజరు కావడంలేదని ఇప్పటికే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్... తాజాగా తన బృందం పర్యటననూ రద్దు చేశారు! ప్రభుత్వం పాక్షికంగా మూతపడినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్వేతసౌధం మీడియా కార్యదర్శి సారా శాండర్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈతరం



ఆవిష్కరణ ధీరులు

పరిష్కారం ఎవరు కనుక్కొంటారు?
కష్టాలు పడిన వారే..!
వారికే తెలుసు దాని వల్ల కలిగిన ఇబ్బంది. అందుకే పరిష్కార మార్గం వారే చక్కగా సూచించగలరు. చదువుతో సంబంధం లేదు. ఏ డిగ్రీ పట్టాలు అవసరం లేదు. అలా పదో తరగతి వరకే చదివిన ఓ యువకుడు తాను ఎదుర్కొన్న కష్టాలను అధిగమించేందుకు చేసిన ఆవిష్కరణ అతన్ని పారిశ్రామికవేత్తను చేసింది. రైతుల కష్టానికి ఆ యువకుడు చూపిన పరిష్కారం... కేంద్ర పురస్కారమూ పొందింది. ఆ యువకుడెవరు? ఏం చేశాడు? తెలుసుకోవాలంటే... చదివేయండి.

కలుపుపై గెలుపు



నూతన ఆవిష్కరణలకు పెద్దగా చదువుకోవాల్సిన అవసరమే లేదని.. తపనుంటే చాలని నిరూపించాడు మహిపాల్‌చారి. ఈ యువకుడిదిపేద రైతు కుటుంబం. ఉన్నత చదువులు చదువుకోడానికి ఇబ్బంది. పదో తరగతితో బడి మానేసి పనికి కుదురుకున్నాడు. జమ్మికుంటలో బైక్ మెకానిక్‌గా చేస్తూ కుటుంబానికి భారం కాకుండా బతకడం ప్రారంభించాడు. చేస్తున్న పని తృప్తి నివ్వలేదు. మళ్లీ సొంతూరు సీతారాంపురం వచ్చాడు. ఉన్న రెండెకరాలను సాగు చేయడం మొదలుపెట్టాడు. పంట పండించడంలో కలుపు ఏ రైతుకైనా అతి పెద్ద సమస్య. దాన్ని మహిపాల్ ఎదుర్కొన్నాడు. కలుపు తీయాలంటే కూలీల కొరత. ఎక్కువ కూలీ ఇవ్వడానికి ఆర్థిక స్థోమత సహకరించేది కాదు. కలుపు తీసే యంత్రాన్ని తయారుచేస్తే బాగుంటుందని తలచాడు. పరిశోధించాడు. తనకున్న పరిజ్ఞానాన్ని జోడించాడు. సెకెండ్ హ్యాండ్ ఆటో ఇంజిన్ కొన్నాడు. రెండు చక్రాలు బిగించాడు. హ్యాండిల్, క్లచ్‌ను తీగలతో అనుసంధానం చేశాడు. ఇంటర్నెట్ సాయం తీసుకొన్నాడు. అయిదు నెలలు కష్టపడి డీజిల్‌తో నడిచే మినీ కల్టివేటర్‌ను తయారుచేశాడు. పొలంలో కాలినడకన తిరుగుతూ పత్తి, మిరప పంటల్లో కలుపు తీసేందుకు ఉపయోగించాడు. ఫలితం సాధించాడు. ఒక లీటర్ డీజిల్‌తో రెండు ఎకరాల్లో కలుపుతీసే సామర్థ్యం ఈ యంత్రం ప్రత్యేకత. దీన్ని చూసిన చుట్టుపక్కల రైతులు తమకూ ఒకటి చేయించమని కోరారు. నలుగురు నాలుగు రోజులు కష్టపడి... రూ.32వేల పెట్టుబడి పెడితే ఈ యంత్రం తయారవుతుంది. పొలంలో తిరగడానికి ఇనుప చక్రాలు, రోడ్డు మీద నడవడానికి టైర్లు బిగించి కొంత అప్‌గ్రేడ్ చేశాడు.

> "ఈ మినీ కల్టివేటర్‌తో కాలి నడకన పంట పొలాల్లో కలుపు తీసే అవకాశాలున్నాయి. అలా కాకుండా కూర్చొని కలుపు తీసేందుకు వీలుగా టైర్లతో కూడిన యంత్రం తయారు చేయాలని ప్రయత్నిస్తున్నా. మరో రెండు నెలల్లో ఆ యంత్రం సిద్ధం కానుంది."
> -మహిపాల్ చారి



శ్రీవరిసాగు వీడర్...

తన ఉత్పత్తిని పెంచాడు. ఇప్పుడు 10మందికి ఉపాధి చూపుతున్నాడు. పరిశ్రమగా ఏర్పాటు చేసి... మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కర్షకులకు ఈ యంత్రాలను ఉత్పత్తి చేసి అందిస్తున్నాడు. అంతేకాదు శ్రీవరి సాగులోనూ కలుపు సమస్యను పరిష్కరించడానికి మరో యంత్రానికి రూప కల్పన చేశాడు. దీని పేరు శ్రీవరిసాగు వీడర్. ఒక లీటర్ పెట్రోలుతో ఇది ఎకరం పొలంలో కలుపును తీస్తుంది. కొంచెం కష్టం, ఇంకొంచెం సృజన... సాధారణ యువకుడిని పారిశ్రామిక వేత్తగా మారుస్తాయని నిరూపించాడు.

ప్రశంసలు.. గుర్తింపు

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్(ఎన్ఐఎఫ్) ఆధ్వర్యంలో 2015లో దిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో వ్యవసాయ పరికరాల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి కడివెండి మహిపాల్‌చారి హాజరై కలుపు యంత్రం(మినీ కల్టివేటర్)ను ప్రదర్శించారు. ఇక్కడ కన్సోలేషన్ బహుమతి లభించగా రాష్ట్రపతి అవార్డు సైతం దక్కింది. రెండోసారి జాతీయ పురస్కారం లభించింది. నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు-2018ను ఈ నెల 4న దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు చేతుల మీదుగా అందుకున్నారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ మంత్రిత్వ శాఖ నుంచి పురస్కారంతోపాటు రూ.5లక్షల నగదును అందుకున్నాడు.

- గోగుల నాగరాజు, పరకాల



రూ.150కి ఒక స్టూల్...
రూ.300కి మంచి ఫర్నీచర్..
ఇలా అతి తక్కువ ధరలోనే పిల్లలకు మంచి స్కూల్ బ్యాగు...
ఎక్కడ..? ఎక్కడ? దొరుకుతాయనేగా మీ ప్రశ్న.
సులభంగా దొరికే అట్టముక్కలతో బహుళ ప్రయోజన ఫర్నీచర్‌ను సొంతంగా తయారు చేస్తున్న పాతబస్తీ మహిళల దగ్గరకి వెళ్లాలి మనం.
వారిని అలా నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దుతున్న ఓ ఆర్కిటెక్ట్ తలుపు తట్టాలి మనం.
ఎవరా ఆర్కిటెక్ట్? ఏమతని లక్ష్యం?

■ అంధులు, మూగ, చెవిటి వారికోసం సంతోష్ బీఎమ్‌డీ(బ్లైండ్, మ్యూట్, డెఫ్) అనే వాచ్‌ను రూపొందించాడు. 2015లోని వంద ఉత్తమ ఆవిష్కరణల్లో ఒకటిగా ఎంపికైంది.

■ హెచ్126 పేరుతో రూ.2లక్షలకే ఇల్లు నిర్మించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఇది ఇప్పుడు ప్రయోగ దశలో ఉంది. త్వరలోనే దీన్ని పేదలకు అందించాలన్నది సంతోష్ ఆశయం.

ఆలోచించే చెయ్యి

పదిమందికి ఉపయోగపడాలనే తపనుంటే... ఏం పనిచేస్తున్నా మన కళ్లకు దీనులే కన్పిస్తుంటారు. వారి కష్టమే దర్శనమిస్తుంటుంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగి ఆస్ట్రియాలో ఆర్కిటెక్ట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన కేతన్ సంతోషకుమార్‌ను అలాంటి తపనే కుదిపేసింది. ఆస్ట్రియాలో ఆర్కిటెక్ట్ చదువుతున్నా, పనిచేస్తున్నా అతని మనసు మాత్రం హైదరాబాద్‌లోని మురికివాడల చుట్టూ తిరుగుతుండేది. వారికేదైనా చేయాలనే కల కనేవాడు. చదివిన కోర్సుకు విలువుంది.. డబ్బులు విపరీతంగా సంపాదించుకునే అవకాశముంది. అయితే అవేమీ పట్టించుకోలేదు. 2014లో హైదరాబాద్ వచ్చేశాడు. గెస్ట్‌ఫ్యాకల్టీగా ఆర్కిటెక్చర్ పాఠాలు చెప్పాడు. 'వెనుకబడిన తరగతులకోసం మన చదువులు ఉపయోగపడాలనే ఆయన ఆలోచనలు విని అక్కడి విద్యార్థులు స్ఫూర్తి పొందారు. 'ఏదైనా చేయండి సార్.. మేం సాయంగా ఉంటాం' అన్నారు. దీంతో తన ఆలోచనకి కార్యరూపం ఇచ్చాడు. మొదట 'కేతన్స్ అట్లియర్' అనే ఆర్కిటెక్చర్ ఆఫీసు మొదలెట్టాడు. అక్కడే ఎన్జీవోను నెలకొల్పాలనుకున్నాడు. ఆలోచనల్లో అనుకుంది చేతులతో చేయటమనే అర్థమొచ్చేట్లే ఆ ఎన్జీవోకు 'థింకింగ్ హ్యాండ్' అని పేరుపెట్టాడు.



పనికొచ్చే పని చేసుకోమన్నారు!

వెనుకబడిన వర్గాలకు తక్కువ ఖర్చుతో ఫర్నీచర్, ఇల్లు తయారు చేసివ్వాలన్నది సంతోష్‌కుమార్ లక్ష్యం. తన మనసులోని మాట చెబితే కొందరు ఎకసెక్కాలాడారు. ఇలాంటివి మాని పదో పరకో సంపాదించుకోవటానికి పనికొచ్చేది చేయి' అంటూ బుద్ధులు చెప్పారు. ఇవేమీ పట్టించుకోలేదు. అమ్మ, అన్నయ్య, మిత్రుడు రవి, మధుసూదన్, రమేష్.. లాంటి కొందరు శ్రేయోభిలాషులు సంతోష్‌ను ప్రోత్సహించారు. దీంతో కిషన్‌బాగ్‌లో ముస్లింల బాగు కోసం పనిచేసే ముఫ్తిని కలిశాడు. తన ఆలోచన చెప్పాడు. పది మంది వాలంటీర్స్‌తో కిషన్‌బాగ్ స్లమ్‌కి వెళ్లాడు. అక్కడ తండ్రి, భర్తలేని మహిళలు దాదాపు నాలుగువేల మంది ఉన్నారు. వీళ్లంతా దాదాపు చిన్నపనులు చేస్తూ జీవనపోరాటం సాగిస్తున్నవారే. ముఫ్తి సాయంతో యాభై మంది ముస్లిం మహిళలు వచ్చారక్కడికి. వాలంటీర్ల సాయంతో కళ్లముందే అట్టముక్కల సాయంతో ఉపయోగపడే రెండు ఫర్నీచర్స్ చేశారు. అక్కడికొచ్చినవాళ్లు 'మాకూ నేర్పించండి' అని అడిగారు. కర్వెక్స్, ఆర్300 అనే ఫర్నీచర్స్ నేర్పించి, వారితోనే తయారు చేయించారు.



శిక్షణతో పాటు ఉపాధి

రెండునెలల నుంచీ వర్క్‌షాప్స్‌తో విద్యార్థులను చైతన్యం చేస్తోంది 'థింకింగ్ హ్యాండ్'. కొందరు ముస్లిం మహిళలు రోజుకు 12 పెట్టికోట్‌లు కుడితే నలభై రూపాయలు వస్తున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలనుకున్నాడు సంతోష్. పాతికేళ్లనుంచీ ఉండే కిషన్‌బాగ్ స్లమ్‌కి వెళ్లాడు. వాళ్లకు కర్వెక్స్, ఆర్300 ఫర్నీచర్స్ చేయడం నేర్పించాడు. ఇది పూర్తిగా అట్టబోర్డుతో తయారు చేశారు. పేపరును గమ్‌తో అతికించటం, లోపల ఉండే టైట్ స్ట్రక్చర్ ఆధారంగా ఇది కంఫర్ట్‌గా ఉంటుంది. కర్వెక్స్ హాయిగా ఉండటంతో పాటు 150 కేజీల బరువును తట్టుకుంటుంది. దీంతోపాటు ఇందులో పెద్దవాళ్లు డబ్బులు, చిరుతిళ్లు, ఆకులు, వక్కపొడి.. లాంటివి దాచుకునేందుకు అనువుగా ఉంటుంది. ఇది 150 రూపాయల్లో తయారు చేయవచ్చు. ఆర్300 ఫర్నిచర్‌లో 300 కేజీలుండే బరువు పెట్టినా ఇబ్బందిలేదు. ఇది మూడువందల రూపాయల్లోపే తయారవుతుంది. త్వరలో ఈ ఫర్నిచర్స్‌ను వాటర్‌ప్రూఫ్ చేస్తున్నారు. వీటితో పాటు పేపర్లతో అడ్జస్టబుల్ ల్యాంపును తయారుచేయడం నేర్పించాడు. తన దగ్గరికొచ్చే విద్యార్థులతో అనాథలకోసం అట్టముక్కలతో ఓ స్కూలుబ్యాగును తయారు చేశాడు. అందులో పుస్తకాలు, టిఫెన్ బాక్సుతో పాటు స్కూల్‌లో ఆ బ్యాగ్‌పై రాసుకునేందుకు వీలుగా తీర్చిదిద్దాడు. వీటన్నింటినీ పెద్దఎత్తున తయారు చేయిస్తున్నారు. ఈ పనిలో నిపుణులైన వారికి తగిన పారితోషికం ఇస్తారు. తయారైన వాటిని అవసరమైన పేదలకు అందిస్తారు. దీనివల్ల కొందరికి ఉపాధి... కొందరికి ఉపశమనం.

- రాళ్లపల్లి రాజావలి

ప్రేమ జ్ఞాపకం... పీడకల కాదు


కనుమ... ఉదయం నుంచి ఒకటే హడావిడి. వడలు, చికెన్, మటన్, బిర్యానీ... ఇవన్నీ తినని వారికోసం ఎగ్‌ఫ్రైడ్ రైస్...అన్ని వండుకోవడం.. బంధువులందరికీ వడ్డించడం... ఒకటే పని. అంతా అయ్యే సరికే మధ్యాహ్నం 3 గంటలైంది. ఇంటికొచ్చిన బంధువుల పిల్లలంతా శిల్పారామం వెళ్తే బాగుంటుందని తీర్మానించారు. పిల్లలతో పాటు పెద్దలు కదిలారు. బైక్‌లు, ఆటోల్లో బయలు దేరి వెళ్లాం. అక్కడ పచ్చదనం, చెట్లు, వాటర్ ఫౌంటెన్లు మాలో అలసటని తరిమేశాయి. ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. నేనూ పిల్లలతో కలిసి ఆడాను. పాడాను. కబడ్డీ, కళ్లకాచీ, దాగుడుమూతలు, ముక్కుడు గిల్లీ, రన్నింగ్ రేస్, స్పూన్ లెమన్ ఆడేశాం. ఉయ్యాలలు ఊగేశాం. బోట్ షికార్ చేసేశాం. కూర్చొని అందరం ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న మసాల వడలు, తీపి వడలు తింటుంటే... మా చెల్లి 'అన్నా అదుగో శ్రావ్య... అంటూ కళ్లు ఇంత పెద్దవి చేసి పక్కకు చూపించింది. తనే... శ్రావ్య. గతంలో మేమున్న అపార్ట్‌మెంటులోనే వాళ్లూ రెంట్‌కు ఉండేవాళ్లు. నా కళ్లలో మెరుపుని మా బంధువులంతా అప్పటికే గమనించారు. టక్కున లేచి దగ్గరకి వెళ్లాను. సాయంత్రం వెలుగుల్లో తన నవ్వు వెన్నెల తీరంలా కన్పించింది. నేను తనని చూసి సరిగ్గా 12 ఏళ్లు అవుతోంది. మళ్లీ ఒక్కసారైనా తను కన్పిస్తే చాలు అనుకుంటూనే బతికాను ఈ పన్నెండేళ్లు. తనూ వాళ్ల బంధువులతో అక్కడకి వచ్చినట్లుంది.



'ఎలా ఉన్నావ్ శ్రావ్య?' అడిగాను తన కళ్లలోకి చూస్తూ. నా కళ్లలోని మెరుపు తనలోనూ కన్పించింది. సంతోషంగా నవ్వింది. ఎంత మంది పిల్లలు అన్నాను? ఇద్దరు అంటూ వాళ్లని నాకు పరిచయం చేసింది. మీ భర్త ఎక్కడ? అన్నాను. తను రాలేదంది. నా మనసుకు ఎందుకో కొంచెం ఆనందం. అలా గడ్డి మీద కూర్చొన్నాం. తను ఏం చేస్తోంది? భర్త ఏం చేస్తున్నాడు? పిల్లలు ఏం చదువుతున్నారు? లాంటి ప్రశ్నలన్నీ ముగిశాయి. తను నా గురించి అడిగింది. 'మీ భార్య ఏం చేస్తుంటుంది? పిల్లలెంత మంది? అంది. నేను తలదించుకున్నాను. పక్కనే ఉన్న మా చెల్లి వచ్చి 'అన్నయ్య ఇంకా పెళ్లి చేసుకోలేదు. చేసుకోమని చెబుతుంటే తప్పుకుంటూ ఉన్నాడు శ్రావ్య. చూడు ఇప్పటికే 30ఏళ్లు వచ్చాయి.' అని నిట్టూర్చింది. నేను తలదించుకున్నాను. తనకి అర్థమైంది. మా ఇద్దరి మధ్య కాసేపు మౌనం. ఆ మౌనంలో ఎన్నో జ్ఞాపకాలు. తనని నేను ప్రేమించడం... తనూ నన్ను ఇష్టపడటం... మా విషయం తెలిసి వాళ్ల నాన్న నన్ను కొట్టడం... ఇల్లు ఖాళీ చేసి వేరే ఊరికి వెళ్లిపోవడం... చిన్న వయస్సులో ఏం చేయలేక, ఏం చేయాలో తెలియక మేమిద్దరం ఉండిపోవడం... సినిమాలో రీళ్లలా అలా తిరిగాయి. మౌనాన్ని చీలుస్తూ తనే మాట్లాడింది. 'చూడు వరుణ్... ప్రేమ జ్ఞాపకం కావాలే కాని... పీడకల కాకూడదు. చిన్నప్పుడు ఏవేవో అనుకుంటాం. అన్నీ జరుగుతాయా? నువ్వు ఐఏఎస్ కావాలనుకున్నావు. ఇంజినీర్ అయ్యావు. అడ్జెస్ట్ కాలేదా? జీవితం మనకు నేర్పేది సర్దుకుపోవడమే. మా ఆయన నన్ను బాగా చూసుకుంటున్నాడు. నేను సంతోషంగా ఉన్నాను. నువ్వూ పెళ్లి చేసుకో. వచ్చే సంక్రాంతికి నువ్వు జంటగా ఈ శిల్పారామం రావాలి' అని పిల్లలను తీసుకొని తను నడుచుకుంటూ వెళ్లిపోయింది. నా మనసులోంచి కూడా హుందాగా! పన్నెండేళ్లుగా నా మనసు మోస్తున్న భారాన్ని దించేసి.

- వరుణ్‌కుమార్

సమ్‌థింగ్... సమ్‌థింగ్..




ఈ మధ్య నా గుండె
అలుగుతోంది...
తనతో ఎవరో
పోటీపడుతున్నారని.

- రవి, కరీంనగర్.

నీ భుజం నా
అంతఃపురం
ఇతరులకు ప్రవేశం లేదు

- సౌజన్య, కర్నూలు



పదేళ్ల ఛాలెంజ్



'టెన్' టనా టన్



ఐస్‌బకెట్ ఛాలెంజ్ నుంచి మొదలైన సోషల్ మీడియా ఛాలెంజ్‌లు 2019లో కొత్తదనంతో ముందుకొచ్చాయి. పదేళ్ల క్రితం నువ్వెలా ఉండేవాడివి... ఏం చేసేవాడివి? అంటూ ఫేస్‌బుక్ మొదలెట్టిన ఈ ఛాలెంజ్‌ను ప్రముఖులు తీసుకోవడంతో ట్రెండ్ అయిపోయింది. మొన్న శ్రుతి హాసన్... నిన్న రాశీఖన్నా లాంటి హీరోయిన్లు తమ పదేళ్లనాటి ఫొటోతో పాటు... ప్రస్తుత చిత్రాన్ని పోస్ట్‌చేయడంతో క్రేజ్ ఊపందుకుంది. యువతంతా దీన్ని ఫాలో అవుతూ 2009-2019 అంటూ సోషల్‌మీడియాను పాతకొత్త చిత్రాలతో నింపేస్తున్నారు. అప్పటి విశేషాలు పంచుకుంటున్నారు. అసలు దీన్ని తొలుత ఫేస్‌బుక్ యాజమాన్యమే మొదలుపెట్టింది. ఫేస్‌బుక్ ఖాతా తెరిచి మీరు మొదటి సారి పోస్ట్ చేసిన ప్రొఫైల్ పిక్‌ని అదే రోజు తిరిగి గుర్తు చేయడం దీని ఉద్దేశం. అయితే కొంతమంది దీన్ని ఫాలో కాకుండా తమ పదేళ్ల క్రితం నాటి ఫొటోను నేటితో పోల్చుతూ పోస్టులు మొదలుపెట్టారు. 2009 నుంచి ఫేస్‌బుక్‌కు ఖాతాదారులు పెరిగారు. దీంతో ఆ యాజమాన్యం దీన్ని ప్రోత్సహిస్తూ పోస్టింగులు ప్రారంభించింది. యువతను ఇది ఆకట్టుకుంది. 2009లో నేను ఇలా ఉండేవాడ్ని... ఇప్పుడు ఇలా అంటూ చిత్రాల్ని పంచుకుంటున్నారు. కొందరేమో... అప్పుడు చేస్తున్న పని.. సాధించిన ప్రగతి... మారిన ఆలోచన విధానంపై వ్యాసాలు రాసి పెడుతున్నారు. డైటింగ్, ఎక్సర్‌సైజులు చేస్తున్న వారు మాలో ఏ మార్పు లేదని... వయస్సు నంబర్ మారిందంతేనని పోస్టులు చేస్తున్నారు. కొందరేమో శారీరక మార్పుల కన్నా... మానసికంగా, ఆలోచన పరంగా ఎంత దృఢంగా మారారో చెప్పమని అడుగుతున్నారు. కొందరు వీటికి అనుగుణంగా సమాధానాలిస్తున్నారు. ఏదైతేనేం... మొత్తానికి యువతను బిజీ చేయడానికి సోషల్‌మీడియాలో మరో ఛాలెంజ్ దొరికింది.



ఇలా పోస్టు చేసే చిత్రాలు సేఫ్‌గానే ఉంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ కవళికలు గుర్తించే టెక్నాలజీ ద్వారా హ్యాకర్స్‌కి తాళాలు ఇచ్చినట్లవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇదంతా కేవలం సరదా కోసమేనని ఫేస్‌బుక్ చెబుతోంది.

ఈనాడు సినిమా

మహాలక్ష్మి పెళ్లి సందడి

పిల్లగాడు తెల్లదొరే... పల్లకిలో వచ్చేస్తాడే... లండన్ అంతా రాసిస్తాడే... అంటూ కాబోయేవాడి గురించి కలలుగన్న మహాలక్ష్మి పెళ్లి ఎలా జరిగిందో తెలియాలంటే 'దట్ ఈజ్ మహాలక్ష్మి' చూడాల్సిందే. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. మను కుమరన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తారు. "ఒక సాధారణ యువతి... అసాధారణ మహిళగా ఎలా మారుతుందనే కథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈమధ్య విడుదలైన టీజర్‌కీ, పాటకి మంచి స్పందన లభించింది. అమిత్ త్రివేది సమకూర్చిన స్వరాలు చిత్రానికి ప్రధాన బలం" అని చిత్రవర్గాలు తెలిపాయి. సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మైఖెల్ టట్యూరి యస్.



తమన్నా

అందరూ నవ్వుతుంటే నాకు కన్నీళ్లొచ్చాయి!

– 'ఎఫ్2' విజయోత్సవంలో వెంకటేష్



మెహరీన్, శిరీష్, వరుణ్‌తేజ్, వెంకటేష్, దేవిశ్రీప్రసాద్, దిల్‌రాజు, అనిల్ రావిపూడి, లక్ష్మణ్

"పదేళ్ల తర్వాత థియేటర్‌కి వెళ్లి ప్రేక్షకుల స్పందనని చూశా. అందరూ నవ్వుతున్నారు కానీ నాకు కళ్లలో నీళ్లొచ్చాయి. కష్టపడి ఒక సినిమా చేశాక, దాన్ని ప్రేమగా ప్రేక్షకులు చూస్తున్నప్పుడు గొప్ప అనుభూతి కలుగుతుంద"న్నారు కథానాయకుడు వెంకటేష్. ఆయన వరుణ్‌తేజ్‌తో కలసి నటించిన చిత్రం 'ఎఫ్2'. తమన్నా, మెహరీన్ కథానాయికలు. అనిల్ రావిపూడి దర్శకుడు. శిరీష్, లక్ష్మణ్ నిర్మాతలు. దిల్‌రాజు సమర్పించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయోత్సవం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ "ప్రేక్షకుల కళ్లలో ఆనందం చూసినప్పుడు చాలా ఆనందం కలిగింది. నా సినిమాలు ఎన్నో సంక్రాంతికి వచ్చి విజయవంతమయ్యాయి. మళ్లీ చాలా రోజుల తర్వాత ఇలాంటి వినోదాత్మక సినిమా చేయడం ఆనందంగా ఉంది. 'ప్రేక్షకులు మళ్లీ మిమ్మల్ని ఇలాంటి ఓ వినోదాత్మక సినిమాలో చూడాలని అనుకుంటున్నార'ని ఈ కథ చెప్పాడు అనిల్ రావిపూడి. అంతే ఉత్సాహంగా ఈ సినిమాని చేశాడు. వరుణ్, తమన్నా, మెహరీన్ బాగా నటించారు. దేవిశ్రీప్రసాద్, సమీర్‌రెడ్డి... ఇలా సాంకేతిక బృందమంతా చక్కటి పనితీరు కనబరిచింద"న్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ "నేను ఇంకా కొత్తవాణ్ని. ఎలాంటి సినిమాలు చేయాలా అని నా దారిని వెదుక్కుంటున్నా. నాకు కామెడీ అంటే చిరంజీవి, వెంకటేష్ సినిమాలే గుర్తుకొస్తుంటాయి. వాళ్లని చూసి మనం ఇలా కొంచెమైనా చేయగలుగుతామా అనుకొనేవాణ్ని. అనిల్ రావిపూడి సెట్‌లో సన్నివేశాలు చెప్పి వెళ్లిపోయినప్పుడు ఎక్కడో సిగ్గు ఉండేది. వెంకటేష్ సర్ నా పక్కన ఓ సోదరుడిలాగే నిలిచి సహకారం అందించారు. ప్రేక్షకుల అభిమాన కథానాయకుడు ఎవరైనా వాళ్లందరికీ నచ్చే వ్యక్తి వెంకటేష్ సర్. త్వరలోనే 'ఎఫ్3 'చేయబోతున్నాం. అది మరింత నవ్విస్తుంది" అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ "ఈ సినిమా నాకు ప్రత్యేకం. సాంకేతికబృందం, నటీనటులు ప్రాణం పెట్టి పనిచేశారు. వెంకటేష్‌తో కలిసి వరుణ్‌తేజ్ మంచి టైమింగ్‌తో నటించారు. వెంకటేష్ చెప్పిన ప్రతి సంభాషణకీ ప్రేక్షకులు నవ్వుతూ కనిపించారు. బాధని దూరం చేసేది, మనుషుల్ని దగ్గర చేసేది, గొడవని తగ్గించేది, గౌరవాన్ని, ఆయుష్షని పెంచేది నవ్వే. మేం ఆ నవ్వులు ఇచ్చినందుకు ప్రేక్షకులు నవ్వుతూనే ఈ సినిమాకి కలెక్షన్ల వర్షం కురిపించారు. ఇది నవ్వుల సంక్రాంతి. జీవితాంతం గుర్తుండిపోయే సంక్రాంతి. విదేశాల్లోనూ ఈ సినిమా మిలియన్ డాలర్ల మార్క్ దాటింది. ఒక మనిషి ఎదుగుతున్నప్పుడు వాడి భుజం తట్టడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ఈ సినిమా టీజర్ విడుదలైనప్పట్నుంచీ మహేష్‌బాబు చేసిన ట్వీట్లు మాకెంతో కిక్‌నిచ్చాయి" అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "మా సినిమా పేరు 'ఎఫ్ 2' అని ఖరారయ్యాక, 'వీ2' అంటూ వెంకటేష్, వరుణ్‌తేజ్ వచ్చి చేశారు. సినిమా విడుదలయ్యాక ఎంటర్‌టైన్‌మెంట్ రెండింతలుందని 'ఈ2' అంటూ సందేశాలు ఇచ్చారు. ఇప్పుడు బొమ్మ బ్లాక్ బస్టర్ అంటూ 'బీ2' పేరుతో ఈ వేడుక జరుపుకుంటున్నాం. మంచి కథ రాసి మా సంస్థలో ఈ సినిమా చేసినందుకు అనిల్‌కి కృతజ్ఞతలు. మా నిర్మాణ సంస్థకి అత్యధిక లాభాలు తెచ్చిన సినిమా ఇదే అయ్యింద"న్నారు. మెహరీన్ మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు ది బెస్ట్ అని ఈ సినిమాతో మరోసారి నిరూపించార" అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ "రెచ్చిపోదాం బ్రదర్ పాటలాగా ఈ సినిమాలో అందరూ రెచ్చిపోయి నటించారు. ప్రేక్షకులూ రెచ్చిపోతూ సినిమాని ఆస్వాదిస్తున్నార"న్నారు. ప్రగతి, అనసూయ, అన్నపూర్ణమ్మ, రజిత, ప్రదీప్, కిరణ్, సురేష్, కాసర్ల శ్యామ్, శ్రీమణి, బాలాజీ, సురేందర్, సమీర్‌రెడ్డి, తమ్మిరాజు, ఎ.ఎస్.ప్రకాశ్, సాయికృష్ణ, ప్రవీణ్, మాధవ్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై డ్యాన్స్ చేస్తున్న వరుణ్‌తేజ్, మెహరీన్, అనసూయ, వెంకటేష్



కాజల్, కమల్‌హాసన్, శంకర్, సుభాస్కరన్

భారతీయుడు 2 ప్రారంభం

దర్శకుడు శంకర్, నటుడు కమల్‌హాసన్ కాంబినేషన్‌లో 22 ఏళ్ల క్రితం విడుదలైన 'భారతీయుడు' చిత్రానికి ఇప్పుడు 'భారతీయుడు 2' పేరుతో సీక్వెల్ తెరకెక్కుతోంది. లైకా నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. 'భారతీయుడు'లో 'ఇండియన్ తాత'గా మెప్పించిన కమల్‌హాసన్ మళ్లీ అదే పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర మేకప్ కోసం హాలీవుడ్ నుంచి ప్రత్యేక నిపుణుల్ని తీసుకొచ్చారు. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం చెన్నైలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.ఎమ్.రత్నం, కాజల్, సుభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు. శంకర్ ఈ సినిమాను వీలైనంత త్వరలోనే విడుదల చేయనున్నారని సమాచారం. ఇందులో కమల్‌హాసన్ మనవడి పాత్రలో శింబు నటిస్తున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం.

– న్యూస్‌టుడే, కోడంబాక్కం

పుట్టినపుడు మనిషి మనసు తెరిచియుండును
ఆ పురిటికందు మనసులో దైవముండును
వయసు పెరిగి ఈసు కలిగి మదము హెచ్చితే
అంత మనిషిలోని దేవుడే మాయమగునులే

గీతం: పిల్లలూ దేవుడూ చల్లనివారే...
చిత్రం: లేత మనసులు
రచన: ఆరుద్ర – పంపినవారు: ఎ.అరవింద్, ఒంగోలు

గీతోపదేశం

ఐటెమ్ సాంగ్... ఈ మాటే నచ్చదు

'షీలా కీ జవానీ', 'చిక్నీ చమేలీ...' లాంటి ప్రత్యేక గీతాలతో తన డ్యాన్స్ సత్తా ఏంటో చూపించింది కత్రినాకైఫ్. ఐటమ్ సాంగ్ అంటేనే హుషారుగా డ్యాన్స్ చేయడమే కాదు కాస్తో కూస్తో అందాల ఆరబోత తప్పదు. మరి బాలీవుడ్ ప్రత్యేక గీతాల సుందరి కత్రినా ఈ విషయం గురించి మాట్లాడింది. "అసలు ఐటమ్ సాంగ్ అనే మాటే నాకు నచ్చదు. పాటలోని పదాలకు తగ్గట్టు భావాన్ని వ్యక్తం చేస్తూ డ్యాన్స్ చేయడమే నాకు తెలుసు. వేరే ఇతర విషయాలేమీ నా బుర్రలోకి రావు. హుషారైన డ్యాన్స్ పాటల విషయంలో శ్రీదేవి, మాధురీ దీక్షిత్, మడోన్నా, బియాన్స్ నాకు స్ఫూర్తి. బియాన్స్ ఓ షో చేసిందంటే అందులో ఆమె ఆహార్యం ఎలా ఉంటుందో చూసే ఉంటారు. పాటలోని ప్రతి పదం ఆమె డ్యాన్స్‌లో కనపడతుంది. ఒకవేళ నిజంగా కొరియోగ్రాఫర్ తీర్చిదిద్దిన స్టెప్పులు మితిమీరి అందాలు ఆరబోసేలా ఉన్నాయి అని నీకు అనిపిస్తే ఆ పాటను నువ్వు చెయ్యవు. పాటలోని సారాన్ని డ్యాన్స్‌తో వ్యక్తీకరించడం చాలా గొప్ప విషయం. అందులో ఎలాంటి తప్పులకు తావు లేదు"అని చెప్పింది కత్రినా.

భవిష్యత్తులో నిర్మాతను కావొచ్చేమో!

బాలీవుడ్ అగ్ర కథానాయికలు చాలా మంది నిర్మాతలుగా మారుతున్నారు. కత్రినా పరిశ్రమలోకి వచ్చి పదిహేను ఏళ్లు దాటేసింది. చిత్ర నిర్మాణ రంగంవైపు రాలేదు. "పదేళ్ల క్రితమే నిర్మాత కావాలనుకున్నాను. కానీ ఎందుకో అది కుదరలేదు. నిర్మాత కాకపోయినా ఇతరత్రా వ్యాపకాలతో బిజీ అయిపోయాను. అలాగని భవిష్యత్తులో నిర్మాతను కాను అని చెప్పలేను. ఓ మంచి కథ నా మనసులో ఉంది. అందులో రెండు బలమైన నాయిక పాత్రలుంటాయి. మరి ఆ కథ ఎప్పటికీ ఎలా తెరపైకి వస్తుందో వేచి చూడాలి" అంటోంది కత్రినా. ఆమె ప్రస్తుతం సల్మాన్‌ఖాన్‌తో కలసి 'భారత్'లో నటిస్తోంది.



కత్రినాకైఫ్

'యాత్ర'లో వై.ఎస్.జగన్



మమ్ముట్టి

వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి రాజకీయ జీవితంలోని కీలక ఘట్టమైన పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'యాత్ర'. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి పాత్రని ప్రముఖ నటుడు మమ్ముట్టి పోషించారు. మహి. వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైకాపా అధ్యక్షుడు వై. ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఓ చిన్న పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన తెరపై నిజ జీవిత పాత్రలోనే కనిపిస్తారని చిత్ర వర్గాలు తెలిపాయి. విజయ్ చిల్లా, శశి దేవి రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే నెల 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

అంతర్జాతీయ డ్యాన్సర్లతో ప్రభాస్ స్టెప్పులు



ప్రభాస్

'బాహుబలి 2' తర్వాత ప్రభాస్ నటిస్తోన్న చిత్రం 'సాహో'. ప్రభాస్ పోలీస్ పాత్రలో నటిస్తోన్న ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. భారీ యాక్షన్ సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విదేశాల్లో తెరకెక్కించిన ఈ సన్నివేశాల కోసం భారీగానే ఖర్చు చేసింది చిత్రబృందం. ఇప్పుడు ఈ చిత్రానికి మరో అదనపు ఆకర్షణ చేరనుందట. ఈ చిత్రంలోని ఓ పాటలో ప్రభాస్‌తో కలసి అంతర్జాతీయ డ్యాన్సర్లు లారెంట్ నికోలస్, లారీ నికోలస్‌లు స్టెప్పు లేయనున్నారట. వీరిద్దరూ కవలలు కావడం విశేషం. లెస్ ట్విన్స్‌గా పిలిచే ఈ ఇద్దరూ అంతర్జాతీయ పాప్ గాయని బియాన్స్ పాటల్లో ఆమెతో కలసి స్టెప్పులేశారు. 'సాహో'లోని ఓ పాట జాతర నేపథ్యంలో సాగుతుందట. దీని కోసం భారీ వ్యయంతో ఓ సెట్‌ను తీర్చిదిద్దుతున్నట్టు సమాచారం. వైభవీ మర్చంట్ నృత్య దర్శకత్వం వహించే ఈ పాటను త్వరలోనే తెరకెక్కించనున్నట్టు తెలిసింది. ఈ పాటలో బ్రెజీలియన్ డ్యాన్సర్లు ఎక్కువ సంఖ్యలోనే ఉంటారట. సుజీత్ దర్శకత్వంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ నాయిక.



లారెంట్ నికోలస్, లారీ నికోలస్

నవ్వుల ధమాల్



'టోటల్ ధమాల్'లో ఓ దృశ్యం

'ధమాల్' సిరీస్‌లో వస్తోన్న మూడో చిత్రం 'టోటల్ ధమాల్'. అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రం పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం. పదిహేడేళ్ల తర్వాత అనిల్‌కపూర్, మాధురీ దీక్షిత్ కలసి నటిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో అజయ్ దేవగణ్, అనిల్ కపూర్, మాధురీ దీక్షిత్, జానీ లీవర్, అర్షద్ వార్సి, జావేద్ జాఫ్రీ, రితేష్ దేశ్‌ముఖ్, సంజయ్ మిశ్రా... ఇలా చిత్రంలోని కీలక నటులందరూ వరసగా నిల్చొని ఒకరిపై ఒకరు పడుతూ ఉన్న ఈ స్టిల్ ఆకట్టుకుంటోంది. 'ది వైల్డెస్ట్ అడ్వంచర్ ఎవ్వర్' అని పోస్టర్‌పై రాసి ఉంది. ఇంద్రకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఈ నెల 21న, సినిమాని వచ్చే నెల 22న విడుదల చేయనున్నారు. ఇందులో హాలీవుడ్ నుంచి తీసుకొచ్చిన క్రిస్టల్ అనే కోతి కూడా నటిస్తోంది. ఇంతకుముందే అజయ్‌దేవగణ్‌తో క్రిస్టల్ ఉన్న స్టిల్‌ను విడుదల చేశారు.

వంద రోజుల పరిచయం



శ్రద్ధ, సమీర్

సమీర్‌ఖాన్, శైలజ, సునీత పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కె ఎస్ 100'. ఆశిరాయ్, శ్రద్ధ, అక్షత కీలక పాత్రల్లో నటించారు. షేర్ దర్శకుడు. కె.వెంకట్రామ్‌రెడ్డి నిర్మాత. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సాయివెంకట్, మల్టీడైమన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణ ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "నలుగురమ్మాయిలు, ఒక యువకుడి నేపథ్యంలో సాగే చిత్రమిది. సినిమాలో కథానాయకుడి పేరు కుమారస్వామి. అతనికి నలుగురమ్మాయిలతో వంద రోజుల స్నేహాన్ని సూచిస్తూ 'కె ఎస్ 100' అనే పేరుని నిర్ణయించాం. నవతరం అమ్మాయిల ఆలోచనలు ఎలా ఉన్నాయనే విషయాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించిన చిత్రమిది. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాగా రూపొందించాం" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "కథాబలమున్న చిత్రంతో పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంద"న్నారు. ఈ కార్యక్రమంలో కూసెట్టి, అజీబ్, నవనీత్‌చారి, పూర్వి తదితరులు పాల్గొన్నారు.

వసుంధర



పిల్లలు - పెంపకం

అసలే అల్లరి పిల్లలు. ఇక కోపం కూడా తోడైతే? వారిని శాంతింపజేయడానికి తల ప్రాణం తోకకి వచ్చినంత పనవుతుంది. ఎప్పుడో అప్పుడు ఇలాంటి ఆగ్రహోదగ్రులను సముదాయించడమే కష్టమనుకుంటే.. ఇక మాటిమాటికీ దుర్వాసుల అవతారమెత్తుతుంటే? ఇంటా బయటా ఇబ్బందులు తప్పవు. పరిస్థితి అంతవరకూ రానీయకుండా ఆగ్రహాన్ని నిగ్రహించుకునే తీరుతెన్నులను పిల్లలకు చిన్నప్పట్నుంచే నేర్పించడం మంచిది. ఇది పెద్దయ్యాకా వారికి తోడుగా నిలుస్తుంది. ఉద్యోగ వ్యవహారాల్లోనూ, సామాజిక సంబంధాల్లోనూ అనుబంధాలు దెబ్బతినకుండా కాపాడుతుంది.

చిరుతలు శాంతించేదెలా?

● 'మీ బాబు అవినాశ్ తరగతిలో ఈరోజు కూడా ఒక పిల్లాడిని కొట్టాడు. కాస్త అదుపులో పెట్టండి'.. ఆఫీసు నుంచి రాగానే స్కూలు నుంచి ఫోన్. కారణమేంటని బాబును అడిగితే 'నేను చెడ్డవాడినని విశేష్ ఏడిపిస్తున్నాడు. నాకు బాగా కోపం వచ్చింది' అని సమాధానం.

● 'బార్బీ బొమ్మ తరువాత కొందాం. ఇప్పుడు కాదు'. అలా నాన్న అన్నాడో లేదో రమ్య కోపంతో కాళ్లు నేలకేసి కొట్టడం మొదలెట్టింది. షాపింగ్‌మాల్‌లో అంతా తమవైపే చూస్తున్నారు. చేసేదేముంది? బొమ్మ కొనక తప్పలేదు.

ఇలాంటి సందర్భాలు, సంఘటనలు ప్రతి ఇంట్లోనూ ఎదురయ్యేవే. ఎప్పుడో అప్పుడు పిల్లలు అలగడం, మారాం చేయడం మామూలే. అప్పటికప్పుడు నయానో భయానో నచ్చజెప్పడం, కోరినవి ఇచ్చి సంతృప్తి పరచడం ప్రతి ఇంట్లో చూసేదే. కానీ తరచుగా పిల్లలు కోపం తెచ్చుకుంటుంటే మాత్రం ఆలోచించాల్సిన విషయమే. నిజానికి మనలో చాలామంది పిల్లల కోపాలను పెద్దగా పట్టించుకోరు. 'పిల్లలకు కోపాలేంటి? ఏదో తెలియనితనంతోనో, మొండితనంతోనో అలా ప్రవర్తిస్తున్నారులే' అని తేలికగా తీసుకుంటుంటారు. అయితే పెద్దవాళ్ల మాదిరిగానే పిల్లలకూ కోపాలు వస్తాయని, వీటికీ రకరకాల కారణాలు దోహదం చేస్తుంటాయని గుర్తించడం అత్యవసరం. అప్పుడప్పుడే తమ మనసులో పురుడుపోసుకుంటున్న భావోద్వేగాలను పిల్లలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. బడిలోనో, ఇంట్లోనో కొన్నిసార్లు ఎదుటివాళ్ల భావాలు తమ ఆలోచనలకు భిన్నంగా ఉండటం వింతగా అనిపించొచ్చు, నచ్చకపోవచ్చు. లేదూ తమ భావాలను ఎదుటివాళ్లు దెబ్బతీస్తున్నారని, పట్టించుకోవడంలేదని ఉక్రోశానికి లోనుకావొచ్చు. ఇది క్రమంగా అసహనానికి, తరువాత కోపానికి దారితీయొచ్చు. కొన్నిసార్లు తాము కోరుకున్నవి దక్కనప్పుడు ఎలాగైనా సాధించుకోవాలనే పంతంతో విపరీతంగానూ స్పందిస్తుండొచ్చు.

చిత్రమేంటంటే- అభం శుభం తెలియని పిల్లలు తమ మనసులోని భావోద్వేగాలను, తాము చేసే చేష్టలను వేర్వేరుగా చూడలేకపోవడం. కోపం వచ్చినప్పుడు గట్టిగా అరవడం, కేకలు పెట్టడం, కొట్టడం, తన్నడం, కొరకడం వంటివి అసహజమైనవని వాళ్లకు అనిపించకపోవడం. దీంతో తమ కోపాలు సహజమేనని, చేసే చేష్టలు మామూలేనని భావిస్తుంటారు. వయసు పెరుగుతున్నకొద్దీ భావోద్వేగాలకు కారణమవుతున్న విషయాలను అర్థం చేసుకునే విద్య క్రమంగా పిల్లలకు అలవడుతుంటుంది. దీన్ని 'పెద్ద' మనసుతో అర్థం చేసుకోవడం ఎంతైనా అవసరం.

అరుపులు అనవసరం

పిల్లలు కోపంతో అరుస్తున్నప్పుడు చాలామంది చేసే పని గట్టిగా మందలించడం. ఇది మంచి పద్ధతి కాదు. కంటికి కన్ను, పన్నుకు పన్ను అనే తీరు పిల్లలను మరింత రెచ్చగొడుతుంది. ఇది మరిన్ని కలహాలకు దారితీస్తుందే తప్ప వారిని మార్చలేదని గుర్తించాలి. కొందరిలో మొండితనానికీ దారితీయొచ్చు. ముమ్ముందు పెద్దవాళ్లను లొంగదీసుకోవడానికి కోపాన్ని అస్త్రంగా వాడుకునే ప్రమాదమూ లేకపోలేదు. కాబట్టి కోపంలో ఉన్నప్పుడు పిల్లలను రెచ్చగొట్టే పనులకు స్వస్తి చెప్పడమే ఉత్తమం. కొద్దిసేపు వాళ్లను అలాగే వదిలేస్తే క్రమంగా శాంతిస్తారు. ముఖం మాడ్చుకోవడం, ముభావం వంటివి తగ్గుముఖం పడతాయి. అప్పుడు దగ్గరకు తీసుకొని అనునయంగా మాట్లాడితే ఓర్పుతో వింటారు. చెప్పింది అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.

కారణాల అన్వేషణ పనికిరాదు

కోపం వచ్చినప్పుడు ఎవరికైనా విచక్షణ జ్ఞానం లోపిస్తుంది. అన్నీ తెలిసిన పెద్దవాళ్లే కోపంలో ఏది మంచో, ఏది చెడో తెలుసుకోలేని స్థితిలో ఉంటే ఇక పిల్లల సంగతి చెప్పేదేముంది? అందువల్ల పిల్లలు కోపంతో ఉన్నప్పుడు కార్యకారణాలను విశ్లేషించటం మొదలెడితే మొదటికే మోసం వస్తుంది. 'అక్క పెన్సిల్ అడిగితే ఇవ్వలేదటగా. అక్క మందలిస్తే ముఖం మాడ్చుకోవడమెందుకు? తప్పు నీదే కదా?'.. ఇలా కారణాలను ఎత్తిచూపుతుంటే పిల్లలు అర్థం చేసుకోవడం అటుంచి వ్యతిరేక భావాన్నీ ఏర్పరచుకోవచ్చు. కాబట్టి కాస్త నెమ్మదించాకే అర్థం చేయించే ప్రయత్నం చేయాలి.

చేయి చేసుకుంటే మొదటికే మోసం

సామ దానాలు పనిచేయనప్పుడు కొందరు దండోపాయాన్ని ప్రయోగించడానికీ ప్రయత్నిస్తుంటారు. పిల్లల మీద పైచేయి సాధించటానికి చేయి కూడా చేసుకుంటుంటారు. దీంతో మంచి కన్నా చెడే ఎక్కువ. పిల్లల ప్రవర్తన మారకపోవడం అటుంచి తల్లిదండ్రులను పిల్లలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశముంది. పిల్లల మీద చేయి చేసుకున్న తల్లిదండ్రులు 'నేను అలా చేసి ఉండాల్సింది కాదు. పిల్లల్ని కొట్టడం తప్పే' అని కొన్నేళ్ల తరువాత పశ్చాత్తాప పడుతున్నట్టు అధ్యయనాలు ఘోషిస్తున్నాయి కూడా. పిల్లలు రోజురోజుకీ శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎదుగుతుంటారు. చుట్టుపక్కల పరిస్థితులను, వ్యక్తుల మనస్తత్వాలను అర్థం చేసుకోవడమూ మెరుగవుతుంటుంది. తమను కొట్టటం వెనక ఉద్దేశమేంటన్నది పిల్లలు తేలికగా పసిగడతారు. కాబట్టి కొట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.



అవకాశం ఇవ్వడం అత్యుత్తమం

అన్నిసార్లూ పిల్లల కోపాలను శాంతింపజేయటం సాధ్యం కాదని గుర్తించడం అవసరం. మనసులో రేగిన అసంతృప్తి, అసహనం స్థాయులను బట్టి కొన్నిసార్లు కోపం తీవ్రత ఎక్కువగా ఉండొచ్చు. పెద్దవాళ్లు చెప్పినా తగ్గకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు మొండిగా వ్యవహరించకుండా కాసేపు పిల్లలను అలాగే వదిలేయడం ఉత్తమం. అలాగని ఒంటరిగా గదిలో ఉంచడం కాదు. అందరి సమక్షంలోనే కొద్దిసేపు మౌనంగా సోఫాలో కూచోనీయండి. వీలైతే అలా బయటకు తీసుకెళ్లి తోటలో తిప్పండి. దీంతో కోపాన్ని నిగ్రహించుకోవడానికి, తాము చేసిందేంటో గ్రహించుకోవడానికి పిల్లలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. పిల్లలకూ పెద్దలకూ.. ఇద్దరికీ మనశ్శాంతి లభిస్తుంది.

పట్టించుకోకపోవడం ప్రమాదం


పిల్లలు కోపంతో ఉన్నా కూడా కొందరు తల్లిదండ్రులు నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తుంటారు. పిల్లల వైపు చూడకుండా, ఏమాత్రం పట్టించుకోకుండా తమ పనులు తాము చేసుకుపోతుంటారు. ఇది పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుందే తప్ప తగ్గించదు. కొన్నిసార్లు పిల్లలు తమను, తమ అవసరాలను పెద్దవాళ్లు గుర్తించడం కోసమూ కోపాన్ని ప్రదర్శిస్తుండొచ్చు. అందువల్ల తమను పట్టించుకోకపోతే పిల్లలు అపార్థం చేసుకోవచ్చు. ఇలాంటి అభిప్రాయాలు దీర్ఘకాలం కొనసాగుతుంటాయి కూడా. కాబట్టి వేలొంచితే గానీ వెన్న బయటకు రాదనే సామెతను గుర్తుంచుకోవాలి. అవసరాన్ని బట్టి పిల్లల ముందు కాస్త 'తలొగ్గడం' తప్పేమీ కాదు. అలాగని మరీ లొంగిపోవడమూ తగదు. అయిన దానికీ కానిదానికీ తలొంచడం ఆరంభిస్తే గొంతెమ్మ కోర్కెలతో పెద్దల మెడలు వంచడానికి పిల్లలు ప్రయత్నించడానికి దారితీస్తుంది.

- పి.భాగ్య

పిల్ల దుర్వాసులకు చిట్కాలు నేర్పండి

తరచుగా అదేపనిగా కోపంతో రెచ్చిపోయే కాస్త పెద్ద పిల్లలకు కొన్ని చిట్కాలు నేర్పించడం మంచిది.

- కోపంతో ఉన్నప్పుడు ముక్కుతో శ్వాస తీసుకొని నాలుగు అంకెలు లెక్కపెట్టడం, నోటితో శ్వాస వదిలి ఎనిమిది అంకెలు లెక్కపెట్టడం అలవాటు చేయాలి.
- ఒత్తిడి తగ్గటానికి తోడ్పడే మెత్తటి బంతిని చేతికివ్వండి. కోపం వచ్చినప్పుడు నొక్కాలని చెప్పండి.
- సంగీతం వినమని చెప్పండి. ఇష్టం వచ్చినట్టుగా గెంతులూ వేయమని చెప్పండి.
- కోపం వచ్చినప్పుడు చప్పట్లు కొట్టటం అలవాటు చేయించండి. దీంతో ఇతరులను కొట్టకుండా ఉండేలా చూసుకోవచ్చు.
- కోపానికి కారణమవుతున్నవేంటో కాగితం మీద రాసుకొని వాటిని ఒక్కొక్కటిగా విశ్లేషించుకోవటం నేర్పించండి.





సెల్ఫీలు సరదాకే!

సెల్ఫీల మోజు ఆత్మన్యూనతకు దారితీస్తోందా? పరిస్థితి చూస్తుంటే ఇది నిజమేనని అనిపిస్తోంది. సెల్ఫీలో ఆకర్షణీయంగా కనిపించేలా మలచమంటూ తమను చాలామంది ఆశ్రయిస్తున్నారని 42% మంది ప్లాస్టిక్ సర్జన్లు అభిప్రాయపడుతుండటమే దీనికి నిదర్శనం. అయితే ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవడానికి ముందు సెల్ఫీల గురించిన వాస్తవాన్ని తెలుసుకోవడం మంచిది. మామూలుగా పాస్‌పోర్ట్ ఫొటోల వంటివి సుమారు అయిదు అడుగుల దూరం నుంచి తీస్తారు. అదే సెల్ఫీలను సగటున 12 అంగుళాల దూరం నుంచి తీసుకుంటుంటారు. ఇందులో ముఖ కవళికలు వాస్తవ రూపాన్ని ప్రతిబింబించవు. ఇలా కెమెరాకు చాలా దగ్గరగా ముఖాన్ని పెట్టి తీసుకునే ఫొటోల్లో ముక్కు 30% వరకు పెద్దగా కనిపిస్తుందని తాజా అధ్యయనం ఒకటి పేర్కొంటోంది. ఇదొక్కటి చాలదూ.. ముఖ కవళికలు మారిపోవడానికి. కాబట్టి సెల్ఫీల్లో అందంగా కనిపించడం లేదనే బెంగను వదిలేయండి. సెల్ఫీలు కేవలం సరదా కోసమేనని, వాటిని పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదని తెలుసుకోండి.

ఇంజెక్షన్లు చేయించుకోవాల్సిందేనా?

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

నాకు థైరాయిడ్ సమస్య ఉంది. దాంతో నెలసరి సరిగ్గా రావట్లేదు. పిల్లలకోసం డాక్టర్‌ని సంప్రదిస్తే... అండం విడుదల కావడం లేదని చెప్పారు. ఇంజెక్షన్లు సూచించారు. ఏడు నెలలుగా... ప్రతినెలా ఇంజెక్షన్లు చేయించుకుంటున్నా. మందులు కూడా వాడుతున్నా. ఈ మధ్య స్కాన్ చేసి అండం విడుదల అవుతోందని చెప్పారు. ఇప్పుడు ప్రతినెలా ఇంజెక్షన్లు చేయించుకోవాలా.. లేకపోతే అండం విడుదల కాదా? - ఓ సోదరి

గర్భం రావడానికి హార్మోన్లన్నీ సమతూకంలో ఉండడం తోపాటు గర్భాశయానికి సంబంధించిన భాగాలన్నీ ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం. అలాగే అండాశయాల పనితీరు కూడా సజావుగా సాగాలి. పీసీఓడీ ఉందేమో గమనించుకోవాలి. మన శరీరంలోని హార్మోన్లు ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. అలా గర్భం, నెలసరి రావడానికి థైరాయిడ్ హార్మోను పాత్ర కూడా కీలకంగా ఉంటుంది. ఈ థైరాయిడ్ హార్మోను పనితీరు సరిగ్గా లేకపోతే అండం విడుదలపై ప్రభావం పడుతుంది. మీ సమస్య కూడా అదే. అధికబరువు ఉన్నా కూడా హార్మోన్ల పనితీరు సజావుగా సాగదు. ఇప్పుడు మీరు ఇంజెక్షన్లు తీసుకున్నాక అండం విడుదల అవుతోందని అంటున్నారు కాబట్టి ఇది మంచి సంకేతమే. ఇలాగే ప్రతినెలా అవ్వాలని లేదు. ఒత్తిడిని తగ్గించుకుని, హార్మోన్లన్నీ సమతూకంలో పనిచేసేలా చూసుకుంటే అండం సహజంగానే విడుదల అవుతుంది. ఇక, ఈ ఇంజెక్షన్లు తీసుకోవడం అనేది చికిత్సలో భాగం కాబట్టి వైద్యులు చెప్పినంత కాలం కొనసాగించండి. ఒకసారి గర్భం వచ్చి, ప్రసవం అయితే రెండోసారి చికిత్స అవసరం లేకుండానే గర్భం దాల్చొచ్చు. ఒకవేళ థైరాయిడ్ వల్ల మీరు అధికబరువు పెరిగితే దాన్ని తగ్గించుకునేందుకు నిపుణుల సలహాతో వ్యాయామాలు చేయండి. పోషకాహారం తీసుకోండి. థైరాయిడ్‌కి సూచించిన మందులు వాడుతూ... ఆ సమస్యను కూడా అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం.

- మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

నజరానా

అప్పటికప్పుడు చర్మం తాజాగా కనిపించాలా... గుడ్డులోని తెల్లసొనను బాగా గిలకొట్టి ముఖానికి పూతలా రాసుకోండి. పదినిమిషాలయ్యాక చల్లని నీటితో కడిగేస్తే చాలు.

గుండె ఆరోగ్యానికి గుప్పెడు గింజలు

వయసుపెరుగుతున్న కొద్దీ గుండెజబ్బుల ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. మరి వాటిని అదుపులో ఉంచాలంటే క్రమం తప్పని వ్యాయామంతోపాటు గుండెకు మేలు చేసే ఆహారాన్ని ఎంచుకోవాలి. రోజువారీ తీసుకునే ఆహారంలో ఈ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.



అల్పాహారం: రోజూ తినే టిఫిన్‌తోపాటు గుప్పెడు బాదం గింజలను తీసుకోవాలి. వీటిలోని మాంసకృత్తులు గుండెకు మేలు చేస్తాయి. అంతేకాదు టైప్-2 మధుమేహ బాధితుల్లో ఇవి రక్తంలో చక్కర స్థాయులను నియంత్రిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. బాదం, వాల్‌నట్లలో ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు ఉంటాయి.



మధ్యాహ్నం: ఉడికించిన చిలగడదుంప, సెనగలు, కూరగాయల సలాడ్‌ను మధ్యాహ్న భోజన సమయంలో తీసుకోవాలి. చిలగడ దుంపలో బీటా కెరొటీన్, పొటాషియం, మాంసకృత్తులు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. కొద్దిగా తీసుకున్నా పొట్ట నిండిన భావన కలుగుతుంది. అంతేకాదు ఇవి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బఠాణీలు, కూరగాయల్లోని మాంసకృత్తులు, ఇతర పోషకాలు శరీరానికి శక్తిని ఇవ్వడంతోపాటు రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.



సాయంకాలం స్నాక్స్: ప్రతిరోజూ ఒకటి రెండు యాపిల్స్ తినడం వల్ల గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. పోషకాలు, మాంసకృత్తులతో నిండి ఉండే ఈ పండు నుంచి మనకు లభించే కెలొరీలు కూడా చాలా తక్కువే.

రాత్రి భోజనం: చాలా మితంగా తీసుకోవాలి. సలాడ్, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి. మాంసాహారులైతే చేపల్ని తీసుకోవచ్చు. శాకాహారులైతే ఒమెగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు అందే ఆహార పదార్థాలను ఎంచుకోవాలి. ఇవి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వీటితో పాటు చెంచా పొద్దుతిరుగుడు గింజలు, కప్పు మీగడ తీసిన పాలు, ఒక చిన్న నారింజ పండును కూడా చేర్చుకోవచ్చు.

● తాజా కాయగూరలు, పండ్లు, చిరుధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, డ్రైఫ్రూట్స్, గింజలు... వంటివన్నీ ఆరోగ్యాన్నిచ్చేవే. వీటిని మీ రోజువారి భోజనంలో చేర్చుకోవాలి. అలాగే చక్కెర, ఉప్పు, కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలను వీలైనంతవరకూ తగ్గించాలి.

బంగారం వెండి

18న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,093	3,111
వెండి (గ్రా)	42.50	42.90




	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,450	33,600	33,000	32,550	32,900	32,850	33,380	33,520	33,310	33,410
ఆర్నమెంట్	31,250	31,260	30,600	30,250	30,300	30,390	31,040	31,110	30,980	31,080
వెండి(కిలో)	40,330	40,500	40,600	40,200	40,500	40,500	40,300	40,500	41,500	41,000

పాత బస్సులే... టాయిలెట్లుగా

చదువు, ఉద్యోగం, షాపింగ్... అంటూ రోజూ ఎంతోకొంత సమయం బయట గడపడం మనలో చాలామంది చేసేదే. మరి అత్యవసరంగా బాత్రూంకి వెళ్లాల్సి వస్తే! ఎక్కడికి వెళ్లాలి? తనకు ఎదురైన అలాంటి సమస్యలోంచే ఓ ఆలోచన చేసింది అల్కా సడల్కర్. పనికిరాని బస్సుల్ని టాయిలెట్లుగా మార్చి... 'టాయిలెట్స్ ఫర్ హర్' పేరుతో పుణెలో అందుబాటులోకి తెచ్చింది.

అల్కా సడల్కర్‌ది పుణె. ప్రొడక్షన్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఆమె 'పోర్టబుల్ టాయిలెట్లు' తయారుచేసే ఓ సంస్థలో డైరెక్టర్‌గా చేరింది. అక్కడే తనకీ ఆలోచన వచ్చిందంటుందామె. ఓ రోజు అల్కా షాపింగ్‌కి వెళ్లింది. కాసేపటికే బాత్రూంకి వెళ్లాల్సిన పరిస్థితి. దరిదాపుల్లో ఎక్కడా టాయిలెట్ కనిపించలేదు. తనలాంటి పరిస్థితి మరో మహిళకు రాకూడదనే ఉద్దేశంతో ఇలాంటి టాయిలెట్లను ఏర్పాటు చేయాలనుకుంది. "మా సంస్థలో తయారుచేసే టాయిలెట్లు ప్రభుత్వ కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలకు అద్దెకిస్తాం. మహిళలకోసం అలాంటివి ప్రత్యేకంగా ఎందుకు తయారు చేయకూడదనుకున్నా. మున్సిపాలిటీ అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి పనికిరాని బస్సుల్ని ఇందుకు ఎంచుకున్నా. అవసరమైన మార్పులు చేసి ఆధునికంగా ఉండే టాయిలెట్లను రూపొందించి, పుణెలో అక్కడక్కడా ఏర్పాటు చేయించా. మొదట మూడు బస్సులను ఇందుకు ఉపయోగించాం. ఇప్పుడు పన్నెండు బస్సులు అయ్యాయి. ఆ ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తోంది. టాయిలెట్లను నిలిపే చోట డ్రైనేజీ అవసరం కూడా ఉంటుంది కాబట్టి... ఆ అనుమతులూ తీసుకున్నా. అలా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని 'టాయిలెట్స్ ఫర్ హర్' పేరుతో పుణెలో ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చాం. ఇదంతా స్మార్ట్ సిటీ కార్యక్రమంలో భాగమే..." అని చెబుతుంది అల్కా. ఈ టాయిలెట్ బస్సులు పుణెలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో కనిపిస్తాయి. రోజుకి 150 నుంచి 300 మంది మహిళలు వీటిని ఉపయోగిస్తున్నారు. ఒకసారి వాడుకున్నందుకు ఐదు రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. వాటిపై వచ్చే ఆదాయాన్ని టాయిలెట్ల నిర్వహణకే ఉపయోగిస్తున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా ఇలాంటి టాయిలెట్ల సంఖ్యను పెంచే పనిలో ఉంది అల్కా.









సౌకర్యాలివే

వీటిలో మూడు ఇండియన్, రెండు వెస్టర్న్ టాయిలెట్లుంటాయి. వాష్‌బేసిన్లు, పిల్లలకు న్యాపీలు మార్చుకునే చోటు, శానిటరీ న్యాప్‌కిన్ల కౌంటర్ ఉంటుంది. బస్సుపై సోలార్ ప్యానెల్స్, రెండు వేల లీటర్ల నీరు నిల్వ ఉండే వాటర్ ట్యాంకులుంటాయి. వైఫై, లాండ్రీ సౌకర్యం కూడా ఉంది. ప్రతీ బస్సుకు ఒక మహిళా సిబ్బంది ఉంటుంది.



వినలేడు.. మాట్లాడలేడు.. కానీ పేలుస్తాడు



పుణెలో ఖేలో ఇండియా యూత్ క్రీడలు.. ఎయిర్ రైఫిల్ విభాగంలో పతకం కోసం షూటర్లు పోటీపడుతున్నారు... ప్రత్యర్థులను తలదన్ని తెలంగాణ కుర్రాడు ఛాంపియన్‌గా నిలిచి స్వర్ణం సొంతం చేసుకున్నాడు... అతడి ప్రదర్శన చూసి అందరూ చప్పట్లతో అభినందిస్తున్నారు. కానీ అతనేమీ స్పందించడం లేదు.. ఎందుకంటే వాళ్ల చప్పట్లు అతడికి వినబడవు. తాను పతకం సాధించిన ఆనందాన్ని మాటల్లో చెప్పడం కూడా అతడి వల్ల కాదు. ఎందుకంటే అతనికి మాటలు కూడా రావు.. పుట్టుకతోనే మూగ, చెవిటివాడైన ఆ కుర్రాడు తుపాకీతోనే మాట్లాడుతున్నాడు.. దాంతోనే వింటున్నాడు. దేశంలో మామూలు షూటర్లలో పోటీ పడి పతకం సాధించిన తొలి బదిర షూటర్‌గా రికార్డులకెక్కాడు హైదరాబాదీ ధనుష్ శ్రీకాంత్.

పుట్టుకతోనే చెవులు వినపడవు, మాటలు రావు. అయితేనేం ధనుష్ నిరాశపడలేదు. వైకల్యాన్ని చూసి కుంగిపోలేదు. అన్నీ సక్రమంగా ఉన్న కుర్రాళ్లకు దీటుగా నిలవాలని తపన పడ్డాడు. దాని కోసం నిరంతరం శ్రమించాడు. అడ్డంకుల్ని దాటుకొని సత్తా చాటాడు. ఖేలో ఇండియా యూత్ క్రీడల షూటింగ్‌లో స్వర్ణంతో మెరిశాడు. నోటితో మాట్లాడకపోయినా.. తుపాకీ శబ్దాలతోనే విజయ గీతికను వినిపిస్తున్నాడు. ఖేలో ఇండియా క్రీడల్లో అతను జూనియర్ ప్రపంచకప్ కాంస్య విజేత అర్జున్‌ను వెనక్కునెట్టి మరీ పతకం సాధించడం విశేషం. అండర్-21 ఎయిర్ రైఫిల్ అర్హత రౌండ్లలో 629.7 స్కోరుతో తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన నమోదు చేసిన అతను ఫైనల్లో 248.9 స్కోరుతో పసిడి కైవసం చేసుకున్నాడు.

> "ధనుష్‌కు అర్థమయ్యేలా చెప్పడం మాకు సవాలుగా ఉండేది. మా కోచ్‌లు కూడా సైగల భాషను నేర్చుకోవడం మొదలెట్టారు. అయినా కొన్ని అంశాల్ని వివరించడంలో ఇబ్బంది ఎదురయ్యేది"
>
> -గగన్ నారంగ్

ఏడాది వయసులో: బిడ్డ పుట్టగానే ఆ తల్లిదండ్రులు ఆనందపడ్డారు. కానీ ఏడాది తిరగ్గానే వాళ్ల సంతోషం ఆవిరైంది. ధనుష్‌కు పుట్టుకతోనే మూగ, చెవుడు అని తెలిసింది. మొదట్లో బాధపడ్డ ఆ తల్లిదండ్రులు.. ఆ తర్వాత తమకు తాము ధైర్యం చెప్పుకున్నారు. బిడ్డలోనూ స్థైర్యాన్ని నింపాలనుకున్నారు. తమ కొడుకును గొప్ప స్థానంలో చూడాలని లక్ష్యం పెట్టుకున్న ఆ తల్లిదండ్రులు.. అతడిని అందరు పిల్లల్లాగే పెంచారు. మిగతా విద్యార్థులతో పాటే పాఠశాలలో చేర్పించారు. చిన్నప్పటి నుంచే ధనుష్‌లో చాలా నైపుణ్యాలుండేవి. చక్కటి బొమ్మలు గీసేవాడు. పాఠశాల స్థాయిలో వివిధ క్రీడల్లో రాణించేవాడు. ఇవన్నీచూసి ధనుష్‌లో మిగతా పిల్లల్ని మించి ప్రతిభ ఉందని నమ్మామని అతని తల్లి ఆశ చెబుతోంది. "ధనుష్‌కు మాటలు రావు, చెవులు వినబడవు అని ఏడాది వయసుండగా తెలిసింది. దాంతో చాలా బాధపడ్డాం. కానీ నిరాశ పడుతూ కూర్చుంటే లాభం లేదని భావించాం. మిగతా పిల్లలతో పాటే తనను పాఠశాలలో చేర్పించాం. చిన్నప్పటి నుంచి అన్ని రంగాల్లో ధనుష్ ప్రతిభ కనబరిచేవాడు" అని ఆశ చెప్పింది. చెవులు వినబడపోవడమే ఇప్పుడు ధనుష్‌కు వరంగా మారిందని చెప్పవచ్చు. ఎందుకంటే పోటీల్లో పాల్గొనే షూటర్లకు బయట శబ్దాల వల్ల ఏకాగ్రత చెదురుతుంటుంది. ధనుష్‌కు ఆ ఇబ్బంది లేదు. అతను పూర్తి ఏకాగ్రతతో లక్ష్యంపై గురిపెట్టి పతకాలు కొల్లగొడుతున్నాడు.

తైక్వాండో నుంచి షూటింగ్‌కు..

ధనుష్ ఎనిమిదేళ్ల వయసులో తైక్వాండోలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. డబుల్ బ్లాక్‌బెల్ట్ కూడా సొంతం చేసుకున్నాడు. అయితే చిన్నప్పటి నుంచి ఎక్కువగా బొమ్మ తుపాకీలతో ఆడుకొనే ధనుష్.. షూటింగ్ వైపు రావడం చిత్రంగా జరిగింది. సికింద్రాబాద్‌లో గగన్ నారంగ్ ఆరంభించిన గన్ ఫర్ గ్లోరీ అకాడమీ పోస్టర్ చూసిన ధనుష్ అందులో చేరాలని నిర్ణయించుకున్నాడు. తల్లిదండ్రులు అతడిని ప్రోత్సహించారు. మూడేళ్ల క్రితం అకాడమీలో చేరి తుపాకీ పట్టిన అతను క్రమంగా మెరుగవుతూ వచ్చాడు. అయితే ధనుష్ బదిరుడు కావడంతో శిక్షణ సమయంలో అతనికి ఏదైనా చెప్పాలంటే కోచ్‌లు ఇబ్బందిపడేవాళ్లు. సైగల ద్వారా చెప్పే ప్రయత్నం చేసేవాళ్లు. అయినా షూటింగ్ పరిజ్ఞానం గురించి అర్థమయ్యేలా చెప్పడం కోచ్‌లకు కష్టంగానే ఉండేదట. పట్టుదలతో ధనుష్ అన్ని విషయాలను అర్థం చేసుకొని షూటింగ్‌పై పట్టు సాధించాడు. తనకేమీ వినిపించకపోయినా.. షూటింగ్‌కు సంబంధించిన వీడియోలను యూట్యూబ్‌లో చూసి టెక్నిక్‌ల గురించి తెలుసుకున్నాడు. రెండేళ్ల శిక్షణలో రాటుదేలిన అతను.. 2024 ఒలింపిక్స్ కోసం అథ్లెట్లను సన్నద్ధం చేసే కార్యక్రమం ప్రాజెక్ట్ లీప్‌కు ఎంపికయ్యాడు. గతేడాది రాష్ట్రస్థాయి జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు సాధించిన అతను.. ఇటీవల దిల్లీలో జరిగిన సీనియర్ ట్రయల్స్‌లో నాలుగో స్థానంలో, జూనియర్ ట్రయల్స్‌లో (అండర్-21) మూడో స్థానంలో, యూత్ ట్రయల్స్ (అండర్-18)లో రెండో స్థానంలో నిలిచాడు.

కథలు వేరు.. కల ఒక్కటే

సోదరులు ఆడుతుంటే చూసి ఆసక్తితో ఆటలోకి వచ్చింది ఒకరు.. అక్క భయపడ్డ ఆటలో తాను సత్తా చాటి తండ్రి ఆశను నెరవేర్చింది మరొకరు.. పరుగు వదిలి బంతితో మాయ చేస్తోంది ఇంకొకరు.. చిన్నాన్న స్ఫూర్తితో ఆటలో అడుగుపెట్టి ఆల్‌రౌండర్‌గా అదరగొడుతోంది వేరొకరు.. పేద కుటుంబంలో పుట్టి, చిన్నతనంలో అమ్మను కోల్పోయినా తండ్రి అండతో ఉత్తమ ఆల్‌రౌండర్‌గా ఎదిగింది మరొకరు.. ఇలా వారి నేపథ్యాలు, కథలు వేరైనా.. అందరూ కన్న కల ఒకటే. ఇంతకీ ఎవరు వీరంతా.. ఏంటి వాళ్ల కల.. తెలుసుకుందాం పదండి.



ఇటీవల ముగిసిన బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే లీగ్‌లో ఆంధ్ర రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల ఆంధ్ర క్రికెట్ చరిత్రలో రాష్ట్ర మహిళల జట్టు ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి. తుదిపోరులో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నప్పటికీ.. జట్టు పోరాట పటిమ అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్ర ఆ ఘనత సాధించడానికి ప్రధాన కారణం కెప్టెన్ అనూష, ఆల్‌రౌండర్లు ఝాన్సీలక్ష్మి, పుష్పలత, అంజలి, బ్యాట్స్‌వుమన్ పద్మజ. ఈ ఐదుగురూ అంచనాలకు మించి రాణించి జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందించారు.

అక్క ఆడనంది.. చెల్లి సై అంది

ఆ తండ్రికి ఇద్దరు కూతుళ్లు. చిన్నప్పటి నుంచి వాళ్లను ఆటల్లోకి తీసుకురావాలన్నది ఆయన కోరిక. ముందు నుంచే వారికి ఆటలపై అవగాహన కల్పించాడు. పెద్దమ్మాయిని క్రికెట్ శిక్షణ కోసం పంపించాడు. కానీ కొన్ని రోజుల శిక్షణ తర్వాత ఈ ఆట తన వల్ల కాదని వెనక్కి వచ్చేసింది. తర్వాత చిన్నమ్మాయిని పంపించాడు. ఆమె మాత్రం ఊరికే వెనక్కి రాలేదు.. ట్రోఫీలతో వచ్చింది. 19 ఏళ్ల వయసులోనే ఆంధ్ర జట్టుకు కెప్టెన్ అయిన నీరుగట్టి అనూష నేపథ్యమిది. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన ఈ అమ్మాయి బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే లీగ్‌లో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా సత్తా చాటింది. టోర్నీలో ఓ అజేయ అర్ధశతకం సహా 230 పరుగులు చేసింది. వీరిది వ్యవసాయ కుటుంబమే అయినా.. కూతుళ్లని క్రికెటర్లను చేయాలనుకున్నాడు తండ్రి. ఆరేళ్ల వయసులో తొలిసారి బ్యాట్ పట్టిన అనూష.. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ పట్టుదలతో ఆటలో కొనసాగింది. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆంధ్రను రన్నరప్‌గా నిలిపి సగర్వంగా నిలబడింది. "నా సారథ్యంలోని జట్టు ఇలాంటి ప్రదర్శన చేయడం పట్ల గర్వంగా ఉంది. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. అబ్బాయిలతో కలిసి ఆడేదాన్ని. మా నాన్నే నన్ను నడిపించారు. భారత జట్టుకు ఎంపికై ఆయన రుణం తీర్చుకోవాలి. ఇప్పటికే ఛాలెంజర్స్ టోర్నీలో ఇండియా రెడ్ తరపున ఆడా" అని అనూష తెలిపింది. మహిళల క్రికెట్లో హర్మన్‌ప్రీత్ ఆట అంటే ఇష్టమని చెబుతోన్న ఆమె ప్రస్తుతం డిగ్రీ రెండో ఏడాది చదువుతోంది.



అథ్లెటిక్స్ నుంచి.. ఇటు

చిన్నప్పటి నుంచి ఆ అమ్మాయి పరుగులో ఛాంపియన్. 100 మీటర్ల పరుగులో అనేక పతకాలు సొంతం చేసుకుంది. పాఠశాల స్థాయి పరుగు పోటీల్లో సత్తాచాటింది. అయితే పాఠశాల స్థాయిలో ఓ క్రికెట్ కోచ్ ఆమెను మీడియం పేసర్‌గా ప్రయత్నించమని చెప్పాడు. అదే పరుగును బంతి వేయడంలో చూపించమని సలహా ఇచ్చాడు. ఆమె అదే చేసింది. కొంత కాలానికే ఫాస్ట్‌బౌలర్‌గా మంచి పేరు సంపాదించింది. ఆమే.. సీనియర్ మహిళల వన్డే లీగ్‌లో 13 వికెట్లతో సత్తా చాటిన లెఫ్టార్మ్ పేసర్ అంజలి శర్వాణి. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఈ 21 ఏళ్ల అమ్మాయి బౌలింగ్‌లోనే కాదు బ్యాట్‌తోనూ రాణించగలదు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ తన ఆటతీరుతో స్పాన్సర్ల దృష్టిని ఆకర్షించిన అంజలి.. వాళ్ల సాయంతోనే కిట్లు కొనుక్కుంది. "2010 నుంచి బౌలింగ్‌లో శిక్షణ తీసుకోవడం మొదలెట్టా. అమ్మాయిలకు ఆటలెందుకు.. పైగా క్రికెట్ ఆడిస్తారా.. అని తెలిసిన వాళ్లు నాన్నను వారించే ప్రయత్నం చేశారు. అయినా ఆయన వినలేదు. క్రికెట్లో కొనసాగేలా ప్రోత్సహించారు. ఇప్పటికే ఛాలెంజర్స్ ట్రోఫీలో ఆడా. టీమ్‌ఇండియాకు ఆడటమే నా లక్ష్యం" అని అంజలి చెప్పింది. ఆమె ప్రస్తుతం డిగ్రీ రెండో ఏడాది చదువుతోంది.

అన్న, తమ్ముడు.. ఆమె

ఆ అమ్మాయికి ఓ అన్న, తమ్ముడు. ఎప్పుడు చూసిన వాళ్లు క్రికెట్ క్రికెట్ అంటూ తిరిగేవాళ్లు. వారితో పాటు మైదానానికి వెళ్తూ ఆ అమ్మాయి కూడా క్రికెట్ ఆడడం మొదలెట్టింది. ఆ ఆటపై ఇష్టం పెంచుకుంది. అన్నయ్య ప్రోత్సహించడంతో క్రికెట్‌నే కెరీర్‌గా ఎంచుకుంది. బ్యాట్, బంతితో అదరగొట్టి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. మహిళల వన్డే లీగ్‌లో 223 పరుగులతో సత్తా చాటిన ఎల్లుట్ల పద్మజ గురించే ఈ ఉపోద్ఘాతమంతా! తిరుపతికి చెందిన ఈ అమ్మాయి.. ఐదేళ్ల కిందటే, తనకు పద్నాలుగేళ్ల వయసుండగా రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. కుడిచేతి వాటం బ్యాటర్‌గానే కాక.. మీడియం పేసర్‌గానూ జట్టుకు ఉపయోగపడుతోంది కీలక సభ్యురాలిగా ఎదిగింది. "జట్టు ఫైనల్ చేరడంలో నా వంతు పాత్ర ఉండడం సంతోషంగా ఉంది. నాన్న ప్రోత్సాహంతోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకొని ఈ స్థాయికి చేరుకున్నా. గతంలో మిథాలీ రాజ్ నాయకత్వంలో ఆడా. ఆమెలాగే భారత్‌కు ఆడతా" అని ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న పద్మజ పేర్కొంది.



చిన్నాన్న స్ఫూర్తితో..

218 పరుగులు.. 8 వికెట్లు.. సీనియర్ మహిళల వన్డే లీగ్‌లో ఆంధ్ర ఆల్‌రౌండర్ పుష్పలత ప్రదర్శన ఇది. విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన ఈ పద్దెనిమిదేళ్ల అమ్మాయి క్రికెట్ వైపు రావడం వెనక ఆమె చిన్నాన్న ప్రోత్సాహం ఉంది. ఆయన క్రికెటర్ కావడంతో మ్యాచ్‌లకు వెళ్లేటపుడు పుష్పలతను వెంట తీసుకెళ్లేవాడు. తర్వాత ఆమెనూ ఆడించాడు. అలా పన్నెండేళ్ల వయసులో బ్యాట్ పట్టింది పుష్పలత. ఐతే ఆమె క్రికెట్ ఆడతానంటే.. వద్దే వద్దంటూ అమ్మమ్మ పట్టు పట్టింది. కానీ ఎలక్ట్రీషియన్ అయిన పుష్పలత తండ్రి అదేం పట్టించుకోకుండా కూతురిని క్రికెట్లోకి పంపించాడు. అబ్బాయిలతో పాటు వేసవి శిబిరాల్లో శిక్షణ ఇప్పించాడు. తర్వాత పుష్ప అమ్మాయిల అకాడమీలో చేరి ఆటను మెరుగుపర్చుకొంది. అండర్-16 స్థాయిలో సత్తాచాటింది. అండర్-19 విభాగంలో మంచి ప్రదర్శనతో రాష్ట్ర సీనియర్ జట్టుకు ఎంపికైంది. అండర్-23లోనూ మెరుగైన ప్రదర్శన కనబరుస్తూ దూసుకెళ్తోంది. ఆమె ప్రస్తుతం ఇంటర్ రెండో ఏడాది చదువుతోంది. "బాబాయి స్ఫూర్తితోనే క్రికెట్లోకి అడుగుపెట్టా. ఎన్ని అడ్డంకులు ఎదురైనా నాన్న అండగా నిలిచాడు. కుటుంబంలో చాలామంది వారిస్తున్నా నన్ను క్రికెట్ శిక్షణలో చేర్పించాడు. భారత జట్టుకు ఎంపికవడమే కాదు.. ఉత్తమ క్రికెటర్‌గా పేరు తెచ్చుకోవాలనీ ఉంది" అని పుష్పలత పేర్కొంది.



అన్నీ నాన్నే..

చిన్నతనంలోనే అమ్మ ప్రేమకు దూరమైంది. అప్పటి నుంచి నాన్నే అన్నీ అయి ఆమెను పెంచాడు. తన కూతురిని క్రీడల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనుకున్నాడు. క్రికెట్ బ్యాట్ చేతికి అందించాడు. తాపీ మేస్త్రీగా పనిచేసే ఆయనే కూతురికి ఆటలో ఓనమాలు నేర్పించాడు. తండ్రి, కోచ్‌ల సాయంతోనే క్రికెటర్‌గా రూపుదిద్దుకొన్న ఆ అమ్మాయి.. సీనియర్ మహిళల వన్డే లీగ్‌లో ఆంధ్ర ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించి ప్రశంసలు అందుకుంటోంది. ఆమే.. ఆల్‌రౌండర్ చల్లా ఝాన్సీ లక్ష్మి. టోర్నీలో ఓ శతకం సహా 358 పరుగులు చేసిన ఆమె.. తన ఆఫ్ స్పిన్ మాయతో 16 వికెట్లు పడగొట్టి సిసలైన ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. నరసరావుపేటకు చెందిన ఝాన్సీ.. 11 ఏళ్లకే అండర్-16 రాష్ట్ర జట్టు తరపున ఆడి సత్తా చాటింది. అండర్-19 టోర్నీల్లోనూ మెరిసింది. 14 ఏళ్ల వయసులో అండర్-19 ఛాలెంజర్ ట్రోఫీలో ఇండియా గ్రీన్‌కు ఆడి చక్కటి ప్రదర్శనతో జాతీయ స్థాయిలో పేరు సంపాదించింది. ఇంటర్‌తో చదువు ఆపేసి పూర్తిగా ఆటపై దృష్టిపెట్టిన ఝాన్సీ.. సీనియర్ స్థాయిలోనూ రాణించింది. "మా నాన్న మా కడుపు నింపడానికే చాలా కష్టపడ్డారు. ఆయన కష్టాన్ని వృథా చేయదలుచుకోలేదు. భవిష్యత్‌లో భారత జట్టుకు ఎంపికవ్వాలన్నది నా లక్ష్యం. మిథాలీ రాజ్, ధోనీలే నాకు స్ఫూర్తి" అని ఝాన్సీ చెప్పింది.



ఎనిమిదేళ్ల వయసున్న పిల్లలు సాధారణంగా ఏం చేస్తారు? ఇంట్లో టాప్ లేపుతారు.. కానీ ఆ కుర్రాడు కూడా టాప్ లేపుతున్నాడు కానీ అల్లరిలో కాదు గోల్ఫ్‌లో! గోల్ఫ్ స్టిక్ అంత లేడు... కానీ బంతిని బలంగా లక్ష్యం దిశగా కొట్టేస్తున్నాడు.. చిన్నోడే కానీ ఆటలో అదరగొడుతున్నాడు.. ఇటీవల మలేసియాలో జరిగిన ప్రపంచ గోల్ఫ్ ఓపెన్ టైటిల్ గెలిచి భళా అనిపించిన ఆ పిల్లాడే కార్తీక్ సింగ్. ఈ టోర్నీలో టైటిల్ గెలిచిన భారత పిన్నవయస్కుడిగా కార్తీక్ ఘనత సాధించాడు.

గోల చేసే వయసులో.. గోల్ఫ్ టైటిల్ కొట్టాడు

మలేసియాలో తాజాగా జరిగిన ప్రపంచ అండర్-8 గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన కార్తీక్‌సింగ్ స్వస్థలం కేరళలోని కోచి. మూడేళ్ల క్రితమే గోల్ఫ్ స్టిక్ పట్టాడు. నౌకా దళ అధికారి అయిన తండ్రి తరుచూ గోల్ఫ్ ఆడుతుండడంతో చిన్న వయసులోనే కార్తీక్‌కు ఈ క్రీడపై ఆసక్తి కలిగింది. ఆ పెద్ద స్టిక్‌తో బంతిని కొట్టడం కష్టమైనా సరే సాధనతో ఈ క్రీడలో నైపుణ్యం సంపాదించాడు. గోల్ఫ్‌లో కార్తీక్ ప్రతిభను చూసి అతని తండ్రి ధనంజయ్‌సింగ్ మెరుగైన శిక్షణ కోసం గుడ్‌గావ్‌కు మకాం మార్చాడు. ఇక్కడ కర్మా లేక్‌ల్యాండ్ గోల్ఫ్ కోర్స్‌లో తన నైపుణ్యానికి మెరుగుపెట్టుకున్న కార్తీక్.. వేగంగా ఆటపై పట్టు సంపాదించాడు. ఉత్తమమైన కంటి, చేయి సమన్వయం ఉండడంతో ఇక్కడ శిక్షణ పొందుతూనే వయసు విభాగాల టోర్నీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు.




ఖాతాలో 50 టైటిళ్లు

ఇప్పటిదాకా 50 టైటిళ్లు కార్తీక్ ఖాతాలో ఉన్నాయంటే ఈ కుర్రాడి సత్తాను అంచనా వేయొచ్చు. 2017లో అమెరికాలో జరిగిన యుఎస్ కిడ్స్ ఛాంపియన్‌షిప్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచిన కార్తీక్.. గతేడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ఆల్‌బట్రోస్ ఇంటర్నేషనల్ టోర్నీలో ప్లేఆఫ్‌లో టైటిల్ చేజార్చుకుని రన్నరప్ అయ్యాడు. ఇక యుఎస్ వేదికగా జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఎలాంటి తడబాటు లేకుండా టైటిల్ సాధించాడు. టైగర్ వుడ్స్ అంటే అమితంగా ఇష్టపడే కార్తీక్ భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు.

వస్తోంది.. వాటికన్ అథ్లెటిక్స్ జట్టు!

వాటికన్ సిటీ.. ప్రపంచంలో అతి చిన్న నగరం! క్రిస్మస్ అనగానే ప్రపంచం మొత్తం ఈ నగరం వైపే చూస్తుంది దీనికి కారణం పోప్ ఇచ్చే సందేశం! అక్కడ అంతా క్రీస్తు ఆరాధనలో జీవిస్తుంటారు. అలాంటి నగరం నుంచి ఇప్పుడో అథ్లెటిక్స్ జట్టు తయారవుతోంది. ఏదో సరదా పరుగు కోసం కాదు ఒలింపిక్స్ లక్ష్యంతో! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఒలింపిక్స్‌తో పాటు అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు 60 మందితో వాటికన్ జట్టు సిద్ధమవుతోంది. క్రైస్తవ సన్యాసినులతో పాటు బోధకులు, సెక్యూరిటీ గార్డులు, ఫార్మాసిస్టులు ఇలా వివిధ ఉద్యోగులు అథ్లెటిక్స్ జట్టులో భాగం అయ్యారు. ఒలింపిక్స్ క్రీడల ఆరంభోత్సవంలో వాటికన్ జెండా కూడా ఎగరాలనేది ఆ జట్టు సంకల్పం. వాటికన్ సిటీ గుర్తు క్రాస్‌తో కూడిన నీలం రంగు ట్రాక్ సూట్‌లను ఇటీవలే విడుదల చేశారు. తమ దేశంలో పరుగు సంస్కృతిని పెంచడం కోసమే తాము బరిలో ఉన్నట్లు వాటికన్ అథ్లెట్లు చెబుతున్నారు. ఇప్పటిదాకా వాటికన్ తరపున అనధికారికంగా ఫుట్‌బాల్, క్రికెట్ జట్లు ఉన్నాయి. బ్రిటన్‌లో ప్రతి ఏడాది ఈ జట్లు పర్యటిస్తాయి. అయితే అథ్లెటిక్స్ కోసం ఇలా అధికారికంగా ఒక జట్టును ప్రకటించడం ఇదే తొలిసారి. కొత్త ఏడాది జనవరి 20న రోమ్‌లో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో వాటికన్ జట్టు పోటీపడబోతోంది.



ఛాంపియన్



సైనా

సెమీస్‌లో సైనా

శ్రీకాంత్ ఓటమి

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ సైనా 21-18, 23-21తో రెండో సీడ్ నొజొమి ఒకుహర (జపాన్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ కిదాంబి శ్రీకాంత్ 23-21, 16-21, 17-21తో నాలుగో సీడ్ సాన్ వాన్ (కొరియా) చేతిలో పోరాడి ఓడాడు. 48 నిమిషాల పాటు సాగిన పోరులో సైనా అద్భుతంగా పుంజుకుని ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. తొలి గేమ్‌లో 8-15తో వెనుకబడిన సైనా.. గొప్ప పట్టుదల కనబరిచింది. ఒక్కో పాయింటే గెలుస్తూ ఒకుహరను సమీపించింది. 12-16తో ప్రత్యర్థిని చేరువైన సైనా.. 17-16తో ఆధిక్యంలో దూసుకెళ్లింది. కొద్దిసేపటికే 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌ను ఆధిక్యంతో ప్రారంభించిన సైనా.. మధ్యలో వెనుకబడింది. 14-14 స్కోరు వద్ద ఒకుహర వరుసగా 4 పాయింట్లు గెలిచి 18-14తో ఆధిక్యంలోకి వెళ్లింది. నెమ్మదిగా ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించిన సైనా.. 19 పాయింట్ల వద్ద ఒకుహరను అందుకుంది. పాయింట్లు సమమవుతూ వెళ్లడంతో గేమ్ ఉత్కంఠగా మారింది. 20, 21 స్కోర్ల వద్ద ప్రత్యర్థికి లభించిన 2 గేమ్ పాయింట్లను సైనా కాపాడుకుంది. వరుసగా 2 పాయింట్లు సాధించి 23-21తో రెండో గేమ్, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగే సెమీస్‌లో నాలుగో సీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్)తో సైనా తలపడుతుంది. ఇప్పటి వరకు వీరిద్దరు 10 సార్లు పోటీపడగా.. చెరో ఐదింట్లో నెగ్గారు.

రంజీ సెమీస్‌లో కర్ణాటక

బెంగళూరు: కర్ణాటక జట్టు రంజీ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో ఆ జట్టు రాజస్థాన్‌ను ఓడించింది. 184 పరుగుల ఛేదనలో కెప్టెన్ మనీష్ పాండే (87 నాటౌట్; 99 బంతుల్లో 14×4, 2×6), కరుణ్ నాయర్ (61 నాటౌట్; 189 బంతుల్లో 6×4) అర్ధసెంచరీలు సాధించడంతో కర్ణాటక 47.5 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 42/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటకను నాయర్, పాండే నడిపించారు. వీళ్లిద్దరూ జాగ్రత్తగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు సాధించగా.. కర్ణాటక 263 పరుగులు చేసింది. రాజస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 222 పరుగులకు ఆలౌటైంది.

భారత పారా అథ్లెట్‌పై నాలుగేళ్ల నిషేధం

దిల్లీ: భారత పారా పవర్‌లిఫ్టర్ విక్రమ్‌సింగ్ అధికారిపై అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) నాలుగేళ్ల నిషేధం విధించింది. 2017లో విక్రమ్‌సింగ్ నుంచి సేకరించిన మూత్రం శాంపిళ్లలో నిషేధక ఉత్ప్రేరకాలు వాడినట్లు తేలడమే దానికి కారణం. "డోప్ పరీక్షల్లో విక్రమ్ దోషిగా తేలడంతో 2017 ఏప్రిల్ 26 నుంచి నాలుగేళ్ల పాటు అతను ఏ పోటీల్లో పాల్గొనకుండా నిషేధం విధించాం" అని ఐపీసీ ఓ ప్రకటనలో తెలిపింది.



చిత్రం.. భువిచిత్రం

మూడో వన్డే సందర్భంగా భువనేశ్వర్ ఓ బంతిని చిత్రంగా వేసి బ్యాట్స్‌మన్ సహా అందరినీ ఆశ్చర్యపరిచాడు. 9వ ఓవర్ ఆరో బంతికి జరిగిందిది. పరుగెత్తుకుంటూ వచ్చిన భువి.. పూర్తిగా వికెట్ల వెనకవైపు నుంచి బంతిని వేశాడు. ల్యాండింగ్ క్రీజుకు దాదాపు గజం దూరం నుంచి (దాదాపు అంపైర్ పక్క నుంచి) భువి బౌలింగ్ చేశాడు. అయోమయానికి గురైన ఫించ్.. వెనక్కి జరిగి బంతిని వదిలేశాడు. అంపైర్ దాన్ని డెడ్‌బాల్‌గా ప్రకటించాడు. నిజానికి భువి డెలివరీ నిబంధనలకు విరుద్ధమైందేమీ కాదు. కానీ బ్యాట్స్‌మన్ పక్కకు జరగడంతో అంపైర్ దాన్ని డెడ్‌బాల్‌గా నిర్ణయించాడు. ఆ తర్వాత బంతికే భువి.. ఫించ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

ముగించారు ఘనంగా...



వన్డే సిరీసూ భారత్‌దే

చారిత్రక పర్యటన పరిపూర్ణం

ఆఖరి మ్యాచ్‌లో ఆసీస్‌పై విజయం ● మళ్లీ మెరిసిన ధోని ● విజృంభించిన చాహల్

చారిత్రక పర్యటనకు ఘనమైన ముగింపు. తిరుగులేని ఆటతో కంగారూలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టీమ్ ఇండియా అన్ని సిరీస్‌ల్లోనూ అజేయంగా నిలిచి.. పోరును సగర్వంగా ముగించింది. టీ20లను 1-1తో సమం చేశాక టెస్టులను 2-1తో గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లీసేన.. ఇప్పుడు వన్డే సిరీస్‌నూ చేజిక్కించుకుని న్యూజిలాండ్ పర్యటనకు సిద్ధమైంది రెట్టించిన ఉత్సాహంతో..!

క్షీణించినట్లనిపించిన తన ఫినిషింగ్ సామర్థ్యానికి కొత్త ఊపిరులూదిన మహేంద్రసింగ్ ధోని మరో కీలక ఇన్నింగ్స్ ఆడిన వేళ.. మూడో వన్డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో కంగారూలను మట్టి కరిపించింది. కేదార్ జాదవ్ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జట్టు విజయంలో యుజ్వేంద్ర చాహల్‌దీ ఎంతో విలువైన పాత్రే. అవకాశాన్ని అందిపుచ్చుకున్న అతడు కెరీర్ అత్యుత్తమ గణాంకాలతో ఆసీస్ నడ్డివిరిచి, భారత్ పని తేలిక చేశాడు.



ధోని 87 నాటౌట్

చాహల్ 6/42

మెల్‌బోర్న్

జోరు కొనసాగించిన టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాలో మొట్టమొదటిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను సొంతం (2-1)చేసుకుంది. శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' చాహల్ (6/42) అద్భుత బౌలింగ్‌తో మొదట ఆస్ట్రేలియా 48.4 ఓవర్లలో 230 పరుగులకే ఆలౌటైంది. భువనేశ్వర్ (2/28), షమి (2/47) ఆతిథ్య జట్టును కట్టడి చేయడంలో తమవంతు పాత్ర పోషించారు. ధోని (87 నాటౌట్; 114 బంతుల్లో 6×4), కేదార్ జాదవ్ (61 నాటౌట్; 57 బంతుల్లో 7×4)ల బాధ్యతాయుత బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని భారత్.. 49.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కోహ్లి (46; 62 బంతుల్లో 3×4) రాణించాడు. ధోనీకి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌కు భారత్ జట్టులో మూడు మార్పులు చేసింది. రాయుడు, సిరాజ్, కుల్‌దీప్ స్థానాల్లో జాదవ్, విజయ్ శంకర్, చాహల్‌లకు అవకాశం దక్కింది.

ధోని మరోసారి..: ఈ సిరీస్ విజయంలో అత్యంత కీలక పాత్ర ధోనీదే. అంతగా ఫామ్‌లో లేకపోవడంతో ఆస్ట్రేలియా రావడానికి ముందు ప్రపంచకప్‌లో అతడి స్థానంపైనే సందేహాలు తలెత్తాయి. కానీ తిరిగి ఫామ్‌ను అందుకున్న అతడు సందేహాలను పటాపంచలు చేస్తూ వరుసగా మూడో అర్ధశతకం సాధించాడు. లక్ష్యం చిన్నదే అయినా.. ఛేదనలో భారత్ గొప్ప ఆరంభమేమీ లభించలేదు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆసీస్ కొత్త బంతి బౌలర్లు బ్యాట్స్‌మెన్‌ను ఒత్తిడికి గురిచేశారు. ఆరో ఓవర్లో సిడిల్ బౌలింగ్‌లో రోహిత్ (9) ఔటయ్యేటప్పటికి స్కోరు 15 పరుగులే. కోహ్లి క్రీజులోకి వచ్చినా పరుగుల కోసం భారత్ చెమటోడ్చక తప్పలేదు. మందకొడి పిచ్‌పై ధావన్ (46 బంతుల్లో 23) టైమింగ్‌తో ఇబ్బందిపడ్డాడు. 10 ఓవర్లకు స్కోరు 26 మాత్రమే. రెండో వికెట్ 44 పరుగులు జోడించాక ధావన్ 17వ ఓవర్లో ఔటయ్యాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోని, కోహ్లి మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. పరుగులు వేగంగా రాకపోయినా వాళ్లిద్దరు క్రీజులో ఉండడంతో మరీ ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయింది. ఐతే 30వ ఓవర్లో రిచర్డ్‌సన్ బంతిని డ్రైవ్ చేయబోయిన కోహ్లి.. వికెట్ కీపర్ కరేకు చిక్కాడు. అప్పటికి స్కోరు 113. ఆ తర్వాత ధోనీకి జాదవ్ మంచి సహకారాన్నిచ్చాడు. ఎక్కువగా సింగిల్స్, డబుల్స్‌పై దృష్టిపెట్టిన ధోని.. 74 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. ఏమాత్రం తడబాటు లేకుండా ఆడిన జాదవ్ అప్పుడప్పుడు దూకుడు ప్రదర్శించాడు. ఐతే పెద్దగా బౌండరీలు రాకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. చివరి 6 ఓవర్లలో 52 పరుగులు చేయాల్సిన పరిస్థితి. మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. క్రమంగా సమీకరణం 3 ఓవర్లలో 27 పరుగులకు మారింది. ఆ దశలో దూకుడు పెంచిన ధోని, జాదవ్ చకచకా నాలుగు బౌండరీలు బాది కంగారూల ఆశలపై నీళ్లు చల్లారు. ఆఖరి ఓవర్లో ఒక్క పరుగు మాత్రమే అవసరమైంది. ధోని-జాదవ్ జంట అభేద్యమైన నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించింది. ఆసీస్ పేలవ ఫీల్డింగ్‌తో కొన్ని క్యాచ్‌లు వదిలేయడం, రనౌట్ అవకాశాలను వృథా చేసుకోవడం కూడా భారత్‌కు కలిసొచ్చింది.



జాదవ్ (61 నాటౌట్)

చాహల్ అదరహో..: రెండో స్పిన్నర్‌గా ఆల్‌రౌండర్ జడేజాను జట్టులోకి తీసుకుంటుండడంతో ఇటీవల ఎక్కువగా వన్డేలు ఆడని చాహల్.. పర్యటనలో ఆఖరి మ్యాచ్‌లో దక్కిన అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను ఉక్కిరి బిక్కిరి చేశాడు. ఐతే ఆసీస్ పతనాన్ని ఆరంభించింది మాత్రం భువనేశ్వరే. షమి కూడా గొప్పగా బౌలింగ్ చేశాడు. ఓపెనర్లు కరే (5), ఫించ్ (14)లను భువి ఔట్ చేయడంతో ఆసీస్ 10 ఓవర్లకు 30/2తో నిలిచింది. షాన్‌మార్ష్ (39), ఖవాజా (34) రాణించడంతో 23 ఓవర్లలో 99/2కు చేరుకుంది. కానీ తన తొలి ఓవర్లోనే వాళ్లిద్దరినీ ఔట్ చేయడం ద్వారా చాహల్.. ఆసీస్‌కు కళ్లెం వేశాడు. స్టాయినిస్ (10)ను కూడా చాహలే రిటర్న్ క్యాచ్‌తోనూ వెనక్కి పంపాడు. 123కే ఐదు వికెట్లు కోల్పోయిన ఆసీస్.. హాండ్స్‌కాంబ్ నిలవకుంటే మరింత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేదే. దూకుడుగా ఆడిన మాక్స్‌వెల్ (26)ను షమి పదునైన బౌన్సర్‌తో ఔట్ చేశాడు. చాహల్.. తన రెండో స్పెల్‌లో హాండ్స్‌కాంబ్ వికెట్ సహా మరో మూడు వికెట్లు పడగొట్టాడు.

1 ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలవడం భారత్‌కు ఇదే తొలి సారి. ఒక్క ఫార్మాట్లో కూడా సిరీస్ కోల్పోకుండా ఆసీస్ పర్యటనను ముగించిన తొలి జట్టు భారతే.

6 ఆస్ట్రేలియాకు ఇది వరుసగా ఆరో వన్డే సిరీస్ పరాజయం

7 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డును గెలవడం ధోనీకి ఇది ఏడోసారి. అత్యంత పెద్ద వయసు (37 ఏళ్ల 195 రోజులు)లో ఈ అవార్డు గెలిచిన భారత ఆటగాడు ధోనీయే. గావస్కర్ (37 ఏళ్ల 191 రోజులు, 1987లో శ్రీలంకపై) రికార్డును ధోని బద్దలు కొట్టాడు.


6/42 మూడో వన్డేలో చాహల్ గణాంకాలు. ఆస్ట్రేలియాలో వన్డే మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన భారత బౌలర్‌గా అతడు అగార్కర్ (6/42, 2004) సరసన నిలిచాడు.

103.07 వన్డేల్లో విజయవంతమైన ఛేదనల్లో ధోని సగటు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: కరే (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 5; ఫించ్ ఎల్బీ (బి) భువనేశ్వర్ 14; ఖవాజా (సి) అండ్ (బి) చాహల్ 34; షాన్ మార్ష్ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 39; హాండ్స్‌కాంబ్ ఎల్బీ (బి) చాహల్ 58; స్టాయినిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 10; మాక్స్‌వెల్ (సి) భువనేశ్వర్ (బి) షమి 26; రిచర్డ్‌సన్ (సి) జాదవ్ (బి) చాహల్ 16; జంపా (సి) విజయ్ శంకర్ (బి) చాహల్ 8; సిడిల్ నాటౌట్ 10; స్టాన్‌లేక్ (బి) షమి 0; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (48.4 ఓవర్లలో ఆలౌట్) **230; వికెట్ల పతనం:** 1-8, 2-27, 3-100, 4-101, 5-123, 6-161, 7-206, 8-219, 9-228; **బౌలింగ్:** భువనేశ్వర్ 8-1-28-2; షమి 9.4-0-47-2; విజయ్ శంకర్ 6-0-23-0; కేదార్ జాదవ్ 6-0-35-0; జడేజా 9-0-53-0; చాహల్ 10-0-42-6

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) షాన్ మార్ష్ (బి) సిడిల్ 9; ధావన్ (సి) అండ్ (బి) స్టాయినిస్ 23; కోహ్లి (సి) కరే (బి) రిచర్డ్‌సన్ 46; ధోని నాటౌట్ 87; జాదవ్ నాటౌట్ 61; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (49.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) **234; వికెట్ల పతనం:** 1-15, 2-59, 3-113; **బౌలింగ్:** రిచర్డ్‌సన్ 10-1-27-1; సిడిల్ 9-1-56-1; స్టాన్‌లేక్ 10-0-49-0; మాక్స్‌వెల్ 1-0-7-0; అడమ్ జంపా 10-0-34-0; స్టాయినిస్ 9.2-0-60-1.

నగదు బహుమతి ఇవ్వరా?



ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్ గెలిచిన టీమ్ ఇండియాకు నగదు బహుమతి ఇవ్వకుండా ట్రోఫీ మాత్రమే ప్రదానం చేసిన నిర్వాహకులపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ మండిపడ్డాడు. ఆటగాళ్ల ద్వారా లాభాలు పొందుతున్న నిర్వాహకులు దానిలో వాటాను పంచాల్సిన అవసరం ఉందని అతను అభిప్రాయపడ్డాడు. చివరి వన్డేలో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన చాహల్‌కు, సిరీస్ సాంతం అద్భుతంగా రాణించి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' సొంతం చేసుకొన్న ధోనీలకు చెరో రూ.35వేలు (500 అమెరికా డాలర్లు) ఇచ్చారు. జట్టుకు కేవలం ట్రోఫీ మాత్రమే ప్రదానం చేశారు. "ఆటగాళ్లకు 500 డాలర్లు ఇవ్వడం ఏమిటీ? పైగా జట్టుకు కేవలం ట్రోఫీ మాత్రమే అందించారు. ప్రసార హక్కుల ద్వారా భారీగా ఆర్జించిన నిర్వాహకులు ఆటగాళ్లకు మంచి నగదు బహుమతి ఎందుకు ఇవ్వట్లేదు? ఆట ద్వారా ఆదాయం రావడంలో ఆటగాళ్లే కీలకం కదా. అలాంటప్పుడు వాళ్లకు తగిన విధంగా నగదు అందించాలి. వింబుల్డన్ ఛాంపియన్‌షిప్స్‌లో ఆటగాళ్లకు ఇస్తున్న నగదు బహుమతిని ఓ సారి పరిగణనలోకి తీసుకోండి" అని గావస్కర్ తెలిపాడు. వింబుల్డన్‌లో తొలి రౌండ్లో ఓడిన కూడా ఆటగాడికి రూ.36 లక్షలు అందుతాయి. సింగిల్స్ విజేతగా నిలిచిన ప్లేయర్లకు దాదాపు రూ.21 కోట్లు ఖాతాలో చేరతాయి.

"ధోని పరుగులు చేయడంపై జట్టంతా సంతోషంగా ఉంది. లయను అందిపుచ్చుకోవాలన్నా.. ఆత్మవిశ్వాసం తిరిగి పెంపొందించుకోవాలన్నా పరుగులు చేయడం చాలా ముఖ్యం. బయట చాలా మాట్లాడుకుంటారు. విమర్శలు చేస్తారు. కానీ భారత క్రికెట్ పట్ల ధోనీకి ఉన్న అంకితభావం గురించి మాకు తెలుసు. అతనిలా నిబద్ధత ఉన్న క్రికెటర్ మరొకరు లేరు. దేశం కోసం ఎంతో చేసిన అతణ్ని స్వేచ్ఛగా వదిలేయాలి. జట్టు కోసం ఏం చేయాలో అతనికి బాగా తెలుసు. ధోని తెలివైన క్రికెటర్.

– కోహ్లి

"ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. జట్టు అవసరాలే నాకు ముఖ్యం. 4 లేదా 6 ఇలా ఏ స్థానంలో ఆడాల్సి వచ్చినా కూడా జట్టుకు ఏది ముఖ్యమో అదే చేస్తా. లోయర్‌ఆర్డర్‌తో కలిసి ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయడమన్నా నాకు సంతోషమే. పద్నాలుగేళ్ల క్రికెట్ కెరీర్ తర్వాత కూడా ఆరో స్థానంలోనే బ్యాటింగ్‌కు దిగుతానని అనడం సరి కాదు. అలా నేను అనలేను కూడా.

– ధోని



"చాలాసార్లు కోపంలో ఉన్న సచిన్‌ను చూశా.. కానీ ధోనీని మాత్రం అలా చూడలేదు. ధోని క్రికెట్లో ఉన్నంత కాలం అతని ఆటను ఆస్వాదించమని భారత అభిమానులకు చెప్తున్నా. ధోని తన అనుభవం, ప్రణాళికలతో ప్రస్తుత కెప్టెన్ కోహ్లి భుజాలపై బరువును ధోని తగ్గిస్తున్నాడు. అతను సున్నాకే ఔటైనా, శతకం సాధించినా.. ప్రపంచకప్ గెలిచినా, తొలి రౌండ్లోనే ఓడినా కూడా ఒకేలాగా ఉంటాడు.."

– రవిశాస్త్రి

ఛాంపియన్‌కు చెక్

షరపోవా చేతిలో వోజ్నియాకి ఓటమి

ప్రిక్వార్టర్స్‌లో ఫెదరర్, నాదల్, కెర్బర్

ఆస్ట్రేలియన్ ఓపెన్లో గతేడాది ఛాంపియన్ కరోలినా వోజ్నియాకి ఔట్.. జోరు మీదున్న రష్యా అమ్మడు మరియా షరపోవా.. డిఫెండింగ్ ఛాంపియన్ వోజ్నియాకిని ఇంటికి పంపింది. మరోవైపు స్విస్ మాస్టర్ రోజర్ ఫెదరర్, స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్, రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ) ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్లో సంచలనం. డిఫెండింగ్ ఛాంపియన్ కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్) మూడో రౌండ్లోనే వెనుదిరిగింది. శుక్రవారం మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ వోజ్నియాకి 4-6, 6-4, 3-6తో రష్యా భామ షరపోవా చేతిలో పరాజయం చవిచూసింది. రెండో సీడ్ కెర్బర్ అలవోకగా ముందంజ వేసింది. మూడో రౌండ్లో కెర్బర్ 6-1, 6-0తో బిరెల్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేసింది. స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) 7-6 (8-6), 7-6 (7-5)తో మార్టిచ్ (చెక్ రిపబ్లిక్)పై, క్విటోవా 6-1, 6-4తో బెన్సిచ్ (స్విట్జర్లాండ్)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరారు. బార్టీ (ఆస్ట్రేలియా), కొలిన్స్ (అమెరికా), పవ్లించెన్‌కోవా (చెక్ రిపబ్లిక్), అన్‌స్లమోవా (అమెరికా) కూడా ముందంజ వేశారు.

రోజర్, రఫా జోరు: పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్, మాజీ ఛాంపియన్ రఫెల్ నాదల్ జోరు కొనసాగుతోంది. వీళ్లిద్దరూ పెద్ద కష్టపడకుండానే ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మూడో సీడ్ ఫెదరర్ 6-2, 7-5, 6-2తో అమెరికా టీనేజర్ టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. రెండో సెట్లో తప్ప.. రోజర్‌కు ప్రత్యర్థి నుంచి పెద్ద ప్రతిఘటనే ఎదురు కాలేదు. ఈ మ్యాచ్‌లో 10 ఏస్‌లతో పాటు 34 విన్నర్లు కొట్టాడతను. ఆస్ట్రేలియన్ ఓపెన్లో రోజర్‌కు ఇది 100వ మ్యాచ్ కావడం విశేషం. మరో మ్యాచ్‌లో నాదల్ 6-1, 6-2, 6-4తో డిమినర్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నాదల్.. ఆరు ఏస్‌లతో పాటు 37 విన్నర్లు కొట్టాడు. ఆరోసీడ్ సిలిచ్ కూడా మూడో రౌండ్లో గెలిచాడు. వెర్డాస్కో (స్పెయిన్) నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్న సిలిచ్ 4-6, 3-6, 6-1, 7-6 (10-8), 6-3తో కష్టంగా గట్టెక్కాడు. దిమిత్రోవ్ (బల్గేరియా), బటిస్టా అగట్ (స్పెయిన్), థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్), టియాఫో (అమెరికా) కూడా ప్రిక్వార్టర్స్ చేరారు.



షరపోవా

సెన్సెక్స్ ▲ 13	నిఫ్టీ ▲ 02	డోజోన్స్ 24718 ▲ 348	నాస్‌డాక్ 7179 ▲ 94	రూపాయి 71.19 ▼	ముడి చమురు 62.40 ▲
36387	10907			(ఒక అమెరికా డాలరుకు) 18 పైసలు	(బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)


నిఫ్టీ	18న	మార్పు%
RELIANCE IND	1184.35	4.40
WIPRO	346.15	3.21
KOTAK MAHI BANK	1240.20	1.66
HINDALCO	208.80	1.36
ADANI PORT	399.30	1.22
HCL TECH	966.30	1.22
ONGC	146.75	1.21

గ్రహణం (-)

నిఫ్టీ	18న	మార్పు%
SUN PHARMA	390.75	-8.39
BHARTI AIRTEL	311.15	-6.29
GAIL	322.15	-3.08
L & T	1317.90	-2.09
HPCL	239.50	-1.92
AXIS BANK	664.60	-1.78
BAJAJ FINSERV	6249.90	-1.72


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.73	75.05	బహ్రెయిన్ దీనార్	175.19	200.44
పౌండ్ స్టెర్లింగ్	83.95	97.36	కువైట్ దీనార్	194.11	241.64
యూరో	73.75	85.55	ఒమన్ రియాల్	171.43	196.38
జపనీస్ యెన్/100	59.20	68.66	సౌదీ రియాల్	17.21	20.39
ఆస్ట్రేలియా డాలరు	46.56	53.87	యూఏఈ దిర్హమ్	17.62	20.59
సింగపూర్ డాలరు	47.73	56.53	మలేషియా రింగిట్	15.40	18.94
థాయ్ బాత్/100	204.19	244.13	చైనీస్ యువాన్	7.42	12.04

శుక్రవారం నిఫ్టీ కదలికలు



ఈ ఏడాదిలో 14,000 పాయింట్లకు నిఫ్టీ!

• బ్యాంకులు, యంత్ర పరికరాల రంగాలు ఆకర్షణీయం • కార్వీ స్టాక్‌బ్రోకింగ్ అంచనా

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాదిలో (డిసెంబరులోపు) ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా) సూచీ అయిన నిఫ్టీ 14,000 పాయింట్లకు చేరుతుందని ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సేవల సంస్థ కార్వీ స్టాక్‌బ్రోకింగ్ అంచనా వేస్తోంది. బ్యాంకులు, యంత్రపరికరాల కంపెనీలు మెరుగైన పనితీరు ప్రదర్శిస్తాయని, ఈ రంగాల షేర్లు మదుపరులకు మంచి ప్రతిఫలాన్ని ఇచ్చే అవకాశం ఉందని భావిస్తోంది. 'కార్వీ పెట్టుబడి వ్యూహాల నివేదిక'ను ఆ సంస్థ సీఈఓ రాజీవ్ సింగ్ శుక్రవారం ఇక్కడ విడుదల చేసి, ఈ వివరాలు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు 2019 ఎంతో ఆశావహ ఏడాదిగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ ఇటీవల విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదిక ప్రకారం బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జీ-ఎన్‌పీఏ) గత ఏడాది మార్చిలో ఉన్న 11.5 శాతం నుంచి 2018 సెప్టెంబరు నాటికి 10.8 శాతానికి తగ్గాయి. ఈ ఏడాది మార్చి నాటికి ఇంకా తగ్గి 10.3 శాతానికి పరిమితం కావచ్చని అంచనా. రిటైల్ ద్రవ్యోల్బణం గత నెలలో అత్యంత వేగంగా దిగివచ్చింది. దీనివల్ల రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) వడ్డీరేట్లను సవరించే అవకాశం ఏర్పడింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 2019-20లో మనదేశం 7.4 శాతం వృద్ధి నమోదు చేస్తుందని పేర్కొంది. ప్రైవేటు రంగం నుంచి మూలధన పెట్టుబడులు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి. మూలధన సమీకరణ కూడా ఆకర్షణీయంగా ఉంది. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థకు, స్టాక్‌మార్కెట్‌కు ఎంతో సానుకూలమని, అందువల్ల నిఫ్టీ 14,000 పాయింట్లకు చేరుకోవచ్చని రాజీవ్ సింగ్ అభిప్రాయపడ్డారు.



రాజీవ్ సింగ్

ఇటీవల 5 రాష్ట్రాల ఎన్నికలు జరగటంతో పాటు మరో మూడు నెలల వ్యవధిలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్‌లో ఊగిసలాట ధోరణి కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వేళ ప్రభుత్వం గ్రామీణ, వ్యవసాయ రంగాలపై అధికంగా దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉందని, ఉపాధి కల్పనకు కూడా ప్రాధాన్యం ఇవ్వవచ్చని అన్నారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రజాకర్షక అంశాలకు పెద్దపీట వేస్తారని భావిస్తున్నట్లు చెప్పారు.

'గత కేలండర్ ఏడాదిలో నిఫ్టీ 3 శాతం ప్రతిఫలాన్ని మాత్రమే ఇచ్చింది. ఈ ఏడాది నిఫ్టీ అధిక రాబడులు ఇస్తుందని రాజీవ్ సింగ్ అంచనా వేశారు. నిఫ్టీకి 11750 వద్ద నిరోధం కనిపిస్తోంది, అదే విధంగా 12000 పాయింట్ల వద్ద బాగా ఒడుదొడుకులు ఎదురుకావచ్చు, దాన్ని అధిగమిస్తే సరికొత్త రికార్డు చూస్తాం' అన్నారాయన. వాహన రంగం సమీప భవిష్యత్తులో ప్రతికూల వృద్ధి చవిచూసే అవకాశం ఉందని విశ్లేషించారు.

తెలంగాణ, ఏపీల్లో 10–15 కొత్త శాఖలు

ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నుంచి ఏడాదిన్నర క్రితం లైసెన్స్ పొందిన ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ దేశవ్యాప్తంగా తన శాఖలు, వ్యాపార కార్యకలాపాలను విస్తరించే పనిలో నిమగ్నమైంది. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో నూతన శాఖను శుక్రవారం ప్రారంభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 10-15 శాఖలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈఓ రాజీవ్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం తమకు దేశవ్యాప్తంగా 8 పెద్ద నగరాల్లో శాఖలున్నాయని తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు నాటికి ఈ బ్యాంకు అజమాయిషీలో రూ.2,850 కోట్ల ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. రూ.1,445 కోట్ల మేరకు డిపాజిట్లు ఉన్నాయి. 2021 నాటికి తమ అజమాయిషీలో రూ.10,000 కోట్ల ఆస్తులు (ఏయూఎం) ఉండాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో, దానికి అనుగుణంగా అదనపు మూలధనం అవసరమని, దాన్ని దృష్టిలో పెట్టుకొని వచ్చే 12 నెలల కాలంలో రూ.300 కోట్ల వరకు మూలధనాన్ని సమకూర్చుకునేందుకు సన్నాహాలు చేపట్టామని తెలిపారు.

హ్యుందాయ్ విద్యుత్తు కార్ల ప్లాంటుకు రూ.7,000 కోట్ల పెట్టుబడి!

చెన్నై: విద్యుత్తు కార్ల తయారీ కోసం తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో రూ.7,000 కోట్ల పెట్టుబడితో ప్లాంటు నిర్మాణానికి హ్యుందాయ్ మోటార్స్ సిద్ధమవుతోంది. ఈ ప్రణాళికకు తమిళనాడు మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇప్పటికే అక్కడ హ్యుందాయ్‌కు ఉన్న ప్లాంటు సామర్థ్యాన్ని విస్తరించి, విద్యుత్తు కార్ల తయారీ చేపడతారు. ఇందువల్ల అదనంగా 1500 ఉద్యోగాలు లభిస్తాయి. ఇందుకోసం ప్రోత్సాహకాలు కూడా కంపెనీకి లభించనున్నాయి. వచ్చేవారంలో జరిగే పెట్టుబడిదార్ల సదస్సులో ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

మళ్లీ స్వల్ప లాభాలతో సరి

• 13 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ • 10,900 ఎగువన ముగిసిన నిఫ్టీ

సమీక్ష

సూచీలు మరోసారి స్వల్ప లాభాలతో ముగిశాయి. ఒడుదొడుకుల పయనం మాత్రం కొనసాగింది. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలున్నా, ఇండెక్స్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు ముందుకు కదల్లేకపోయాయి. దీంతో సెన్సెక్స్ 13 పాయింట్లు, నిఫ్టీ 2 పాయింట్ల మేర లాభపడ్డాయి. ఈ వారం మొత్తం మీద చూస్తే సెన్సెక్స్ 379 పాయింట్లు, నిఫ్టీ 112 పాయింట్ల మేర పెరిగాయి. అంతర్జాతీయంగా చూస్తే ఆసియా, ఐరోపా మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు నష్టపోయి 71.19 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 36,417.58 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తర్వాత తీవ్ర ఒడుదొడుకుల మధ్య 36,218.33 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివర్లో వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 36,469.98 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 12.53 పాయింట్ల స్వల్ప లాభంతో 36,386.61 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 1.75 పాయింట్ల లాభంతో 10,906.95 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,928.20-10,852.20 పాయింట్ల మధ్య కదలాడింది.

దూసుకెళ్లిన ఆర్ఐఎల్ షేరు

ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేరు శుక్రవారం 4.34 శాతం లాభపడింది. ఒక దశలో బీఎస్ఈలో రూ.1,189.25 గరిష్ఠాన్ని నమోదు చేసిన ఆర్ఐఎల్ షేరు చివరకు 4.34 శాతం లాభంతో రూ.1,182.95 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.31,208.91 కోట్లు పెరిగి, రూ.7,49,829.58 కోట్లకు చేరింది. దేశంలోనే అత్యధిక మార్కెట్ విలువ కలిగిన సంస్థగా మరోసారి అగ్ర స్థానంలో నిలిచింది.



సెన్సెక్స్ 30 షేర్లలో ఆర్ఐఎల్ తరవాత కోటక్ బ్యాంక్ 1.41%, హెచ్‌సీఎల్ టెక్ 1.02%, ఏషియన్ పెయింట్స్ 0.85%, ఓఎన్‌జీసీ 0.79%, వేదాంతా 0.43% చొప్పున లాభపడ్డాయి. సన్ ఫార్మా అత్యధికంగా 8.52 శాతం నష్టపోయింది. భారతీ ఎయిర్‌టెల్ 6.42%, ఎల్అండ్‌టీ 2.07%, యాక్సిస్ బ్యాంక్ 1.77%, యెస్ బ్యాంక్ 1.59%, ఐటీసీ 0.95%, టాటా మోటార్స్ 0.92%, కోల్ ఇండియా 0.88%, ఎస్‌బీఐ 0.72%, ఎన్‌టీపీసీ 0.65%, పవర్‌గ్రిడ్ 0.51% మేర నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే ఇంధన, చమురు-గ్యాస్, ఐటీ పెరిగాయి. మిగతా రంగాలన్నీ నష్టపోయాయి. బీఎస్ఈలో 867 షేర్లు లాభపడగా, 1678 షేర్లు నష్టపోయాయి. 166 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

ఎల్‌టీఐ లాభంలో 33% వృద్ధి

దిల్లీ: ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ (ఎల్‌టీఐ) సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.375.5 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.282.8 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 32.8 శాతం అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.1,883.80 కోట్ల నుంచి 31.3 శాతం పెరిగి రూ.2,472.90 కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం నికర లాభం 6.2 శాతం తగ్గినా, ఆదాయం 6.1 శాతం పెరిగింది. డాలరు ప్రాతిపదికన చూస్తే ఆదాయం 18.2 శాతం పెరిగి 346.9 మిలియన్ డాలర్లకు చేరింది. 'డాలర్ల పరంగా చూస్తే మరోసారి బలమైన త్రైమాసిక ఫలితాలను నమోదు చేశామ'ని ఎల్‌టీఐ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజయ్ జలోనా వెల్లడించారు. డిసెంబరు 2018 నాటికి సంస్థలో మొత్తం 27,513 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వలసల రేటు 16.5 శాతంగా ఉంది.

బీఎస్ఈలో షేరు 1.49% లాభంతో రూ.1801.45 వద్ద ముగిసింది.

నిరాశపరిచిన ర్యాలీస్ ఇండియా

దిల్లీ: టాటా గ్రూపు సంస్థ ర్యాలీస్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.13.76 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.24.94 కోట్లతో పోలిస్తే ఇది 45 శాతం తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.393.86 కోట్ల నుంచి 7 శాతం పెరిగి రూ.423.25 కోట్లకు చేరింది. 'ఆదాయ పరంగా స్థిరమైన వృద్ధి నమోదు చేశాం. అయితే ముడి వస్తువుల వ్యయాలు బాగా పెరగడం, చైనా నుంచి దిగుమతులు చేసుకోవల్సి రావడంతో మార్జిన్లు తగ్గి లాభదాయకతపై ఆ ప్రభావం పడింద'ని ర్యాలీస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.ముకుందన్ తెలిపారు. ర్యాలీస్ ఇండియాకు అనుబంధ సంస్థగా కొనసాగుతున్న మెటాహెలిక్స్ లైఫ్ సైన్సెస్‌ను విలీనం చేసుకునేందుకు, అలాగే కీలకమైన ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

బీఎస్ఈలో షేరు 5.23% నష్టంతో రూ.163.95 వద్ద ముగిసింది.

మెప్పించిన ఎన్ఐఐటీ టెక్

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎన్ఐఐటీ టెక్నాలజీస్ రూ.100.2 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2017-18 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.75.6 కోట్లతో పోలిస్తే ఇది 32.6 శాతం ఎక్కువ. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, ఇది 10 శాతం తక్కువ కావడం గమనార్హం. ఏడాది క్రితంతో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఏకీకృత ఆదాయం 28.5 శాతం వృద్ధి చెంది రూ.971.7 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం 39.4 శాతం పెరిగి, రూ.180.5 కోట్లకు చేరింది. 'అమెరికా, ఐరోపా మార్కెట్లలో మా ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఇది భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. బేరింగ్ ప్రైవేటు ఈక్విటీ ఆసియా మా సంస్థలో రూ.8,000-10,000 కోట్ల విలువైన వాటా కొనుగోలు చేస్తుందన్న వార్తల్లో నిజం లేదు. అవన్నీ ఊహాజనితమే' అని ఎన్ఐఐటీ టెక్నాలజీస్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ ఠాకూర్ తెలిపారు.

బీఎస్ఈలో షేరు 0.26% లాభంతో రూ.1,227 వద్ద ముగిసింది.

ధనలక్ష్మీ బ్యాంక్ లాభం రూ.17 కోట్లు

దిల్లీ: ప్రైవేటు రంగ ధనలక్ష్మీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.16.90 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో బ్యాంకు రూ.21.74 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.270.11 కోట్ల నుంచి రూ.272.16 కోట్లకు పెరిగింది. మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 6.96 శాతం నుంచి 8.11 శాతానికి చేరాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 4.08 శాతం నుంచి 2.93 శాతానికి తగ్గాయి.

బీఎస్ఈలో షేరు 3.55 శాతం నష్టంతో రూ.17.65 వద్ద ముగిసింది.

మార్కెట్ కబుర్లు

- నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.2,000 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తున్నట్లు **ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్** భావిస్తోంది. ఈ నిధులను వ్యాపార వృద్ధికి ఉపయోగించుకోనుంది.
- హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ తన పేరును **హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌గా** మార్చుకుంది. అందుకు సంబంధించిన అనుమతులను నియంత్రణాధికార సంస్థల నుంచి దక్కించుకోవడం ఇందుకు నేపథ్యం.
- **ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్** ఎండీ, సీఈఓగా వి. వైద్యనాథన్ నియామకానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆమోద ముద్ర వేసింది. డిసెంబరు 19, 2018 నుంచే ఆయన పదవీకాలం అమల్లోకి వచ్చింది. మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. గత నెలలో ఐడీఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్‌లు విలీనమై ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌గా అవతరించిన సంగతి తెలిసిందే.

కుటుంబ వ్యాపారాల్లో సవాళ్లు ఎన్నో

• ఐఎస్‌బీలో ఆసియా సదస్సు 2,3 తేదీల్లో

ఈనాడు, హైదరాబాద్: 'కుటుంబ వ్యాపారాల'పై ఒక ముఖ్యమైన సదస్సుకు హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) వేదిక కానుంది. '7వ ఆసియా కుటుంబ వ్యాపారాల సదస్సు'ను వచ్చే నెల 2-3 తేదీల్లో నిర్వహించడానికి ఐఎస్‌బీ సన్నద్ధం అవుతోంది. ప్రముఖ వ్యాపారవేత్తలు, కుటుంబ వ్యాపారాల తీరుతెన్నులపై పరిశోధనలు చేసిన నిపుణులు, విద్యావేత్తలు ఈ సదస్సుకు హాజరై తమ అనుభవాలను పంచుకుంటారు. తరాలు మారినా కుటుంబ వ్యాపారాలు ప్రగతిపథంలో పయనించాలంటే... ఏం చేయాలి- అనేది ప్రధాన అంశంగా తీసుకొని చర్చిస్తారు. దీన్ని ఎంతో వినూత్నమైన సదస్సుగా ఐఎస్‌బీ వర్గాలు పేర్కొన్నాయి.

భిన్న అంశాలపై చర్చ

ఈ సదస్సుల్లో దాదాపు 30 మందికి పైగా కుటుంబ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారు. అంతేగాక 350 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. ఎన్నో విభిన్నాంశాలు ఈ సందర్భంగా చర్చకు వస్తాయి. కుటుంబ పరిపాలన- సానుకూల వ్యూహాలు, వృత్తి నైపుణ్యం, ప్రపంచ వ్యాప్తంగా కుటుంబ వ్యాపారాల్లో అనుభవాలు, తరాలు మారినప్పుడు ఎదురయ్యే పరిణామాలు, కుటుంబ వ్యాపారాల్లో మహిళల పాత్ర, శాశ్వత ప్రాతిపదికన వ్యాపార సంస్థల నిర్మాణం- తదితర అంశాలపై చర్చిస్తారు.



ప్రొఫెసర్ కవిల్ రామచంద్రన్


సమస్యలను అర్థం చేసుకోవచ్చు: కుటుంబ వ్యాపారాలకు ఎన్నో రకాలైన సవాళ్లు ఎదురవుతాయి. వారసత్వం, నాయకత్వం, వృత్తి నైపుణ్యం, సత్వర వృద్ధి, యాజమాన్యం తీరుతెన్నులు... ఇవన్నీ సమస్యలే. వీటిని పరిష్కరించుకోవటానికి వ్యాపార కుటుంబాలు తమదైన రీతిలో విధివిధానాలను రూపొందించుకోవాలి, తమలో తాము చర్చించుకొని అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకోవాలి- అని ఐఎస్‌బీలోని థామస్ ష్మిడ్‌హేనీ సెంటర్ ఫర్ ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ ప్రొఫెసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన కవిల్ రామచంద్రన్ అభిప్రాయపడ్డారు. వ్యాపార కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లను అర్థం చేసుకోవటానికి, వాటి పరిష్కారానికి అనువైన వ్యూహాలను సిద్ధం చేసుకోవటానికి ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

సదస్సులో మాట్లాడే ప్రముఖులు

దీపక్ పరేఖ్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్
గీతా పిరమల్, ట్రైమోడ్ ప్రాపర్టీస్
అజిత్ కుమార్ రాయ్, సుప్రజిత్ గ్రూప్
అరవింద్ శ్రీనివాసన్, అరవింద్ ఐకేర్ సిస్టమ్
గోపాల్ శ్రీనివాసన్, టీవీఎస్ కేపిటల్ ఫండ్స్
హరీష్ లక్ష్మణ్, రానే గ్రూప్
బీవీఆర్ మోహన్‌రెడ్డి, సైయెంట్ లిమిటెడ్
ఎంఎం మురుగప్పన్, మురుగప్పా గ్రూప్
సునీతా రెడ్డి, అపోలో హాస్పిటల్స్
లావణ్య నల్లి, నల్లి గ్రూప్

18న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	410	వరంగల్	412
చిల్లరగా(ఒక గుడ్డు)	4.70	విశాఖపట్నం	425
బెంగళూరు	445	చెన్నై	450
19వ తేదీకి...		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	425	నమక్కల్	435

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 399.30 (394.50) 3617922
ASIAN PAINTS 1400.45 (1389.60) 1092189
AXIS BANK LT 664.60 (676.65) 7037386
BAJAJ AUTO L 2720.75 (2729.65) 269686
BAJAJ FINANC 2542.90 (2535.90) 753775
BAJAJ FINSER 6249.90 (6359.00) 191626
BHARTI AIRTE 311.15 (332.05) 14744448
BHARTI INFRA 278.05 (280.45) 3096388
BPCL 354.20 (355.20) 2504157
CIPLA 509.40 (509.60) 1502360
COAL INDIA L 230.00 (232.05) 2944908
DR. REDDYS 2596.80 (2619.15) 536273
EICHER MOTOR 20122.75 (20369.95) 108140
GAIL 322.15 (332.40) 4459122
GRASIM IND 824.95 (828.10) 959572
HCL TECH 966.30 (954.70) 2342528
HDFC 2006.85 (2004.55) 1942136
HDFC BANK 2130.25 (2132.30) 1301994
HERO MOTOCOR 2898.75 (2903.60) 389524
HINDALCO IND 208.80 (206.00) 6258424
HINDUSTAN UN 1744.10 (1751.50) 3234056
HPCL 239.50 (244.20) 2690204
ICICI BANK 372.00 (374.60) 12212121
INDIABULLS H 817.35 (816.75) 3202545
INDIAN OIL 137.85 (137.65) 7023754
INDUSINDBANK 1516.90 (1523.00) 1589082
INFOSYS LTD 730.95 (733.35) 5902151
ITC 291.45 (293.95) 10994807
JSW STEEL LT 285.60 (289.00) 4210472
KOTAK MAHIND 1240.20 (1219.95) 2598572
LARSEN & TOU 1317.90 (1346.05) 2135781
M&M 734.95 (734.65) 1601885
MARUTI SUZIK 7357.95 (7336.25) 334555
NTPC LTD 144.30 (144.90) 2583594
ONGC 146.75 (145.00) 4904282
POWER GRID C 193.60 (193.90) 2456405
RELIANCE IND 1184.35 (1134.45) 25684142
SBI 294.95 (297.40) 9082501
SUN PHARMA 390.75 (426.55) 82906214
TATA CONSULT 1900.65 (1894.30) 1683728
TATA MOTORS 183.30 (184.90) 6797621
TATA STEEL L 470.65 (473.15) 4914849
TECH MAHINDR 709.15 (705.55) 1888004
TITAN IND 960.95 (961.55) 1168989
ULTRATECH 3819.95 (3846.45) 237908
UPL LIMITED 766.05 (769.05) 919475
VEDANTA LIMI 198.70 (197.45) 8307081
WIPRO 346.15 (335.40) 10091966
YES BANK LTD 198.60 (201.50) 41858021
ZEE ENTERTAI 440.30 (440.90) 4546785

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1276.10 (1286.70) 32134
ACC 1439.75 (1455.15) 335850
ADITYA BIRLA 93.70 (95.45) 977308
AMBUJA CEMEN 212.65 (215.25) 787152
ASHOK LEYLAN 92.30 (93.25) 10880766
AUROBIND PHA 770.05 (775.00) 2473473
AVENUE SUPER 1383.05 (1368.00) 580661
BANDHAN BANK 440.15 (449.75) 518541
BANK OFBAROD 118.00 (119.20) 6772442
BEL 86.35 (87.20) 3889202
BHEL 70.95 (70.15) 17158253
BIOCON LTD 652.05 (657.65) 3525582
BOSCH LTD 19210.45 (19150.55) 7530
BRITANNIA 3171.35 (3207.10) 161433
CADILA HEALT 347.05 (355.85) 1220994
COLGATE PALM 1310.80 (1326.60) 204682
CONTAINER 683.85 (694.40) 505951
DABUR INDIA 424.10 (420.30) 2301927
DLF LIMITED 180.35 (184.20) 4243642
GENERAL INS 254.80 (258.00) 46902
GODREJ CONSU 789.65 (793.30) 348112
HAVELLS INDI 677.50 (676.15) 1299538
HDFC STAND L 383.70 (390.85) 435544
HINDUSTAN ZI 272.40 (271.75) 389477
ICICI LOMBAR 861.40 (875.90) 279353
IDEA CELLULR 35.20 (36.95) 28861742
INTERGLOBE A 1076.00 (1112.90) 910406
L&TFIN.HOLD 140.65 (141.30) 5024148
LIC HOUS.FIN 476.05 (490.70) 1353649
LUPIN 862.30 (868.75) 1824696
MARICO LIMIT 379.35 (380.20) 1112430
MCDOWELL 584.30 (594.95) 844196
MOTHERSON 157.55 (159.60) 4071763
MRF 65739.80 (65802.80) 1613
NHPC LTD 25.15 (25.55) 1081187
NMDC LTD 90.70 (91.85) 3938111
OIL INDIA 172.40 (172.75) 552777
ORACLE FIN S 3615.85 (3694.40) 20052
P&G HYG&HEAL 9962.00 (9996.95) 1619
PETRONET LNG 218.55 (221.95) 3744509
PIDILITE IND 1148.80 (1151.55) 289024
PIRAMAL ENTE 2296.20 (2387.90) 427320
SAIL 49.70 (49.90) 9014258
SBI LIFE INS 620.20 (623.35) 107504
SHREE CEMENT 15590.25 (15914.70) 16832
SHRIRAM TRAN 1135.80 (1149.50) 1077840
SIEMENS 1054.75 (1064.80) 117785
SUN TV LTD 525.20 (564.95) 6658747
THE NEW INDI 180.00 (182.50) 4339

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 5.71 (6.01) 384
AISHWARYA TE 3.01 (3.15) 350
ALPHAGEO 474.35 (476.95) 97
AMAR RAJA BA 779 (781.10) 9385
ANDHRA BANK 28.55 (28.80) 29875
ANDHRA CEMEN 5.74 (5.73) 3650
ANDHRA PAPER 446.10 (449.40) 2097
ANDHRA PETRO 66.60 (68) 53727
ANDHRA SUGAR 326 (327.15) 4964
ANJANI PORTL 130.45 (130.10) 428
ASTRA MICROW 81.85 (83.55) 13126
AUROBINDO PH 770.55 (774.30) 88946
AVANTEL SOFT 228.60 (228.30) 558
AVANTI FEEDS 375.15 (378.65) 13529
BALAJI AMIN 479.95 (482.25) 1562
BARTRONICS 7.18 (7.17) 3562
BHAGIRA CHEM 444.35 (432.70) 12680
BHAGYA NAG 35.50 (36.50) 975
BN RATHI SEC 26.25 (25.80) 2636
BRILLIANT SE 1.12 (1.12) 93227
CAMBRIDGE TE 45.95 (46.40) 199
CIL SECURI 15.20 (15.80) 2995
CONT COFFEE 274.55 (266.95) 1487
COROMAN FERT 449.05 (454.35) 1073
CYBERMATE 2.08 (2.09) 42390
CYIENT LIMIT 614.85 (627.55) 130947
DECCAN CEMEN 396.25 (400.45) 12
DIVI'S LAB 1508.85 (1504.25) 19416
DIVYA GRANIT 103.80 (98.90) 5984
DR REDDY 2598.95 (2616.80) 9698
FOUR SOFT 40.70 (37) 1470
GATI CORPN 78.55 (80.80) 47397
GAYATRI PROJ 176.70 (180.95) 1488
GMR INFRASTR 16.25 (16.35) 891055
GOLDST INFRA 238 (242.05) 19568
GOLDSTONE EN 15.35 (15.55) 15213
GRANULES (I) 87.85 (90.05) 48844
GSS AMERICA 128.05 (130.40) 18144
GVK POWER 7.33 (7.49) 241056
HBL NIFE POW 28.25 (28.75) 28949
HERITAGE FOO 534.60 (531.10) 1560
HIL LTD 1976.80 (2002.20) 556
IDL INDUSTRS 273.40 (269.45) 321
ILFS ENGINEE 14 (14.70) 7031
IVRCL INFRAS 1 (1) 33526
JEEVAN SCIEN 35.50 (38.75) 116
KAKATIYA CEM 193.30 (195.50) 1429
KALLAM SPG 18.10 (18.20) 4725
KAVERI SEED 561.20 (570.40) 13018
KCP LTD 88.60 (89.45) 1299
KERNEX MICRO 27 (26.70) 3871
KNR CONSTRUC 213.65 (210.70) 3581
LANCO INDUS 184.10 (188.25) 1521
LAURUS LABS 375.30 (377.50) 766
LOKESH MACH 44.30 (45.40) 6673
MADHUCON PRO 6.83 (7.05) 7682
MEGA SOFT 7.20 (7.21) 2255
MIC ELECTRON 0.96 (0.92) 75071
MOLD-TEK.TEC 46.15 (48.20) 1299
MOLDTK PLA 260.45 (262.75) 1220
MSR INDIA LT 10.50 (11.05) 7906
NAGARJAGRICH 27.25 (27.55) 6012
NATCO PHARMA 685.05 (692.65) 4320
NAVA BH VENT 111.05 (111.30) 3099
NCC 87.85 (89.55) 543854
NCL IND 128.20 (129.55) 682
NEHA INTER 4 (3.98) 5656
NETTLINX 50.60 (49.70) 18952
NEULAND LAB 514.45 (501.75) 1003
NIHAR INFO 13.90 (13.50) 241
NILE 358.20 (368.15) 1265
NORTHGATE TE 0.70 (0.73) 23699
OIL COUNTRY 14.80 (15.30) 2179
PANYAM CEMEN 12.99 (13.68) 5657
PENNER IND 38.20 (37.65) 18545
PHYTOCHEM I 43 (44.80) 4150
PIONEER DIST 165.80 (164.15) 462
PITTI LAMIN 65.70 (66.65) 7788
POKARNA 186.30 (188.80) 7613
PRAJAY ENGS 8.45 (8.84) 1000
PREMIER EXPL 232.35 (236.60) 283
PRISM CEMENT 83.90 (84.60) 7615
PRUDENTL PHA 3.57 (3.63) 47240
RAASI REFRAC 14.98 (14.37) 500
RAIN INDUSTR 119.85 (121.85) 90161
RAJ PACKAGIN 28.85 (27) 1932
RAJVIR INDUS 18.70 (19.65) 125
RAM INFORMAT 42.65 (42.35) 7261
SAGAR CEM 654.10 (648.90) 21
SAMKRG PIST 189.30 (191.70) 1197
SATVAH. ISPA 9.42 (9.20) 6500
SMS PHARMA 75.55 (79) 17814
SREE RAYAL A 35.85 (36.35) 106556
SRINIVASA SH 40.55 (40) 215
STARCHIK SP 26.20 (26) 2135
STEEL EXCHAN 12.70 (13.15) 3293
SUJANA METAL 0.39 (0.41) 1902
SUJANA TOWER 1.26 (1.32) 2570
SURYALATA SP 127.50 (127.50) 561
SUVEN PHARMA 217.60 (218.70) 24080
TAJ GVK HOTE 176.60 (179.45) 1774
TANLA 30.65 (30.15) 32529
TERA SOFTWAR 46.70 (47.40) 5738
TRANS BIOTEK 5.42 (5.17) 132885
TRENDY KNIT 0.24 (0.24) 75104
VBC FERRO 38.85 (39.15) 501
VICEROY HOTE 4.43 (4.45) 12083
VIJAY TEXTIL 41.50 (42.50) 482
VIMTA LABS 280.90 (285.15) 4097
VISAKA IND 429.15 (429.15) 292
VISTA PHARMA 28.35 (28.40) 2929
VIVIMED LABS 33.15 (33.10) 12783
VJIL CONSULT 41.90 (40.50) 1834
VST INDUS 3224.90 (3221.95) 568
YBRANT DIGIT 3.06 (2.91) 99674
ZENOTECH LAB 30.85 (31.95) 15284
ZENTECH 79 (80.95) 3120

ఇ-కామర్స్‌లోకి ముకేశ్

ఈనాడు బిజినెస్

● అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో పోటీకి సై ● ముందుగా గుజరాత్‌లో

గాంధీనగర్

చమురు, టెలికాం రంగాల్లో ప్రభంజనం సృష్టించిన ముకేశ్ అంబానీ చూపు ఇ-కామర్స్ రంగంపై పడింది. త్వరలోనే జియో, రిలయన్స్ రిటైల్ కలిసి సరికొత్త ఇ-కామర్స్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తాయని శుక్రవారమిక్కడ జరిగిన ఉజ్వల గుజరాత్ సదస్సులో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ప్రకటించారు.

జియో, రిటైల్ కలిసి..

ముందుగా గుజరాత్‌లోని 12 లక్షల మంది రిటైలర్లు, స్టోర్ యజమానుల కోసం ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను తీసుకు రానున్నట్లు ఆయన వివరించారు. తమ జియో స్టోర్లు, రిటైల్ నెట్‌వర్క్‌ను ఇందుకు ఉపయోగించుకుంటామని తెలిపారు. దేశీయ ఆన్‌లైన్ విపణిలో అమెరికా దిగ్గజం అమెజాన్ అనుబంధ అమెజాన్ ఇండియా, మరో దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్ ఆధీనంలోని ఫ్లిప్‌కార్ట్‌కు దీటుగా దేశీయంగా మరో అగ్రశ్రేణి సంస్థ ప్రవేశించినట్లవుతుంది. ప్రస్తుతం జియోకు 28 కోట్ల మంది వినియోగదార్లుండగా.. రిలయన్స్ రిటైల్ సంస్థకు దేశంలోని 6,500 నగరాలు, పట్టణాల్లో దాదాపు 10,000 విక్రయశాలలున్నాయి. జియో ఆప్‌లు, మొబైల్ ఫోన్ల ద్వారా విక్రయదార్లను అనుసంధానం చేస్తామని రిలయన్స్ రిటైల్ ఉన్నతాధికారి వి. సుబ్రమణియన్ ఫలితాల సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

జులైలోనే ప్రకటన కానీ..

గత నెలలో వెలువడిన కొత్త నిబంధనలు కూడా రిలయన్స్‌కు ఉపయోగకరంగా మారనున్నాయి. తాజా నిబంధనల ప్రకారం.. విదేశీ పెట్టుబడులు ఉన్న ఇ-కామర్స్ కంపెనీలు.. తమ వాటాదారులకు చెందిన కంపెనీల ఉత్పత్తులను విక్రయించడానికి వీలుండదు. దీని వల్ల అమెజాన్, వాల్‌మార్ట్(ఫ్లిప్‌కార్ట్ కొనుగోలుదారు)ల కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో రిలయన్స్ వంటి స్థానిక కంపెనీకి ప్రయోజనాలు లభిస్తాయని తెలుస్తోంది. కాగా, ఇ-కామర్స్ రంగంలోకి వచ్చే విషయాలను అంబానీ గత జులైలోనే ప్రకటించినప్పటికీ.. ముందడుగు వేసే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



శుక్రవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన ఉజ్వల గుజరాత్ సదస్సులో టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో కరచాలనం చేస్తున్న ఆర్ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ

రూ.లక్షల కోట్ల పెట్టుబడుల హామీలు

- ఉజ్వల గుజరాత్ సదస్సులో ఆర్ఐఎల్ సహా ప్రధాన సంస్థల ప్రకటన
- వచ్చే 10 ఏళ్లలో రూ.3 లక్షల కోట్లు: రిలయన్స్

గాంధీనగర్: వచ్చే పదేళ్లలో గుజరాత్‌లో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ కట్టుబడి ఉందని భారత అపర కుబేరుడు ముకేశ్ అంబానీ వెల్లడించారు. విద్యుత్, పెట్రో రసాయనాలు, కొత్త తరం సాంకేతికత, డిజిటల్ వ్యాపారాల్లో ఈ పెట్టుబడులు ఉండొచ్చని ఆయన తెలిపారు. 'రిలయన్స్‌కు గుజరాత్ జన్మభూమి, కర్మభూమి. తొలి ప్రాధాన్యం ఎపుడూ ఈ రాష్ట్రానికేనని శుక్రవారమిక్కడ జరిగిన తొమ్మిదో 'ఉజ్వల గుజరాత్ అంతర్జాతీయ సదస్సు' సందర్భంగా అన్నారు. ఇప్పటి దాకా గుజరాత్‌లో రూ.3 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టినట్లు గుర్తు చేశారు. పండిట్ దీనదయాళ్ యూనివర్సిటీపై రిలయన్స్ ఫౌండేషన్ మరో రూ.150 కోట్ల పెట్టుబడులు పెడుతుందని ఆయన హామీనిచ్చారు.

అదానీ.. రూ.55,000 కోట్లు: వచ్చే అయిదేళ్లలో గుజరాత్‌లో రూ.55,000 కోట్ల పెట్టుబడులు పెడతామని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఈ సదస్సులో ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సౌర హైబ్రిడ్ పార్క్‌ను ఖవ్డాలో రూ.30,000 కోట్ల తో ఏర్పాటు చేస్తామని వివరించారు. గత అయిదేళ్లలో రూ.50,000 కోట్లు పెట్టామని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌పై విశ్వాసాన్ని ప్రోది చేశారని ప్రధాని మోదీని అదానీ ప్రశంసలతో ముంచెత్తారు.

- రష్యాకు చెందిన చమురు దిగ్గజం రోస్నెఫ్ట్ ఆధ్వర్యంలోని నయరా ఎనర్జీ(అంతక్రితం ఎస్సార్ ఆయిల్) గుజరాత్‌లో 850 మి. డాలర్ల (రూ.6,000 కోట్లకు పైగా) పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. తద్వారా పెట్రోరసాయనాల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు తెలిపింది.
- గుజరాత్‌లో పునరుత్పాదక విద్యుత్, ఇంధనం, గ్యాస్ పంపిణీ వ్యాపారాలపై రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు టొరెంట్ గ్రూప్ ఛైర్మన్ సుధీర్ మెహతా ప్రకటించారు. ఇప్పటిదాకా విద్యుత్, ఫార్మా రంగాల్లో ఈ గ్రూప్ ఈ రాష్ట్రంలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టింది.
- ఆదిత్య బిర్లా గ్రూపు వచ్చే మూడేళ్లలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. కొత్త యూనిట్ల ఏర్పాటుతో పాటు సామర్థ్య విస్తరణకు వీటిని ఉపయోగించనున్నట్లు గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు.
- 2020 కల్లా గుజరాత్‌లో మూడో ప్లాంటు చేస్తామని సుజుకీ తెలిపింది. టయోటాతో సాంకేతిక మద్దతు అందుకుని భారత్‌లో కొత్త హైబ్రిడ్ వాహనాలను తీసుకువస్తామని ఈ సందర్భంగా కంపెనీ వివరించింది.
- గుజరాత్‌లో విద్యుత్ వాహనాల తయారీతో పాటు లిథియం అయాన్ బ్యాటరీ తయారీపైనా పెట్టుబడులు పెట్టే యోచన ఉన్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. టాటా కెమికల్స్ కూడా తన సోడా యాష్ వార్షిక సామర్థ్యాన్ని ఒక మిలియన్ టన్నులకు పెంచుకోవాలని భావిస్తోందని ఆయన అన్నారు.



బీఎండబ్ల్యూ నుంచి రెండు కొత్త బైకులు

ధరల శ్రేణి
రూ.16.85-21.95 లక్షలు

దిల్లీ: బీఎండబ్ల్యూ నుంచి మరో రెండు కొత్త బైకులు దేశీయ విపణిలోకి విడుదల య్యాయి. బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్, బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్ అడ్వెంచర్ బైకు మోడళ్లను శుక్రవారం భారత విపణిలోకి కంపెనీ విడుదల చేసింది. వీటి ధరలను రూ.16.85-21.95 లక్షల (ఎక్స్‌షోరూమ్, దిల్లీ) మధ్య నిర్ణయించింది. ఈ రెండు జీఎస్ మోడళ్లను శుక్రవారం నుంచి అన్ని బీఎండబ్ల్యూ మోటార్డ్ విక్రయ కేంద్రాల నుంచి బుక్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది.

జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డులు


సౌమ్య స్వామినాథన్


డాన్ క్లీవ్‌ల్యాండ్

ఈనాడు, హైదరాబాద్: కేన్సర్ వ్యాధిపై విశేష పరిశోధనలు చేసిన డాక్టర్ డాన్ క్లీవ్‌ల్యాండ్, ప్రజారోగ్య విభాగంలో సేవలు అందించిన డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌లను జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. బయో ఏషియా- 2019 సదస్సు పురస్కరించుకుని ఈ అవార్డులను బయోఏషియా నిర్వాహకులు ప్రకటించారు. బయోఏషియా- 2019 సదస్సు వచ్చే నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సదస్సులో అవార్డులు అందజేస్తారు.

యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ క్లీవ్‌ల్యాండ్ 'అస్కార్ ఆఫ్ సైన్స్' గా పేరున్న బ్రేక్‌త్రూ ప్రైజ్ (జీవ శాస్త్రాల విభాగం)ను గత ఏడాదిలో గెలుచుకున్నారు. ఆయన లుడ్‌విగ్ కేన్సర్ రీసెర్చ్- శాండియాగో శాఖలో సెల్ బయాలజీ ల్యాబ్ అధిపతిగా వ్యవహరిస్తున్నారు. నరాల వ్యాధుల విభాగంలో కూడా ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. డాక్టర్ సౌమ్య స్వామినాథన్ చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ట్యూబెర్క్యులోసిస్ డైరెక్టర్‌గా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ప్రోగ్రామ్స్) హోదాలో ఉన్నారు. ఎన్నో పరిశోధనా పత్రాలు రాశారు. మరెన్నో అవార్డులు అందుకున్నారు. జీవ శాస్త్రాల విభాగంలో ఎంతగానో కృషి చేసిన శాస్త్రవేత్తలు ఈసారి జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యారని తెలంగాణా పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పేర్కొన్నారు. ఈ శాస్త్రవేత్తలు బయోఏషియా సదస్సులో పాల్గొని తమ పరిశోధన అనుభవాలు వివరిస్తారని బయోఏషియా సీఈఓ శక్తి నాగప్పన్ తెలిపారు.

సన్ ఫార్మా షేరుకు సెగ

- 8.5 శాతం నష్టపోయి, ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి
- మార్కెట్ విలువలో రూ.8736 కోట్ల కోత
- ప్రమోటర్ల అక్రమాలపై సెబీకి మరో ఫిర్యాదు అందినట్లు వార్తలు రావడం వల్లే
- దుష్ప్రచారం చేస్తున్నారంటూ సెబీకి కంపెనీ లేఖ
- వార్తా కథనంలోని విషయాలతో సంబంధం లేదని ఎక్స్ఛేంజీలకు స్పష్టత

దిల్లీ

సన్ ఫార్మా మదుపర్లకు మరో అశుభదినం. శుక్రవారం కూడా ఈ దిగ్గజ ఔషధ కంపెనీ షేరు భారీగా నష్టపోయింది. గురువారం 5.77 శాతం క్షీణించగా.. శుక్రవారం మరో 8.5% పతనమైంది. కంపెనీ ప్రమోటర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సెబీకి తాజాగా ఓ ప్రజావేగు ఫిర్యాదు చేశారని వార్తలు రావడం ఇందుకు నేపథ్యం. ఉదయం బీఎస్ఈలో షేరు 12.11 శాతం నష్టంతో రూ.375.40 వద్ద షేరు ప్రారంభమయ్యింది. ఎన్ఎస్ఈలోనూ 13.21 శాతం పతనమై రూ.370.20 వద్ద మొదలైంది. ఆ తర్వాత కాస్త కోలుకున్నప్పటికీ చివరకు 8.52 శాతం నష్టంతో రూ.390.75 వద్ద ముగిసింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. షేరు పతనం ప్రభావంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.8,735.71 కోట్లు హరించుకుపోయి రూ.93,751.44 కోట్లకు పరిమితమైంది. శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో భారీగా నష్టపోయిన దిగ్గజ కంపెనీ షేరు ఇదే కావడం గమనార్హం.

ఇదీ నేపథ్యం

ఆదిత్యా మెడి సేల్స్, సన్ ఫార్మా ప్రమోటర్ల మధ్య భారీ లావాదేవీలు చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తూ ఓ ప్రజావేగు (విజిల్ బ్లోయర్) సెబీకి 172 పేజీల ఫిర్యాదు సమర్పించారని, 2014 -17 మధ్య జరిగిన ఈ లావాదేవీల విలువ రూ.5,800 కోట్లని ఫైనాన్షియల్ న్యూస్ వెబ్‌సైట్ 'మనీలైఫ్' తన వార్తా కథనంలో వెల్లడించింది. సన్ ఫార్మా సహ ప్రమోటరు సుధీర్ వాలియా నేతృత్వంలోని సురక్షా రియాల్టీ ఈ లావాదేవీలు నిర్వహించిందని పేర్కొంది. అయితే సన్‌ఫార్మాపై సెబీకి ఇలాంటి ఫిర్యాదు అందిందనే ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. సన్‌ఫార్మా ప్రమోటర్లు, మరికొందరు అతిక్రమణలకు పాల్పడుతున్నారంటూ 2018 నవంబరులో ఓ ఫిర్యాదు వచ్చిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనిని ధ్రువీకరించడమే కాకుండా ఈ ఫిర్యాదులోని విషయాలను పరిశీలిస్తున్నట్లు అప్పుడు సెబీ వెల్లడించింది. ఇప్పుడు మరోమారు ఆ తరహాలోనే ఫిర్యాదు వచ్చిందనే వార్తలతో షేరు భారీగా నష్టపోయింది.

కంపెనీ ఏమంటోంది?

మనీలైఫ్‌లో వచ్చిన వార్తా కథనం విషయాలతో తమకు సంబంధం లేనివని సన్‌ఫార్మా ఎక్స్ఛేంజీలకు స్పష్టం చేసింది. అందువల్ల వాటిపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయాలని అనుకోవడం లేదని పేర్కొంది. కొందరు వ్యక్తులు, సంస్థలు తమ వాటాదార్ల ప్రయోజనాలను దెబ్బ తీసేలా అనైతిక వ్యాపార పద్ధతులను అనుసరిస్తున్నట్లు ఆరోపిస్తూ, సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగికి సన్‌ఫార్మా ఓ లేఖ రాసింది. ఇందువల్ల వాటాదార్ల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, షేరు విలువ స్వల్పకాలంలోనే పతనమైందని పేర్కొంది. కొన్ని ప్రసార మాధ్యమ సంస్థలు ఈ తరహా ఆరోపణలు/ ఫిర్యాదుల ప్రచారానికి తెరలేపుతున్నాయని తెలిపింది. వీటి కారకులపై విచారణ చేయాలని కోరింది. ప్రజావేగు (విజిల్ బ్లోయర్) సమర్పించిన పత్రాలు, ఇతరత్రా రహస్య ఇ-మెయిళ్లను తనిఖీల నిమిత్తం సంస్థాగత మదుపర్లకు కొన్ని మీడియా సంస్థలు అందజేశాయని తెలిపింది. ప్రజావేగు పత్రాల్లోని సమాచారం కొందరు వాటాదార్లకు మాత్రం చేరవేస్తుండటంతో, చిన్న మదుపర్లు సహా మిగతా మదుపర్లు నష్టపోవాల్సి వస్తోందని తెలిపింది. ప్రజావేగు సమర్పించిన 172 పేజీల ఫిర్యాదు తమకు ఇంతవరకు అందలేదని, అందులోని అంశాలు తమకు తెలియదని, అందువల్ల వార్త కథనంలో లేవనెత్తిన అంశాలపై ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్య చేయబోమని తెలిపింది. ఈ లేఖ నకలును స్టాక్ ఎక్స్ఛేంజీలకు కూడా సన్‌ఫార్మా అందజేసింది.

కాగా.. సన్‌ఫార్మాపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసు విచారణను తిరిగి ప్రారంభించే అవకాశం ఉందని కొన్ని వర్గాలు గతేడాది నవంబరులో పీటీఐకి చెప్పాయి. విదేశాల్లో నిధుల సమీకరణ విషయంలో కంపెనీ ప్రమోటర్లు కొందరు అక్రమాలకు పాల్పడటంపై కూడా విచారణను పునఃప్రారంభించే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. 2017 ఆగస్టులో సన్‌ఫార్మా, దిలీప్ సంఘ్వీతో పాటు తొమ్మిది ఇతర సంస్థలు రూ.18 లక్షలు చెల్లించి ఇన్‌సైడర్ ట్రేడింగ్ దర్యాప్తును నిలుపుదల చేయించుకున్నట్లు వార్తలు కూడా వచ్చాయి.





అమెజాన్‌కు 'మోర్'!

- ఆదిత్య బిర్లా రిటైల్‌కు బిడ్ వేసేందుకు విట్జిగ్ అడ్వైజరీకి సీసీఐ అనుమతి
- విట్జిగ్‌లో 49 శాతం వాటా అమెజాన్ అనుబంధ సంస్థకు

దిల్లీ: మోర్ బ్రాండ్‌పై విక్రయశాలలను నిర్వహిస్తున్న ఆదిత్య బిర్లా రిటైల్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసే నిమిత్తం బిడ్ దాఖలు చేసేందుకు అమెజాన్, విట్జిగ్ అడ్వయిజరీ సర్వీసెస్‌లకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతినిచ్చింది. సీసీఐ అనుమతినిచ్చిన దాని ప్రకారం.. ఆదిత్య బిర్లా రిటైల్‌లో 99.9 శాతం ఈక్విటీని విట్జిగ్ కొనుగోలు చేస్తుంది. ఆ తర్వాత విట్జిగ్‌లో 49 శాతం వాటాను అమెజాన్ అనుబంధ సంస్థ అమెజాన్ ఎన్‌వి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ తీసుకోనుంది. భారత్‌లో ఆఫ్‌లైన్ రిటైల్ విభాగంలో అమెజాన్ పెడుతున్న రెండో పెట్టుబడి ఇది. కె రహేజా గ్రూపునకు చెందిన షాపర్ స్టాప్‌లో కూడా అమెజాన్ కొంత వాటా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. 'మోర్' సూపర్ మార్కెట్లను ఆదిత్య బిర్లా రిటైల్ నిర్వహిస్తోంది. మరోవైపు విట్జిగ్.. సమరా ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థ. ఆల్టర్‌నేటివ్ ఫండ్ కేటగిరి 2లో ఇది సెబీ వద్ద నమోదైంది కూడా. ఆదిత్య బిర్లా రిటైల్ లిమిటెడ్‌లో 99.99 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు విట్జిగ్ అడ్వయిజరీ సర్వీసెస్‌కు అనుమతి నిచ్చినట్లు సీసీఐ ట్వీట్ చేసింది. అలాగే విట్జిగ్‌లో 49% వాటా కొనుగోలుకు అమెజాన్ ఎన్‌వి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్‌కు కూడా అనుమతినిచ్చామని మరో ట్వీట్ చేసింది. విట్జిగ్‌లో 49 శాతం వాటా కొనుగోలు అనంతరం మిగిలిన 51 శాతం వాటా సమరా ఫండ్ నియంత్రణలో ఉండాలని ఓ నోటీసును జారీ చేసింది. ఆదిత్య బిర్లా రిటైల్‌ను కొనుగోలు చేయనున్నట్లు గతేడాది విట్జిగ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఈ లావాదేవీ విలువను రూ.4,200 కోట్లుగా లెక్కగట్టారు. 2018 సెప్టెంబరులో అమెజాన్, సమరా కేపిటల్‌లు సంయుక్తంగా విట్జిగ్ అడ్వయిజరీలో పెట్టుబడులు పెట్టాయి.

విప్రో బోనస్

- మూడు షేర్లకు ఒకటి చొప్పున
- మధ్యంతర డివిడెండు 50%
- లాభంలో 32% వృద్ధి
- రూ.15,059.5 కోట్లకు ఆదాయం

దిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం విప్రో రాణించింది. కంపెనీ నికర లాభం రూ.2544.5 కోట్లకు చేరుకుంది. 2017-18 ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.1930.1 కోట్ల కంటే ఇది 31.8 శాతం అధికం. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.15,059.5 కోట్లకు చేరుకుంది. 2017-18 మూడో త్రైమాసికంలో సంస్థ ఆదాయం రూ.13,669 కోట్ల కంటే ఈ మొత్తం 10.17 శాతం ఎక్కువ. కంపెనీ ఆదాయాల్లో ఎక్కువ వాటా ఉన్న ఐటీ సేవల విభాగం అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 1.8 శాతం అధికంగా 2,046.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.14,555 కోట్లు) ఆదాయాన్ని నమోదు చేసింది.

అంచనాలు: మార్చి త్రైమాసికంలో కంపెనీ ఐటీ సేవల వ్యాపారం నుంచి 2047-2088 మి. డాలర్ల ఆదాయం లభించగలదని కంపెనీ అంచనా వేసింది. అంటే డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే 2 శాతం వృద్ధి అన్నమాట.

బోనస్ షేర్లు: విప్రో బోర్డు బోనస్ షేర్ల జారీకి అంగీకరించింది. వాటాదార్ల వద్ద ఉన్న ప్రతి 3 షేర్లకు ఒక షేరును బోనస్‌గా ఇస్తారు. అదే సమయంలో ప్రతి 3 ఏడీఎస్ షేర్లకు ఒక ఏడీఎస్ షేరును అందజేస్తుంది. రికార్డు తేదీని అర్హత గల వాటాదార్లకు తర్వాత తెలియజేస్తామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. చివరి సారిగా ఏప్రిల్ 2017లో 1:1 నిష్పత్తిలో కంపెనీ బోనస్ షేర్లను ప్రకటించింది.

డివిడెండు: బోనస్ షేర్లతో పాటు మధ్యంతర డివిడెండుకూ బోర్డు అంగీకరించింది. రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.1 డివిడెండు లభిస్తుంది. ఇందుకు రికార్డు తేదీని జనవరి 30, 2019గా కంపెనీ ప్రకటించింది.

నగదు నిల్వలు: డిసెంబరు 2018 నాటికి కంపెనీ వద్ద రూ.46,847.9 కోట్ల నగదు, నగదు సమాన నిల్వలు ఉన్నాయి. అదనంగా రూ.2 ముఖ విలువ గల మొత్తం 700 కోట్ల ఈక్విటీ షేర్లను సృష్టించడం ద్వారా కంపెనీ తన అధీకృత వాటా మూలధనాన్ని రూ.1126.5 కోట్ల నుంచి రూ.2526.5 కోట్లకు పెంచుకుంది.

> మా వ్యూహాత్మక పెట్టుబడులు, ఖాతాదార్లతో బలమైన సంబంధాలు, కంపెనీల ఆధునికీకరణ, డిజిటలీకరణ కోసం పెరుగుతున్న సంస్థల వ్యయాలు.. ఇవన్నీ మాకు సంతృప్తికర త్రైమాసికాన్ని అందించాయి.
>
> **- విప్రో సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి ఎన్ నీముచ్‌వాలా**



ఫలితాల వెల్లడి కార్యక్రమంలో విప్రో సీఈఓ అబిదాలి ఎన్ నీముచ్‌వాలా, సీఎఫ్ఓ జతిన్‌దలాల్, సీఓఓ భానుమూర్తి, హెచ్ఆర్ అధికారి సురభ్ గోవిల్

ఆదాయాలు, మార్జిన్లలో మెరుగైన ఫలితాలు వచ్చినట్లు విప్రో సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి జడ్ నీముచ్‌వాలా శుక్రవారం విలేకర్లతో పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఆర్థిక, సేవా, బీమా(బీఎఫ్ఎస్ఐ), ఇతర రంగాలు రాణించినట్లు ఆయన తెలిపారు. అమెరికా, ఆసియా పసిఫిక్, ఇతర వర్ధమాన మార్కెట్లలో వృద్ధి ఆరోగ్యకరంగా ఉందని అన్నారు. దేశీయంగా ఊగిసలాటలోనే ఉండనుందని ఆయన అభిప్రాయపడ్డారు.

స్థానికీకరణ(లోకలైజేషన్) వల్ల మూడో త్రైమాసికంలోనూ సానుకూలతలు కనిపించాయని.. కీలక మార్కెట్లు, అమెరికాలో స్థానికీకరణ అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 60.3 శాతం నుంచి 62.6 శాతానికి పెరిగినట్లు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జతిన్ దలాల్ వివరించారు.

శుక్రవారం బీఎస్ఈలో విప్రో షేరు 2.91 శాతం లాభంతో రూ.346.20 వద్ద స్థిరపడింది.

CA

1704 ఫ్లాట్లతో హ్యాపీనెస్ట్-2

సీఆర్‌డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో సీఆర్‌డీఏ చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టు హ్యాపీనెస్ట్-1కి ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో.... ఇప్పుడు హ్యాపీనెస్ట్-2 పేరుతో మరో ప్రాజెక్టు చేపట్టనుంది. ఐనవోలు సమీపంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో సీఆర్‌డీఏ 1704 ఫ్లాట్లు నిర్మిస్తుంది. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. పలు ప్రాజెక్టులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వెంకటపాలెం సమీపంలో రూ. 448 కోట్లతో ఐటీ పార్కు నిర్మాణానికి, జ్యుడీషియల్ కాంప్లెక్స్‌కి అనుబంధంగా అడ్వకేట్ బ్లాక్ నిర్మాణానికి, పరిపాలన నగరానికి సంబంధించి నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ రూపొందించిన ప్రణాళిక లేఅవుట్‌కి ఆమోదముద్ర వేశారు. 150 ఎకరాల్లో నిర్మాణరంగ నగరాన్ని నిర్మించాలని నిర్ణయించారు. పనుల్లో నాణ్యత పర్యవేక్షణకు సంబంధించి రూపొందించిన క్వాలిటీ కంట్రోల్ మాన్యువల్‌ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

- హ్యాపీనెస్ట్-2 ప్రాజెక్టుని సీఆర్‌డీఏ 16.05 ఎకరాల్లో చేపడుతుంది. మొత్తం 12 అపార్ట్‌మెంట్ బ్లాక్‌లు ఉంటాయి. రూ. 1150 కోట్లతో 23 అంతస్తులుగా నిర్మిస్తారు. 1290, 1590, 1890, 2190 చ.అడుగులు విస్తీర్ణంలో నాలుగు కేటగిరీల ఫ్లాట్లు ఉంటాయి.
- రాజధానిలో ఐదు నక్షత్రాల హోటళ్లు రెండు, నాలుగు నక్షత్రాల హోటల్ ఒకటి, మూడు నక్షత్రాల హోటళ్లు మూడు ఏర్పాటు చేసేందుకు సంబంధిత సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి భూ కేటాయింపు పత్రాలు (ఎల్ఓఏ) అందజేశారు. వీటితో కలిపి ఇంతవరకు భూకేటాయింపులు జరిపిన హోటళ్ల సంఖ్య 16కి చేరింది. చంద్రబాబు మాట్లాడుతూ ఎన్ని హోటల్ గదులు వస్తే అంత త్వరగా రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని తెలిపారు.
- రాజధాని అమరావతిలో గ్యాస్, వాటర్, విద్యుత్, ఫైబర్ గ్రిడ్ తరహాలో కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. దీనిని 40 వేల టన్నుల సామర్థ్యంతో ప్రతిపాదించామని, ఇది దేశంలోనే రెండో అతి పెద్దదిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.
- వెంకటపాలెం సమీపంలో రూ. 448 కోట్లతో 15 అంతస్తులతో 14.21 లక్షల చ.అడుగుల నిర్మిత ప్రాంతం కలిగిన ఐటీ పార్కుని నిర్మిస్తారు. వాణిజ్యపరమైన అవసరాలకు, దిగ్గజ ఐటీ సంస్థలకు అందుబాటులో ఉంచుతారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.
- రాజధానిలో తాత్కాలికంగా హైకోర్టు ఏర్పాటు చేసేందుకు నిర్మిస్తున్న జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనానికి అనుబంధంగా రూ. 23.15 కోట్లతో అడ్వకేట్ బ్లాక్ నిర్మిస్తారు. 140ఛాంబర్లు, 16 దుకాణాలు ఉంటాయి.
- నిర్మాణరంగానికి అవసరమైన యంత్రాలు, సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానాలు, సేవలు వంటివన్నీ ఒకే చోట లభించేలా నిడమర్రులో రూ. వెయ్యి కోట్ల అంచనాతో 150 ఎకరాల్లో నిర్మాణ నగరాన్ని నిర్మించనున్నారు.
- రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనుల్ని చూసేందుకు ప్రస్తుతం రోజుకి 4 వేల మంది చొప్పున వస్తున్నారని, శనివారం నుంచి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి పి.నారాయణ వెల్లడించారు. నిత్యం 10వేల మంది సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిషనర్ శ్రీధర్ వివరించారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం నివారణకు గ్రీన్ ఛానల్

రాజధానిలో మౌలిక వసతుల పనులు చేస్తున్న సంస్థలకు బిల్లుల చెల్లింపునకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయాలని, జాప్యం లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించారు.



పీవీ సింధుకు జ్ఞాపికను అందజేస్తున్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్

విదేశాల్లోనే మహిళలకు అధిక గౌరవం: సింధు

ఈనాడు, హైదరాబాద్: మన దేశంతో పోలిస్తే విదేశాల్లోనే మహిళలకు ఎక్కువ గౌరవం లభిస్తోందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రమంలో వేర్వేరు దేశాలకు వెళ్లినప్పుడు ఈ విషయాన్ని తాను గమనించానని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో 'పనిచేసే ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-అమలు' అనే అంశంపై హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ.. భారత్‌లో ప్రజలు మహిళల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిస్తున్నా, అవి అనుకున్నంత స్థాయిలో లేవన్నారు. పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధం మాటలకే పరిమితమైందని వివరించారు. ఏ సమాజానికైనా మహిళా వివక్ష ఆహ్వానించదగిన పరిణామం కాదని తెలిపారు. 'మీటూ' ఉద్యమం ద్వారా యువతీయువకులు లైంగిక వేధింపుల పర్యవసానాలు తెలుసుకుంటున్నారని చెప్పారు. లైంగిక వేధింపులంటే శారీరక కోర్కెలు తీర్చమని బలవంతం చేయడం ఒక్కటే కాదని, మానసిక, ఇతర వేధింపులనూ అలాగే పరిగణించాలని అభిప్రాయపడ్డారు. వేధింపులు ఎదుర్కొంటున్న బాధితులు మౌనం వీడి, ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చదివించే వాతావరణం.. ఓ విజయ సోపానం

(మొదటి పేజీ తరువాయి)

మార్చి 16 నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అంటే ఇక రెండు నెలల సమయం కూడా లేదు. తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్షలకు మొత్తం సుమారు 12 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు నిపుణులు ఇస్తున్న సూచనలివీ..

వినోదాలకు దూరంగా..

విద్యార్థులు ఇంటివద్ద చదివేటపుడు.. వీలైనంతవరకూ వారిని టీవీ, కంప్యూటర్‌వంటి ఉపకరణాలకు, వినోదాలకు దూరంగా ఉంచాలి. వారిముందు సెల్‌ఫోన్ సంభాషణలు సరికాదు. పిల్లలకు ప్రత్యేక గది లేని ఇంట్లో పరీక్షల ముందు కేబుల్ కనెక్షన్ తొలగించడం అవసరం.

- పరీక్షల ముందు విందులు, వినోదాలు, శుభకార్యాలకు విద్యార్థులను తీసుకెళ్లొద్దు. విద్యార్థికి సమయంతోపాటు ఏకాగ్రత కూడా ఎంతో ముఖ్యం.
- కుటుంబ సమస్యలను పిల్లల ఎదుట చర్చిస్తే.. అది వారిని మానసిక ఒత్తిడికి గురి చేసే అవకాశం ఉంది.

ఆత్మవిశ్వాసం పెంపొందించేలా..

పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా మాట్లాడాలి. 'చాలా తెలివైనవాడివి.. అనుకుంటే ఏదైనా సాధిస్తావు..' లాంటి పదాలను వాడుతూ ప్రోత్సహించాలి.

★ ఏకాగ్రతను పెంచుకునేందుకు, ఒత్తిడిని అధిగమించేందుకు కొంత సమయం ఇంటి వద్ద యోగా, ధ్యానం చేయించాలి. కనీసం 30 నిమిషాలైనా ఆడుకోనివ్వాలి. కుటుంబ సభ్యులు కలిసి ఆడితే ఇంకా మంచిది. శారీరక వ్యాయామంద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చు.

★ ఒంట్లో నలతగా ఉంటే ఆ ప్రభావం చదువుపై పడుతుంది. పరీక్షల సమయంలో చిన్న అనారోగ్యం కలిగినా, జాప్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

★ కనీసం ఆరు గంటల నిద్ర తప్పనిసరి.

★ ప్రతిభావంతుడైన స్నేహితుడితో కలిసి చదువుకోవడమూ ప్రయోజనకరమే.

ఆందోళన పెంచొద్దు



పరీక్షల గడువు దగ్గరపడుతోందని పిల్లలు అసలే ఆందోళన పడుతుంటారు. అలాంటి వారిని కొందరు తల్లిదండ్రులు తమ మాటలతో మరింత ఆందోళనకు గురి చేస్తారు. పిల్లలకు అండగా ఉంటూ.. నైతిక బలం ఇవ్వాలి తప్ప 'అత్యధిక మార్కులతోనే భవిష్యత్తు..' అంటూ కంగారు పెట్టకూడదు. కొందరు పిల్లలు కొద్ది సమయం చదివినా బాగా నేర్చుకుంటారు. గంటల తరబడి చదువుకోమని ఒత్తిడి చేయటం తగదు. భయం ఎక్కువైతే చదివింది కూడా మరిచిపోయే పరిస్థితి వస్తుంది.

– రాధిక ఎన్ ఆచార్య, క్లినికల్ సైకాలజిస్టు, హైదరాబాద్

పనులు చెప్పొద్దు



పరీక్షల ముందు ఇంటి, బయటి పనులు పిల్లలకు చెప్పకూడదు. విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో వారి ఏకాగ్రతకు భంగం వాటిల్లకుండా చూడాలి. పరీక్షలు పూర్తయ్యేంత వరకు పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి ప్రయాణాలు పెట్టుకోవద్దు.

– ఎం.ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, నల్లగొండ ఉన్నత పాఠశాల, కరీంనగర్ జిల్లా

ప్రశాంత వాతావరణం కల్పించాలి



పిల్లలు అలసిపోకుండా ఉండేందుకు పౌష్టికాహారం అందించాలి. పునశ్చరణ సమయం చాలా ముఖ్యమైంది. ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రయోజనం ఉంటుంది. తోటి విద్యార్థులతో కలిసి అభ్యసనం చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

– బట్టు సురేష్, ప్రధానోపాధ్యాయుడు, నిడమానురు, విజయవాడ

ఆయేషా హత్య కేసు దర్యాప్తు వేగవంతం

- రెండు బృందాలుగా సీబీఐ విచారణ
- సత్యం బాబు, కోనేరు సతీష్ ఇళ్లలో దర్యాప్తు
- కీలక విషయాలను రాబట్టిన అధికారులు



సత్యంబాబును విచారిస్తున్న సీబీఐ అధికారులు

ఈనాడు, విజయవాడ, నందిగామ, విజయవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసు పునఃదర్యాప్తును సీబీఐ శుక్రవారం నేరుగా ప్రారంభించింది. రెండు బృందాలుగా విడిపోయి విచారణ నిర్వహించింది. కృష్ణా జిల్లా నందిగామ మండలంలోని అనాసాగరం గ్రామంలోని సత్యంబాబు ఇంటికి నలుగురు అధికారులతో కూడిన బృందం వెళ్లింది. ఇంట్లోని వారందరినీ బయటకు పంపేసి ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక్కడినే సుదీర్ఘంగా విచారించారు. సత్యంబాబు బ్యాంకు ఖాతా పుస్తకాలను, ఆధార్‌కార్డును పరిశీలించారు. బ్యాంకు ఖాతాలోని డబ్బు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. తాను జైలులో ఉన్న సమయంలో పని చేసిన తాలూకూ రూ.30 వేలు వచ్చాయని, ఆ మొత్తంతో అప్పులు తీర్చానని వివరించాడు. ఇబ్రహీంపట్నం ఎప్పుడైనా వెళ్లారా?, ఆయేషా మీరా ఉన్న హాస్టల్‌ను చూశారా?, విజయవాడ వెళ్లారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. తాను ఆ ప్రాంతాలకు వెళ్లలేదని, ఆమెను చూడలేదని చెప్పినట్లు తెలిసింది. అతని చేతి రాతను పరిశీలించారు. తన తల్లి, చెల్లిని చంపుతామని, తనను ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించి ఇంటి నుంచి కొందరు పోలీసు అధికారులు అప్పట్లో తీసుకెళ్లారని చెప్పినట్లు సమాచారం. అనంతరం సత్యం బాబు మీడియాతో మాట్లాడాడు. పోలీసులు తనను అన్యాయంగా కేసులో ఇరికించారని, తాను నిర్దోషినని పేర్కొన్నాడు. సీబీఐ విచారణపై నమ్మకం ఉందని, వారికి పూర్తిగా సహకరిస్తానని వెల్లడించాడు.

మరో ఐదుగురు సభ్యుల బృందం ప్రధాన నిందితుడిగా ఆయేషా మీరా తల్లి ఆరోపిస్తున్న కోనేరు సతీష్ ఇంటికి వెళ్లింది. విజయవాడ శివారు గూడవల్లిలోని ఆయన ఇంటికి ఉదయం 7.30 గంటలకు చేరుకున్న బృందం రాత్రి 9 గంటల వరకు విచారించింది. కోనేరు సతీష్ గతంలో గూడవల్లి పంచాయతీ సర్పంచిగా పనిచేశారు. అతడి ప్రవర్తన గురించి వారం క్రితం పంచాయతీ కార్యాలయానికి వచ్చి వాకబు చేసినట్లు సమాచారం. ఆయేషా హత్య జరిగిన సమయంలో ఎక్కడ ఉన్నారని అడగ్గా.. 2007, డిసెంబరు 26న విమానంలో హైదరాబాద్ వెళ్లానని, తిరిగి 27వ తేదీ సాయంత్రం వచ్చానని చెప్పినట్లు సమాచారం. తాళాలు అందుబాటులో లేకపోవడంతో బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న హార్డ్‌డిస్క్, ఫోన్ నంబర్లు నమోదు చేసిన రెండు పుస్తకాలు, 2 డైరీలు, ఓ నోటు పుస్తకం, లెటరు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సతీష్ చెప్పిన వివరాలు ఆధారంగా మరింత లోతుగా ప్రశ్నించేందుకు కోనేరు రంగారావు కుమార్తె రాజభక్తిదేవిని హైదరాబాద్ నుంచి వెంటనే రప్పించారు. ఆమె నుంచి కొన్ని వివరాలను రాబట్టారు. ఆమె కుమారుడు సిద్ధార్థ్, రంగారావు కుమారుడు జిత్తు గురించి కూడా క్షుణ్ణంగా విచారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విచారణ అనంతరం కోనేరు సతీష్ విలేకరులతో మాట్లాడారు. హత్య జరిగిన రోజు తాను విజయవాడలో లేనన్నారు. తనను నిందితునిగా పేర్కొనడం తగదని.. దాదాపు 11 ఏళ్ల నుంచి తనపై బురద చల్లుతున్నారని, ఈ క్షోభతోనే తాతయ్య, అమ్మమ్మలను పోగొట్టుకున్నట్లు వివరించారు. సీబీఐ విచారణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

30న గవర్నర్ ప్రసంగం

ఉభయసభల సమావేశంలో

- 1, 2, 3 తేదీల్లో సభలకు సెలవులు?
- 4న ధన్యవాదాల తీర్మానం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ఈ నెల 30న గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. ఆ రోజు నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల మరణించిన శాసనసభ్యులకు జనవరి 31న సంతాప తీర్మానాలు ఉంటాయి. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో ఉభయసభలకు సెలవులు ఇవ్వాలని భావిస్తున్నారు. ఫిబ్రవరి 4న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం ఉంటుంది. ఫిబ్రవరి 5న శాసనసభకు ఓట్ ఆన్ అకౌంట్‌ను సమర్పిస్తారు. ప్రభుత్వం ఇటీవల వృద్ధాప్య పింఛన్ల మొత్తాన్ని రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలకు పెంచిన విషయం తెలిసిందే. ఆ మొత్తాలను ఫిబ్రవరి ఒకటి నుంచి పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యేల చేతుల మీదుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొనేందుకు వీలుగా సభకు మూడు రోజుల పాటు సెలవులు ఇస్తున్నారు. శాసనసభ వ్యవహారాల కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది.

199 కోట్లు పులిచింతల కేసులో కోర్టులో డిపాజిట్‌కు పచ్చజెండా

ఈనాడు, అమరావతి: పులిచింతల ప్రాజెక్టు గుత్తేదారుకు అదనపు పరిహారం చెల్లింపులపై ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కేసులో న్యాయస్థానం ఆదేశాల మేరకు పరిహారంగా చెల్లించాల్సిన మొత్తంలో సగం కోర్టులో డిపాజిట్ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు జలవనరులశాఖ కార్యదర్శి రూ. 199.67 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఆదేశాలిచ్చారు. పులిచింతల గుత్తేదారు మొత్తం 28 అంశాలపై రెండో వివాద పరిష్కారబోర్డును ఆశ్రయించారు. వారి ఆదేశాలపై ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. ఆ ట్రిబ్యునల్ సైతం గుత్తేదారుకు అదనపు మొత్తాలు వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించింది. ఈ వ్యవహారం ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోగా న్యాయస్థానంలో సరైన పోరాటమూ చేయకపోవడంతో ప్రభుత్వం దాదాపు రూ. 400 కోట్లు గుత్తేదారుకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మొత్తం చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్తులు జప్తు చేయాలంటూ కూడా గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉత్తర్వులు పొందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హైకోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ కేసు విచారణ చేపట్టాలంటే ఆర్బిట్రేషన్ మొత్తంలో సగం కోర్టులో డిపాజిట్ చేయాలని హైకోర్టు షరతు విధించింది. దీంతో ఈ మేరకు జలవనరులశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

తెలంగాణ సభాపతిగా బాధ్యతలు స్వీకరించిన పోచారం



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రెండో శాసనసభ నూతన సభాపతిగా బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభాపతిగా పోచారం ఒక్కరి నామినేషనే రావడంతో.. ఆయనే స్పీకర్ పదవికి ఎన్నికైనట్లు సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. నూతన సభాపతిని అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రశంసల జల్లులతో ముంచెత్తారు. మీ అధ్యక్షత పరిపూర్ణమై, పరిపుష్ఠమై గొప్ప విజయం సాధించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

తెరాసలోకి వంటేరు ప్రతాప్‌రెడ్డి



తెరాసలో చేరిన అనంతరం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన వంటేరు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో తెరాసలో చేరారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై అభాండాలు వేస్తున్నారని, తెలంగాణ సీఎం కేసీఆర్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారని ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్ల పాటు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంతో అంటకాగిన చంద్రబాబు ఇప్పుడు ఇతరులను బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో సోనియాను ఎన్నో మాటలు అని ఇప్పుడు అదే కాంగ్రెస్‌తో జట్టు కట్టారని పేర్కొన్నారు. తెరాసలో చేరిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి శుక్రవారం ప్రగతి భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ప్రతాప్‌రెడ్డికి హామీ ఇచ్చారు.

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క



ఈనాడు, దిల్లీ, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ మల్లు భట్టి విక్రమార్క నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహలోత్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌కు గత శాసనసభలో 21 మంది శాసనసభ్యులుండగా ప్రస్తుతం 19 మంది సభ్యులే ఉన్నారు. సీఎల్పీ పదవికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క పేర్లు ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకున్నారు. గురువారం జరిగిన సమావేశంలో సీఎల్పీ నేత ఎన్నిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాంగ్రెస్ అధిష్ఠానం మల్లు భట్టివిక్రమార్కను ఆ పదవిలో నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.

కోడికత్తి కేసులో ముగిసిన ఎన్‌ఐఏ కస్టడీ

- రాజమహేంద్రవరం జైలుకు నిందితుడి తరలింపు
- దస్త్రాలను దర్యాప్తు సంస్థకు ఇవ్వాలి: కోర్టు

విజయవాడ, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేత జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్‌ఐఏ అధికారులు శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. అంతకుముందు.. నిందితుడని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గతంలో కోర్టు విధించిన వారం రోజుల కస్టడీ శుక్రవారంతో ముగిసింది. దర్యాప్తులోని వివరాలతో కూడిన పత్రాలను, ఆరోగ్య పరీక్షల నివేదికను న్యాయస్థానంలో దాఖలు చేశారు. దర్యాప్తు అధికారులు ఏమైనా ఇబ్బంది పెట్టారా? అని నిందితుడిని న్యాయమూర్తి పార్థసారథి అడిగారు. అంతా సవ్యంగా జరిగిందని, ఎటువంటి ఇబ్బంది పెట్టలేదని సమాధానమిచ్చాడు. ఇంకా ఏమైనా చెప్పదలచుకున్నావా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. తన భావాలను ప్రజలకు చెప్పుకునే అవకాశం కల్పించాలని, కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని, తాను రాసిన పుస్తకాన్ని విశాఖపట్నం జైలు అధికారులు తీసుకున్నారని చెప్పాడు. కేసుకు సంబంధించి ఇప్పటికే విచారించిన సిట్ అధికారుల వద్ద ఉన్న దస్త్రాలను వెంటనే ఎన్‌ఐఏకు అప్పగించాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ కేసులో నిందితుడి తరపున వాదిస్తున్న న్యాయవాదులు సలీం, మట్టా జయకర్ రెండు మెమోలను న్యాయస్థానంలో దాఖలు చేశారు. మొదటి దాంట్లో.. నిందితుడిని న్యాయవాది సమక్షంలో విచారించాల్సి ఉన్నా, 30 గంటలు రహస్యంగా ప్రశ్నించారని పేర్కొన్నారు. రెండో మెమోలో.. శ్రీనివాసరావు రాసుకున్న పుస్తకాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. వీటిపై కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం కావాలని ఎన్‌ఐఏ అధికారులు న్యాయమూర్తిని కోరారు. దీంతో 23న కౌంటర్ వేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

- కస్టడీ ముగిసిన అనంతరం నిందితుడిని విజయవాడ జైలులో ఉంచాలని కోర్టును వారు కోరారు. దీనికి నిందితుడి తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. విజయవాడ జైలులో ప్రత్యేక భద్రత లేదని, శ్రీనివాసరావుకు ప్రాణహాని ఉందన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

విద్యుత్ సరఫరా బాగుంది

- అపరాధ రుసుం భారాన్ని తగ్గించండి
- ఏపీఈఆర్‌సీ విచారణలో వినియోగదారులు

ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగున్నాయి. అయితే, బిల్లులు ఆలస్యంగా చెల్లిస్తే కొన్ని రకాల పరిశ్రమల వినియోగదారులకు అధికంగా అపరాధ రుసుం వేస్తున్నారని, ఈ భారాన్ని తగ్గించాలని' పలువురు విన్నవించారు. వచ్చే ఆర్థిక సంవత్సరాని(2019-20)కి విద్యుత్ సంస్థ(డిస్కం)ల వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్)పై అందజేసిన నివేదిక, డిస్కంలు రాష్ట్ర జెన్‌కోకు రానున్న ఐదేళ్లపాటు చెల్లించాల్సిన కరెంటు ఛార్జీల ప్రతిపాదనలపై ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బహిరంగ విచారణ జరిగింది. ఏపీ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) ఛైర్మన్ భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిస్కంల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పలు సంఘాలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరై తమ వాదనలు, ఫిర్యాదులు, సూచనలు తెలిపారు. వ్యవసాయ కరెంటుకు ఎలాంటి ఛార్జీలు వేయవద్దని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొజ్జా దశరథరాంరెడ్డి కోరారు. మెట్ట ప్రాంతాల్లో పండే రాగులు, కొర్రలు తదితర చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించడానికి వాటికి అనుకూలంగా కరెంటు ఛార్జీలు ఉండేలా చూడాలని కృష్ణా జిల్లా రైతు సంఘాల ప్రతినిధి చెరుకూరి వేణుగోపాల్ కోరారు. 33కేవీ, 132 కేవీ విద్యుత్ లైన్ల నుంచి వచ్చే విద్యుత్ ధరల్లోని తేడాలను తగ్గించాలని పరిశ్రమల ప్రతినిధి మోహన్ విన్నవించారు. కరెంటు బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే కొన్ని రకాల పరిశ్రమలకు యూనిట్‌కు రూపాయిన్నర దాకా అపరాధ రుసుము వేయడం వల్ల ఆర్థికభారం పడుతోందని, దాన్ని రూపాయికి తగ్గించాలని కోరారు. భవానీ ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులకు అనుకూలంగా మెరుగైన టారిఫ్ ఉంటుందని చెప్పారు. డిస్కంల ప్రతిపాదలనపై ఇంకా ఎవరైనా సలహాలు, సూచనలు రాతపూర్వకంగా పంపవచ్చని సూచించారు.

కోటప్ప'కొండ' పండగ

- నేటి నుంచి 2 రోజులు నిర్వహణ

ఈనాడు, గుంటూరు: దేశంలో తొలిసారి నిర్వహిస్తున్న కొండ పండగ (హిల్ ఫెస్టివల్)కు గుంటూరు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ సిద్ధమైంది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 19, 20 తేదీల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ పండగ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి, కాలుష్యాన్ని తగ్గించాలనేది ఈ పండగ ప్రధాన ఉద్దేశం. ఈ పండగ నిర్వహణకు ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు శుక్రవారం సాయంత్రం కొండపై ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆధ్యాత్మికంతో పాటు యాత్రికులను ఆకట్టుకునేందుకు కొండపై పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

- కొండల మధ్యలో 50 ఎకరాల విస్తీర్ణంలో పర్యావరణ క్షేత్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ మొక్కల ప్రాధాన్యాన్ని పర్యాటకులకు వివరిస్తారు.



పారాగ్లైడరుపై పయనానికి సిద్ధమైన సభాపతి కోడెల

- కొండ మధ్యభాగంలో అభివృద్ధి చేసిన వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో నెమళ్లు, దుప్పులు, కుందేళ్లు, రకరకాల పక్షులు, గుడ్లగూబలు, ఊసరవెల్లి, ఈము, ఆస్ట్రిచ్ పక్షులు, హంసలు, పలు రకాల కొంగలను పెంచుతున్నారు. భారీ ఆక్వేరియం ఏర్పాటు చేశారు.
- పిల్లల కోసం బాలానందం పార్కును అభివృద్ధి చేశారు.
- కొండల అందాలను ఆకాశం నుంచి వీక్షించేలా పారాగ్లైడర్, హాట్ బెలూన్లను అందుబాటులో ఉంచారు.
- కొండ చుట్టూ అటవీ క్షేత్రంలో తిరిగి రావడానికి టాయ్ రైలును అందుబాటులోకి తీసుకువచ్చారు.

లద్దాఖ్‌లో విరుచుకుపడ్డ మంచు చరియలు

ట్రక్కులు కూరుకుపోయి పది మంది దుర్మరణం!



ఖుర్దుంగ్లా ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్న సిబ్బంది

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని లద్దాఖ్ ప్రాంతంలో మంచు చరియలు విరిగి పడడంతో వాటి కింద రెండు ట్రక్కులు కూరుకుపోయాయి. ట్రక్కుల్లో ఉన్న పది మంది దుర్మరణం చెందినట్లు భావిస్తున్నారు. ఐదుగురి మృతదేహాల్ని వెలికితీయగా, మిగతావారిని గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారు జీవించి ఉండే అవకాశాలు తక్కువేనని పోలీసులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రెండు ట్రక్కులు 10 మంది పౌరులతో వెళ్తుండగా, ఖుర్దుంగ్లా పాస్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. రెండు ట్రక్కులు 20 అడుగుల మేర మంచు చరియల కింద కూరుకుపోయినట్లు రక్షణశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఘటనాస్థలం.. సముద్ర మట్టానికి 17,500 అడుగుల ఎత్తులో ఉంది.

నిరాడంబర సంపన్నుడు



ఆయన ప్రపంచ కుబేరుడు. తలుచుకుంటే చిటికెలో ఏదైనా ఆయన ముందుండాల్సిందే. అలాంటి వ్యక్తి బర్గర్ల కోసం మామూలు వ్యక్తుల్లాగే దుకాణం ముందు వరుసలో నిల్చున్నారు. ఓపిగ్గా వేచి చూసి కొనుక్కొని వెళ్లారు. ఆయన మరెవరో కాదు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్. ఇలా గేట్స్ స్వయంగా వచ్చి వరుసలో నిల్చున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆయన నిరాడంబరతపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

విపక్షాల ఐక్యతా స్వరం

నేడు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ ● హాజరు కానున్న 20 జాతీయ స్థాయి నేతలు

కోల్‌కతా: విపక్షాల భారీ ఐక్య ర్యాలీకి పశ్చిమ బెంగాల్‌లోని బ్రిగేడ్ పరేడ్ మైదానం ముస్తాబైంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి పలు పార్టీల నేతలు హాజరవుతున్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ సహా సుమారు 20 మంది జాతీయ స్థాయి నేతలు విచ్చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఎస్పీ-బీఎస్పీ కూటమి నేతలతో పాటూ... వారు దూరం పెట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా పాల్గొంటుండటం విశేషం. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో- పలు భాజపాయేతర పక్షాలు ఒకే వేదికను పంచుకోనుండటం దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. కాషాయ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో మహాకూటమి ఏర్పాటుకు ఇదో ముందడుగని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్పీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ఇప్పటికే కోల్‌కతా చేరుకోగా, బీఎస్పీ తరఫున సీనియర్ నేత సతీశ్‌చంద్ర మిశ్రా హాజరుకానున్నారు. మరోవైపు యూపీలోని పశ్చిమ ప్రాంతంలో గట్టి పట్టున్న రాష్ట్రీయ లోక్‌దళ్ నుంచి ఆ పార్టీ నేతలు అజిత్‌సింగ్, జయంత్ చౌదరి వస్తున్నారు. ఎస్పీ-బీఎస్పీ కూటమిలో చేరేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్న క్రమంలో, అందుకు ఈ ర్యాలీ వేదికగా మారనుందని భావిస్తున్నారు. అయితే... ఇది భాజపా వ్యతిరేక పక్షాల ర్యాలీ మాత్రమేనని, ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాలకు దీనితో సంబంధం లేదని ఎస్పీ ఉపాధ్యక్షుడు కిరణ్మయి నందా వ్యాఖ్యానించారు. పలువురు కాంగ్రెస్ నేతలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.



కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో భేటీ అయిన డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ★ కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబును తోడ్కొని వెళుతున్న టీఎంసీ ఎంపీలు డెరెక్ ఒబ్రెయిన్, దినేష్ త్రివేది

కలకత్తా చేరుకున్న చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కలకత్తా చేరుకున్నారు. ఆయన వెంట మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, దిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కంభంపాటి రామమోహన్‌రావు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, దిల్లీ, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కేజ్రీవాల్, కుమారస్వామిలతో పాటు జమ్ము-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, డీఎంకే అధినేత స్టాలిన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సంఘ్వీ, ఎన్సీపీ నేత శరద్ పవార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, భాజపా అసంతృప్త ఎంపీ శత్రుఘ్నసిన్హా హాజరయ్యే అవకాశముంది. వీరితో పాటు కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, పాటిదార్ నేత హార్దిక్ పటేల్, దళిత నేత జిగ్నేశ్ మేవాణీ, ఝార్ఖండ్ వికాస్ మోర్చా నేత బాబూలాల్ మారాండీ కూడా వేదిక పంచుకోనున్నారు. గత మంగళవారం భాజపాను వీడిన అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్ కూడా హాజరయ్యే అవకాశముంది.

30 ఎల్‌ఈడీ తెరలు...

బహిరంగ సమావేశం జరిగే బ్రిగేడ్ మైదానంలో భారీ వేదికతో పాటు... 30 ఎల్‌ఈడీ తెరలు, వెయ్యి మైక్రో ఫోన్లు, 20 వాచ్ టవర్లను సిద్ధం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి తృణమూల్ కార్యకర్తలు లక్షలాదిగా తరలివస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

భాజపాకు వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటైంది: దేవెగౌడ

కేంద్రంలో భాజపా పాలనకు చరమగీతం పాడాలని దేశం యావత్తు ఒక్కటైందని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ వ్యాఖ్యానించారు. మమత ప్రయత్నం అభినందనీయమని, ఆమె ప్రయత్నాల ఫలితంగా ఏర్పడే లౌకిక ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. యువకులు, రైతులు, పేదలు, వ్యాపారులు తదితర అన్ని వర్గాల ప్రజలు భాజపా పాలనతో విసిగిపోయారని, దేశం కొత్త ప్రధాని కోసం ఎదురుచూస్తోందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. కోల్‌కతా చేరుకున్న అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

ప్రజల ఆశలు నెరవేర్చే 'రేపటి' కోసమే...

ఈ ర్యాలీ ఐక్య భారతానికి శక్తిమంతమైన సందేశం. దీనిని వినిపించేందుకు కృషిచేస్తున్న మమతాజీకి మద్దతిస్తున్నా. సామాజిక న్యాయం, లౌకికవాదంతోనే జాతికి రక్షణ, అభివృద్ధి సాధ్యమన్న విశ్వాసంతో ప్రతిపక్షాలు ఏకమవుతుండటం ముదావహం. మోదీ ప్రభుత్వ తప్పుడు హామీలు, అబద్ధాలతో ప్రజలు విసిగిపోయారు. మతం, ప్రాంతం, స్థోమత అన్న భేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరి గొంతును వినే రోజు కోసం ప్రజలు తపిస్తున్నారు. వారి ఆశల స్ఫూర్తే ఈ శక్తులను (పార్టీలను) కదిలిస్తోంది."

– రాహుల్ మమతా బెనర్జీకి రాసిన లేఖ

ఝార్ఖండ్‌లో 5 పార్టీల కూటమి

రాంచీ: ఝార్ఖండ్‌లో భాజపాకు వ్యతిరేకంగా అయిదు పార్టీలతో మహా కూటమి ఏర్పాటయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ, బాబూలాల్ మరాండీ ఆధ్వర్యంలోని ఝార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం)లు నిర్ణయించాయి. ఈ కూటమికి జేఎంఎం నాయకత్వం వహించనుంది.

కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు: ఆప్

దిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్పష్టం చేసింది. దిల్లీ, పంజాబ్, హరియాణాల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్టు ప్రకటించింది

జీవ ఇంధనంతో ఎగిరిన ఎతిహాద్ విమానం

- యూఏఈలో ఉప్పునీటి మొక్కల నుంచి ఉత్పత్తి

అబుదాబి: యూఏఈలో తయారైన జీవ ఇంధనంతో తొలిసారిగా ఓ వాణిజ్య విమానం గాల్లోకి ఎగిరింది. అబుదాబి నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వరకూ ఏడు గంటల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఎతిహాద్ విమానయాన సంస్థ దీన్ని నడిపింది. బోయింగ్ 787 రకానికి చెందిన ఈ విమానంలో జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ తయారు చేసిన కొత్త తరం 1బి ఇంజిన్లు ఉన్నాయి. ఎడారిలో ఉప్పునీటితో పెంచిన మొక్కల నుంచి ఈ జీవ ఇంధనం తయారు కావడం విశేషం. ఈ ఇంధన వినియోగంతో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి. యూఏఈలోని ఖలీఫా వర్సిటీలోని మస్దార్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసిన సుస్థిర జీవ ఇంధన పరిశోధక సంస్థ (ఎస్‌బీఆర్‌సీ) దీన్ని ఉత్పత్తి చేసింది. సాలికోర్నియా మొక్కల నుంచి తీసిన నూనెను జెట్ ఇంధనంగా మార్చింది. మస్దార్ నగరంలో రెండు హెక్టార్ల విస్తీర్ణంలో ప్రత్యేకమైన ఫామ్ ఏర్పాటు చేసి వీటిని పెంచారు. ఉప్పునీటితోనే మొక్కలకు కావాల్సిన పోషకాలను అందించేందుకు అందులో చేపలు, రొయ్యల పెంపకం కూడా చేపట్టారు. విమానయాన రంగంలో స్వచ్ఛ ఇంధన వినియోగానికి సంబంధించి ఈ పరిణామంతో కొత్త శకం మొదలైందని ఖలీఫా వర్సిటీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు ఆరిఫ్ సుల్తాన్ అన్నారు. తీర ప్రాంతాల్లోని ఎడారులను స్వచ్ఛ ఇంధన, ఆహార ఉత్పత్తి కేంద్రాలుగా మార్చవచ్చని బోయింగ్ సంస్థ అధికారి సీన్ ష్విన్ అభిప్రాయపడ్డారు. వివిధ రకాల జీవ ఇంధనాలను ఉపయోగించి గతంలోనూ కొన్ని విమానాలు నడిచాయి.

శబరిమల ఆలయంలోకి 51 మంది మహిళలు

దిల్లీ, తిరువనంతపురం: శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత ఇప్పటిదాకా 51 మంది స్త్రీలు వెళ్లినట్లు కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఈ సమాచారం వివాదాలకు దారితీసింది. మరోవైపు.. ఇటీవల శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలకు రాత్రింబవళ్లు భద్రత కల్పించాలని కేరళ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. మహిళా భక్తులకు కేరళ ప్రభుత్వం ఇప్పటికే భద్రత కల్పిస్తుంటే, ఇకపైనా కొనసాగించవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు, జస్టిస్ దినేశ్ మాహేశ్వరిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది.

సులభతర వాణిజ్యంలో పైపైకి

- వచ్చే ఏడాది 50వ ర్యాంకు సాధనే లక్ష్యం
- వ్యాపారంలో ఖర్చుల తగ్గింపే ధ్యేయం
- విదేశీ పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

గాంధీనగర్

సులభతర వాణిజ్యం నిర్వహణలో వచ్చే ఏడాది మొదటి 50 స్థానాల్లో ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ప్రస్తుతం దేశం 77వ స్థానంలో ఉందని, దీన్ని మరింత మెరుగుపరిచి ముందుకెళ్తామని తెలిపారు. శుక్రవారం ఇక్కడ 'వైబ్రెంట్ గుజరాత్' 9వ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ, విదేశాలకు చెందిన వ్యాపార ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగిస్తూ "వచ్చే ఏడాది భారత్‌కు 50వ ర్యాంకు వచ్చేలా కష్టపడాలని నా బృందానికి చెప్పాను. మనవి ప్రపంచంలోని ఉత్తమ విధానాలు, నిబంధనలుగా ఉండాలని ఆశిస్తున్నాను. తక్కువ ఖర్చుతో వ్యాపారం చేసేలా సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ లక్ష్య సాధనలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, సంస్కరణలను, సరళీకరణను కొనసాగిస్తాం" అని తెలిపారు. జీఎస్టీ కారణంగా పన్నుల మదింపు సులభతరమయిందని, దీని వల్ల ఖర్చులు తగ్గాయని చెప్పారు. డిజిటలీకరణ, ఆన్‌లైన్ లావాదేవీలు తదితర సౌకర్యాల కారణంగా వ్యాపారంలో వేగం పెరిగిందని వివరించారు.

■ **అభివృద్ధికి ఆటంకాలు తొలగాయి**

తమ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా చేపట్టిన సంస్కరణ ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి, మెరుగైన పరిపాలన ఉండేలా అధికార యంత్రాంగం కృషి చేస్తోందని అన్నారు. అభివృద్ధి ఫలాలను అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు అందేలా చూడడం ప్రభుత్వం ముందు ఉన్న పెద్ద సవాలని మోదీ చెప్పారు. జీవన ప్రమాణాలను మరింతగా పెంచడంతో పాటు సేవలు, మౌలిక వసతుల నాణ్యత పెంచడం కూడా సవాలేనని అన్నారు. సులభతర వాణిజ్యమే కాదు.. సులభతర జీవనం ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమని ప్రధాని అన్నారు.

దేశంలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని ప్రధాని మోదీ విదేశీ పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు.



గాంధీనగర్‌లో 'వైబ్రెంట్ గుజరాత్' సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

■ **ఇతర దేశాల ప్రధానులతో భేటీ**

వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో పాల్గొన్న డెన్మార్క్ ప్రధాని లార్స్ లొక్కే రాస్ముసెన్, చెక్ రిపబ్లిక్ ప్రధాని ఆండ్రెజ్ బాబిస్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోవివ్, మాల్టా దేశం ప్రధాని జోసెఫ్ మస్కట్‌లతోనూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపారు. ఉజ్బెక్ నుంచి యురేనియం దిగుమతిపై ఒప్పందం కుదిరింది.

డేటా వలసవాదానికి ముగింపు పలకండి

ప్రధానికి ముకేశ్ అంబానీ అభ్యర్థన

మన దేశస్థుల డేటా (సమాచారం) మన దేశంలోనే ఉండాలని, దానిపై నియంత్రణ కూడా మనదే కావాలని దిగ్గజ వ్యాపారవేత్త, రిలయన్స్ సంస్థల ఛైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. అంతర్జాతీయ సంస్థలు సాగిస్తున్న డేటా వలసవాదానికి ముగింపు పలికేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆయన అభ్యర్థించారు. గాంధీనగర్‌లో జరుగుతున్న 'వైబ్రెంట్ గుజరాత్' సదస్సులో శుక్రవారం ఆయన ఈ మేరకు ప్రసంగించారు. డేటా వలసవాదానికి వ్యతిరేకంగా విప్లవం రావాలని అన్నారు. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు డేటాను మన దేశంలోనే నిక్షిప్తం చేయాలని అంబానీ పిలుపునివ్వడం నెల వ్యవధిలో ఇది రెండోసారి. కేంద్రం కూడా ఇదే వైఖరితో ఉంది. భారత్‌లో ఉండే సంస్థలన్నీ దేశీయంగానే డేటాను నిల్వచేయాలని ప్రతిపాదించిన సమాచార భద్రత బిల్లు ముసాయిదా ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో ఉంది.



ఇస్రో ఈ ఏడాది లక్ష్యాలు

1. గగన్‌యాన్ కసరత్తును ప్రారంభించడం
2. విద్యార్థులకు చేరువ కావడం
3. ఇస్రో కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించడం
4. అంతరిక్ష ప్రయోగాలు
5. అంతరిక్ష పితామహుడు సారాభాయ్ శతజయంతి నిర్వహణ

ఇస్రో ప్రయోగశాలలకు మన విద్యార్థులు

- త్వరలో 'యంగ్ సైంటిస్ట్' కార్యక్రమం
- ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కార్యకలాపాలను ఈ ఏడాది దేశం నలుమూలలకూ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ కె.శివన్ వెల్లడించారు. ఇందులో భాగంగా అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) తరహాలో భారతీయ విద్యార్థులకు ఇస్రో ప్రయోగశాలలకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. గగన్‌యాన్ కోసం 'హ్యూమన్ స్పేస్ ఫ్లైట్' పేరిట ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. 2021 డిసెంబర్ నాటికి మానవసహిత యాత్ర చేపడతాం అని చెప్పారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని నిర్ణయించాం. ఇక మీదట ఇస్రో ఛైర్మన్ ఎక్కడికెళ్లినా విద్యార్థులతో మాట్లాడి వారిలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకు 'సంవాద్ విత్ స్టూడెంట్' అన్న కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. ఒక్కో రాష్ట్రం నుంచి ముగ్గురు చొప్పున దేశవ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విద్యార్థులను ఎంపికచేసి ఇస్రోలో నెలపాటు నిర్వహించే 'యంగ్ సైంటిస్ట్' కార్యక్రమానికి తీసుకెళ్తాం. 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇస్రోకు తీసుకెళ్లి ప్రసంగాలు ఇవ్వడంతోపాటు, ప్రయోగశాలలకు తీసుకెళ్తాం" అని శివన్ చెప్పారు. ఈ నెలలో ప్రయోగించబోయే పీఎస్ఎల్‌వీ-సీ44 ద్వారా విద్యార్థులు రూపొందించిన 'కలాంశాట్'ను పంపుతున్నామన్నారు. దేశంలోని ఆరు మూలల్లో ఆరు ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చుట్టుపక్కల రాష్ట్రాలవారు వాటిలో పరిశోధన నిర్వహించుకోవచ్చని చెప్పారు. ఇక మీదట పీఎస్ఎల్‌వీ రాకెట్లను పరిశ్రమలే తయారుచేసి, వారే ప్రయోగాలు చేసేలా చర్యలు చేపట్టబోతున్నట్లు శివన్ చెప్పారు.

జస్టిస్ దినేష్ మాహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాల ప్రమాణ స్వీకారం

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ దినేష్ మాహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలోని ఒకటో నంబరు కోర్టులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 28కి పెరిగింది. ఇంకా మూడు ఖాళీలు ఉన్నాయి. ఇంతవరకు జస్టిస్ మాహేశ్వరి కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, జస్టిస్ ఖన్నా దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. సీనియర్లయిన రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మేనన్‌లు కాదని జస్టిస్ ఖన్నాకు పదోన్నతి కల్పించడంపై విమర్శలు వచ్చాయి. ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను పక్కనపెట్టడాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో పాటు, బార్ కౌన్సిల్ అభ్యంతరం చెప్పిన విషయం విదితమే. ఇలా చేయడంతో తప్పుడు సంకేతాలు వెళ్తాయని జస్టిస్ కౌల్ అభిప్రాయపడ్డారు.



ఈ చిత్రంలో చిన్నారులు ఆశ్చర్యంగా చూస్తున్నది ఓ రోబోను. అది సాధారణమైంది కాదు. కాపలా రోబో. చైనాలోని హోహ్హాట్ ప్రాంతంలోగల ఓ నివాస సముదాయంలో నిరంతరం గస్తీ తిరుగుతుంటుంది.

విమానానికి రూ.186 కోట్ల అధిక చెల్లింపు

- రఫేల్ కొనుగోళ్లలో డసోకు భారీ లబ్ధి
- కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఆరోపణ

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఒక్కో రఫేల్ విమానంపై రూ.186 కోట్లు అధికంగా చెల్లించిందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ఫ్రాన్సు సంస్థ డసోకు గాలివాటు లాభం చేకూర్చిపెట్టిందని ధ్వజమెత్తారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రత, ధరల విషయంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఒక్కో రఫేల్ యుద్ధ విమానాన్ని కేంద్ర ప్రభుత్వం 41% అధిక ధరకు కొనుగోలు చేసినట్లు శుక్రవారం 'హిందూ' దినపత్రికలో వచ్చిన పరిశోధనాత్మక కథనాన్ని చిదంబరం ఉదహరించారు. సుప్రీంకోర్టులో ఈ అంశంపై కేసు ముగిసిన వెంటనే వివాదం ముగిసిపోయిందని ప్రభుత్వం సంతోషపడి ఉండొచ్చని, కానీ దాని కథ ఇంకా ముగిసిపోలేదని చిదంబరం పేర్కొన్నారు. ఇప్పుడు జాతీయ పత్రిక కథనంతో అది కొత్త రూపు సంతరించుకొందని వ్యాఖ్యానించారు. ఇది సుప్రీంకోర్టు తేల్చే అంశం కాదని, పార్లమెంటు శల్యపరీక్ష చేయాల్సిన విషయమని పేర్కొన్నారు. జనవరి 31 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్లమెంటు సంయుక్త సంఘం(జేపీసీ) వేసి మార్చి నెలాఖరుకల్లా నివేదిక ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. రఫేల్ ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడుగురు కమిటీ సభ్యుల్లో ముగ్గురు ప్రతి దశలోనూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారని, ప్రతిచోటా 4-3 నిష్పత్తిలో ఓట్లు పడ్డాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అధికారులు ప్రతి దశలోనూ ఇలా వ్యతిరేకించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. భారత్ అవసరాలకు తగినట్లు రఫేల్ విమానాలను రూపొందించి ఇచ్చేందుకు ప్రభుత్వం 126 విమానాలకు కలిపి 1300 మిలియన్ యూరోలు చెల్లించాల్సి ఉండగా ఇప్పుడు ఆ మొత్తాన్ని కేవలం 36 విమానాలకే చెల్లించాల్సి వచ్చినట్లు పేర్కొన్నారు.

కాగ్ నివేదిక వచ్చేదాకా ఆగండి

- రఫేల్ వ్యవహారంలో ఆరోపణల్ని తిరస్కరించిన ప్రభుత్వం

దిల్లీ: రఫేల్ ఒప్పందంపై వివాదం చల్లారకపోవడంతో రక్షణ మంత్రిత్వశాఖ శుక్రవారం స్పందించింది. ఒప్పందానికి సంబంధించిన అన్ని దస్త్రాలను కాగ్‌కు అందుబాటులో ఉంచామని, జాతీయ ఆడిటర్ నివేదిక వచ్చేదాకా వేచి చూడటం మంచిదని పేర్కొంది. 126కు బదులుగా 36 రఫేల్ యుద్ధ విమానాలకే ఒప్పందం చేసుకున్నారని, ప్రతి విమానాన్ని 41 శాతం అధిక ధరకు కొనుగోలు చేశారంటూ ఓ వార్తా పత్రికలో వచ్చిన కథనం వాస్తవాల పరంగా తప్పని పేర్కొంది. ఆ కథనంలో కొత్త అంశాలేమీ లేవని, ఇప్పటికే అన్ని విషయాలపైనా ప్రభుత్వం భిన్న వేదికలపై సమగ్రంగా సమాధానం ఇచ్చిందని, ఇటీవల పార్లమెంటులో రక్షణ మంత్రి బహిరంగ చర్చలోనే వివరించారని రక్షణశాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ధరలు, వాణిజ్య ప్రయోజనాల వివరాల్ని సుప్రీంకోర్టు కూడా పరిశీలించిందని, ఒప్పందంలో ఎలాంటి ప్రతికూల అంశాల్ని గుర్తించలేదని, దర్యాప్తునకు ఆదేశించేందుకు తిరస్కరించిందని వివరించారు. పత్రిక కథనంలో 2007 నాటి ధరల్ని 2016తో పోల్చి చూశారని, పెరుగుదల అంశాల్ని విస్మరించారని తెలిపారు. గతంలోని ఒప్పందాన్ని 2016లో 36 యుద్ధ విమానాల వ్యయంతో పోల్చడం సరికాదని వివరించారు. ఒప్పందం విషయంలో అందరి అభిప్రాయాలు రికార్డు అయ్యాయని, సమ్మిళిత నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అంతర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల అనంతరమే ఒప్పందంపై నిర్ణయాలు జరిగాయన్నారు. ఐరోపాకు చెందిన ఈఏడీఎస్ సంస్థ 20 శాతం రాయితీలు ఇచ్చేందుకు ముందుకొచ్చిందన్న అంశంపై స్పందిస్తూ. . 2012లో యూపీయే ప్రభుత్వం కూడా ఆ సంస్థ బిడ్లను తిరస్కరించిందన్నారు. దేశ ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకొని ఈ వివాదానికి స్వస్తి పలకడం మంచిదన్నారు.



శుక్రవారం రాత్రి సీఎం చంద్రబాబుతో సమావేశమైన ఏజీపీ అధ్యక్షుడు, అసోం మాజీ ముఖ్యమంత్రి ప్రఫుల్ కుమార్ మహంతి

అంగన్‌వాడీలకు పాలసేకరణ ధర నిర్ధరణకు కమిటీ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(ఏపీడీడీసీఎఫ్) నుంచి పాలసేకరణ, సరఫరా నిమిత్తం ధర నిర్ధారించేందుకు ఆరుగురు అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ కన్వీనర్‌గా, పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఏపీడీడీసీఎఫ్ ఎండీలు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐటీ, ఆరోగ్యశాఖ మంత్రుల భేటీ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలను, ఇతర సమాచారాన్ని ఎలక్ట్రానిక్ విధానంలో రికార్డు చేయడంపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్, వైద్య శాఖ మంత్రి ఫరూక్ సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సమావేశమై చర్చించారు. ఈ పథకాన్ని ఐటీ సహకారంతో విజయవంతంచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

అంచనాలను అందుకోలేదు

- ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు తగ్గిన దరఖాస్తులు
- గ్రూపు-3 ఉద్యోగాలకు 6 లక్షలు వస్తాయని అంచనా
- వచ్చింది మాత్రం 3.16 లక్షల దరఖాస్తులే
- అనివార్యంగా 25వ తేదీ వరకు గడువు పొడిగింపు

ఈనాడు - అమరావతి



ఉద్యోగాలకు పోటీ

ఉద్యోగం	దరఖాస్తుల అంచనా	వచ్చినవి	పోస్టులు	పోటీ
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్	70 వేలు	47,001	309	152
ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్	40 వేలు	16,130	24	672
అసిస్టెంట్ మోటార్ వెహికల్స్	5 వేలు	5411	23	235
హార్టికల్చర్	3వేలు	1,454	39	37
ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1	-	13,266	109	122

అసిస్టెంట్ కమిషనర్ (దేవాదాయ శాఖ) ఉద్యోగాలకు శనివారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా శుక్రవారం సాయంత్రానికి 371 వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఉద్యోగాలకు ఈసారి అంచనాల కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. గత అనుభవాలను అనుసరించి పంచాయతీ కార్యదర్శుల(గ్రూపు-3) ఉద్యోగాలకు 6 లక్షల వరకు దరఖాస్తులు వస్తాయని ఏపీపీఎస్సీ అంచనా వేసింది. శనివారంతో గడువు ముగియనుండగా.. శుక్రవారం నాటికి 3,16,525 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో గడువును ఈ నెల 25వ తేదీ వరకు పెంచినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఇతర ఉద్యోగాలకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య కూడా తక్కువగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

గ్రూపు-2 ఉద్యోగాలకు 62,499 దరఖాస్తులు!

గ్రూపు-2 ఉద్యోగాలకు శుక్రవారం సాయంత్రం వరకు 62,499, గ్రూపు-1కు 35,317, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు 13,295 వంతున దరఖాస్తులు వచ్చాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణకు ఇంకా గడువు ఉంది.

దరఖాస్తులు ఎందుకు తగ్గినట్లు!

2016 ఉద్యోగ ప్రకటనల జారీకి అనుగుణంగా దరఖాస్తుల రాకపై కమిషన్ అంచనాలు వేసింది. ఈ మధ్యలో డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దీనివల్ల దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తాయని కమిషన్ అంచనా వేసింది. అయినప్పటికీ కొన్ని ఉద్యోగాలకు దరఖాస్తుల రాక తగ్గింది. దీనిపై ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. "2016 నుంచి పరీక్షలు రాసిన ప్రతి అభ్యర్థి మార్కులు వెల్లడించాం. దీంతో వారి శక్తిసామర్థ్యాలు తెలుసుకునేందుకు వీలు ఏర్పడింది. వీటిని పరిశీలించుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆలోచించి ఉంటారని భావిస్తున్నాం. గ్రూపు-3 ఉద్యోగాలకు 6 లక్షల వరకు దరఖాస్తులు వస్తాయని అంచనా వేయగా శుక్రవారం సాయంత్రానికి 3,16,525 మాత్రమే రావడం ఆలోచింపజేస్తోంది. అభ్యర్థులకు మరోసారి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో గడువును వారం వరకు పొడిగించాం" అని వివరించారు.

అభ్యర్థుల తప్పిదాలు

కమిషన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ పేరు, అర్హతలు, ఇతర వివరాలు నమోదు చేసుకున్నారు. కొందరు అభ్యర్థులు ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులపై ఆధారపడి వివరాలు నమోదు చేయించుకున్నారు. ఈ ప్రక్రియలో అభ్యర్థుల ఫోన్ నంబరు, మెయిల్ ఐడీ నమోదు చేయకుండా ఇంటర్నెట్ కేంద్రాల వారు తమ సొంత ఐడీ, ఫోన్ నంబర్లను నమోదుచేశారు. ఈ విషయం కొందరు అభ్యర్థులకు తెలియడంలేదు. మరోవైపు ఫోన్ నంబర్లు మారిన వారు తిరిగి కొత్త నంబర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. దీంతో దరఖాస్తు తేదీ గడువు సమీపించే కొద్దీ ఓటీపీఆర్ ఐడీ రావడంలేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల సందేహాలను హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా నివృత్తి చేస్తున్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. అయితే.. ఎంతసేపు ఫోన్లు చేస్తున్నా కమిషన్ సిబ్బంది తీయడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

23న మరికొన్ని ఉద్యోగ ప్రకటనలు!

ఈ నెల 23వ తేదీన మరికొన్ని ఉద్యోగ ప్రకటనలను కమిషన్ జారీచేయనుంది. ఈ నెలాఖరులోగా పెండింగులో ఉన్న 14 ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాల్సి ఉంది. ఇందులో కొన్నింటిని ఈ నెల 23వ తేదీ కమిషన్ జారీచేసే అవకాశాలు ఉన్నాయి.

భాజపా వ్యతిరేకశక్తులు ఏకం కావాలి: నారాయణ

ఈనాడు, అమరావతి: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు న్యాయమూర్తులు, మేధావులు, ప్రజలను అర్థించే పరిస్థితి నెలకొనడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు భాజపా వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ప్రముఖ మేధావి ఆనంద్ తేల్తుంబ్డే ప్రజల మద్దతు కోరుతూ రాసిన లేఖపై శుక్రవారం ఆయన స్పందించారు. కేంద్ర ప్రభుత్వ ఆరాచకాల నుంచి కాపాడాలని, తనకు ప్రాణహాని ఉందని ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేయడాన్ని ఆయన ప్రస్తావించారు.

స్వేచ్ఛను అణచేస్తున్నారు

రామకృష్ణ

ఈనాడు, అమరావతి: కేంద్రంలోని భాజపా ప్రభుత్వ పాలనకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష మేధావులు, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని వ్యతిరేకించే వారిపై ఏదో ఒక రూపంలో అణచివేతకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని వెల్లడించారు. భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక రకాల ఆంక్షలతో భావప్రకటన స్వేచ్ఛను అణగదొక్కాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పౌరహక్కుల కోసం పోరాటం చేసే వరవరరావు వంటి వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేసి అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. మేధావి ఆనంద్ తేల్తుంబ్డే విషయంలో దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని తెలిపారు.

త్వరలో 46 మంది పీఠాధిపతులతో విజయవాడలో సమావేశం

- దేవాదాయశాఖ అనుబంధ విభాగాలపై ఉపముఖ్యమంత్రి కేఈ సమీక్ష

ఈనాడు, అమరావతి: హిందూ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు హిందూమతాన్ని రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించేందుకు 46 మంది పీఠాధిపతులతో త్వరలో విజయవాడలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. హిందూ ధార్మిక పరిషత్తు ట్రస్టు ఛైర్మన్ ప్రసాద్ ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తికి తెలియజేశారు. దేవదాయ శాఖ అనుబంధ సంస్థలు బ్రాహ్మణ కార్పొరేషన్, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు తదితర సంస్థల కార్యకలాపాలపై ఉపముఖ్యమంత్రి శుక్రవారం సమీక్షించారు. వృద్ధ బ్రాహ్మణులకు, వితంతువులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 పింఛన్‌ను రూ.2000కు పెంచాలన్న బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనందసూర్య ప్రతిపాదనకు దేవదాయశాఖను పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కేఈ సానుకూలంగా స్పందించారు. పింఛను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల్ని ఆనందసూర్య వివరించారు. అర్చకుల సమస్యలు తీరాలంటే జీవో 76ను త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ సంస్థల కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు శంఖారావం పేరుతో సంచిక తీసుకువస్తున్నామని ట్రస్టు ఛైర్మన్ ప్రసాద్ చెప్పారు. వేదిక్ విశ్వవిద్యాలయం అనుబంధంగా రాజధానితో పాటు ఇతర ప్రాంతాల్లో వేద విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సుదర్శన శర్మ కోరారు. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కేఈ హామీ ఇచ్చారు.

మీ సేవా కేంద్రాల నిర్వాహకుల సమ్మె విరమణ

నేటి నుంచి విధుల్లోకి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో గత రెండు రోజులుగా అధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. తమ డిమాండ్లు ఆమోదించాలని గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మీసేవా కేంద్రాల నిర్వాహకులు సమ్మెబాట పట్టారు. దీనిపై ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల కార్యదర్శి విజయానంద్, మీసేవా కేంద్రాల సంచాలకులు సుందర్ జరిపిన చర్చల్లో మీసేవా కేంద్రాల నిర్వాహకుల డిమాండ్లపై లిఖితపూర్వక హామీ లభించడంతో వారు సమ్మెను విరమించారు. శనివారం నుంచి విధుల్లోకి రానున్నారు.

డిమాండ్లపై ఆమోదం ఇలా...

- మీసేవా కేంద్రాల నిర్వాహకులకు ఇప్పుడు ఇస్తున్న కమీషన్‌కు అదనంగా ఫిబ్రవరి 1 నుంచి కేటగిరీ-ఏ కింద రూ.7లు, కేటగిరీ-బీ కింద రూ.9లు ఇచ్చేందుకు ప్రభుత్వ అంగీకారం.
- ప్రస్తుతం స్కానింగ్ ఛార్జీ రూ.2 వసూలు చేస్తుండగా దీన్ని రూ.5లకు పెంచుతూ అనుమతి ఇచ్చింది.
- మీసేవా ఫ్రాంఛైజీలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు సమ్మతం.
- తక్కువ లావాదేవీలు జరుగుతున్న గ్రామీణ ప్రాంత ఫ్రాంఛైజీలకు పంచాయతీల్లోని డేటా ఎంట్రీ పనిని బదిలీ చేసి ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు.
- విద్యుత్తు బిల్లుల భారం తగ్గించేందుకు కేటగిరీల మార్పుకు అంగీకారం.

సిద్ధమవుతున్న బడ్జెట్ స్వరూపం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే తాజా బడ్జెట్‌కు సంబంధించిన ప్రాథమిక స్వరూపం సిద్ధం చేసింది. ఫిబ్రవరి 5న శాసనసభలో ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓట్ ఆన్ అకౌంట్(బడ్జెట్) సమర్పించనుంది. ప్రస్తుత శాసనసభ పదవీకాలం జూన్ వరకే ఉన్న నేపథ్యంలో ఎన్నికలయ్యేంత వరకు పూర్తిస్థాయి బడ్జెట్ ఆమోదం పొందే అవకాశం లేదు. ఈలోపు జీతాలు, పింఛన్లు, ఇతరత్రా నిర్వహణ వ్యయాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పరిమిత కాలానికి ఓట్ ఆన్ అకౌంట్ సమర్పించి సభ ఆమోదం పొందవలసి ఉంటుంది. 2019-20 సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ స్వరూపం సిద్ధం చేసి శాసనసభ ముందు ప్రవేశపెట్టినా కేవలం మూడు నెలలు లేదా అయిదు, ఆరు నెలల కాలానికే ఖర్చుకు సభామోదం తీసుకుంటారు. ఎన్ని నెలల కాలానికి ఆమోదం పొందాలనే విషయంపై చర్చలు జరుగుతున్నాయి. కేవలం మూడు నెలల సమయానికే ఓట్ ఆన్ అకౌంట్ ఆమోదం పొందితే మళ్లీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు గడువు చాలా తక్కువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కోణంలో ఆలోచించి 5 నెలల కాలానికి లేదా అర్ధ సంవత్సరానికి ఓట్ ఆన్ అకౌంట్ ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ విషయంపై సోమవారం



ఆర్థిక మంత్రి వద్ద నిర్వహించే సమావేశంలో కొలిక్కి వస్తుందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 5 నాడే 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అదనపు ఖర్చులకు కూడా సభామోదం పొందనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలలకు సంబంధించిన బడ్జెట్‌లో ఆమోదం పొందకుండా చేసిన ఖర్చుకు గతంలోనే సభామోదం పొందారు. ఇప్పుడు చివరి ఆరు నెలలకు సంబంధించిన అదనపు నిధుల ఖర్చులకు సభామోదం పొందుతారు.

రూ.1.99 లక్షల కోట్లకు బడ్జెట్ అంచనాలు!

2019-20 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.1.99 లక్షల కోట్లుగా ఉంటుందని ఆర్థికశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు ఏ మేరకు ఉంటుంది, ఆదాయ పరిస్థితిపై అంచనాలకు వచ్చారు. 2018-19 సంవత్సరానికి సంబంధించి రూ.1,91,063 కోట్లతో బడ్జెట్ సమర్పించారు. ఇప్పుడు అంతకుమించి ఉంటుంది. ఒకానొక పరిస్థితుల్లో ఇది రూ.2 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం కూడా ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతిపాదనల పరిశీలన

ఇప్పటికే అన్ని ప్రభుత్వశాఖల నుంచి బడ్జెట్ కేటాయింపులపై అంచనాలు స్వీకరించారు. ఆ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. గత నాలుగేళ్లలో ఆయా శాఖలు చేసిన ఖర్చు సగటు ఆధారంగా ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు చూపనున్నారు. ఆయా శాఖల ప్రతిపాదనలపై వచ్చే వారంలో నాలుగు రోజుల పాటు కార్యదర్శులతో చర్చలు ఉంటాయని సమాచారం. జనవరి 21న బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థికశాఖ అధికారులతో మంత్రి యనమల రామకృష్ణుడు సమావేశం ఏర్పాటు చేశారు. జనవరి 22 నుంచి నాలుగు రోజుల పాటు ఆర్థికశాఖ కార్యదర్శులు, ఆయా ప్రభుత్వశాఖల అధిపతులతో బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు జరపనున్నారు. ఆ సమయంలో ఆర్థిక మంత్రి దావోస్ పర్యటనలో ఉంటారు. జిల్లా కలెక్టర్ల సదస్సు తర్వాత ఆయా శాఖల మంత్రులతో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రతిపాదనలపై సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది.

'స్విమ్స్' స్వయం సమృద్ధి సాధించాలి

- పాలకమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఈనాడు, అమరావతి: వచ్చే ఐదు సంవత్సరాల్లో స్విమ్స్ సేవలు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండాలని.. సంస్థ స్వయం పోషకత్వం సాధించేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఉన్నత స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నారు. సచివాలయంలో 'స్విమ్స్' (శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పాలకమండలి సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. "గ్రామాలను దత్తత తీసుకుని అందరూ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఫలితాల సాధనకు భిన్న లక్ష్యాలతో ముందుకు సాగాలి. తితిదేతో సమన్వయంతో వ్యవహరించాలని' ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అన్నదానం ట్రస్టు తరహాలో అన్న క్యాంటీన్లకు విరాళిచ్చే దాతలను ప్రోత్సహించాలని తితిదే ఈవో సింఘాల్‌కు సూచించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ రవికుమార్ సంస్థ అభివృద్ధి గురించి వివరించారు.

వేతనాల చెల్లింపులకు గ్రాంటు ఇవ్వండి..


స్విమ్స్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు సంబంధించి రూ.50 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని డైరక్టర్ కోరగా.. వచ్చే ఏడాది నుంచి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యను ఆదేశించారు. స్విమ్స్‌లో అమలుచేస్తున్న ఆదిత్య హృదయం, ప్రివెంటివ్ కార్డియాలజీ కార్యక్రమాల వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ మరణాలను 63% తగ్గించగలిగామని రవికుమార్ వివరించారు. ఈ సమావేశంలో వైద్య శాఖ మంత్రి ఫరూక్, స్విమ్స్ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ గృహాలకు నెలాఖరులోపు రుణాలివ్వాల్సిందే

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ పట్టణ పథకం కింద ఇప్పటికే పూర్తయిన 80 వేల ఇళ్లకు జనవరి 31లోగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పట్టణ గృహ నిర్మాణంపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. శ్లాబ్ దశ పూర్తయిన మరో 55వేల ఇళ్లకు ఫిబ్రవరి 15నాటికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, రుణమంజూరు వేగవంతం చేసేందుకు నోడల్ అధికారులను నియమించుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఇప్పటివరకు రుణాలు ఇవ్వని బ్యాంకులు మూడు రోజుల్లో తమ విధానాన్ని వెల్లడించాలని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి నెలాఖరుకు 1,75,000 గృహాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



వెలగపూడి సచివాలయంలో శుక్రవారం బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రి నారాయణ



పోలీసు అధికారులకు పదోన్నతులు, బదిలీలు

- నలుగురికి ఏడీజీపీ, ఒకరికి ఐజీపీ, ముగ్గురికి డీఐజీ హోదా
- విశాఖ రేంజి డీఐజీగా పాలరాజు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పించడంతోపాటు కొందరిని బదిలీలు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 1994 బ్యాచ్‌కు చెందిన నలుగురికి ఏడీజీపీ(అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా), 2001 బ్యాచ్‌కు చెంది ఒకరికి ఐజీపీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్)గా, 2005 బ్యాచ్‌కు చెందిన ముగ్గురికి డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్)గా పదోన్నతులు లభించాయి. బదిలీ అయిన వారిలో డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మను ఏలూరు రేంజి డీఐజీగా నియమించారు. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న టి.రవికుమార్ మూర్తి ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తారు. అనంతరం త్రివిక్రమవర్మ బాధ్యతలు స్వీకరిస్తారు.

★ **ఏజీపీ నుంచి అదనపు డీజీపీలుగా:** కుమార్ విశ్వజిత్, డాక్టరు ఏ.రవిశంకర్, ఎన్.బాలసుబ్రమణ్యం, కృపానంద్ త్రిపాఠి ఉజేలా

★ **డీఐజీ నుంచి ఐజీపీగా:** వినీత్ బ్రిజాల్

★ **ఎస్పీ నుంచి డీఐజీగా:** ఎస్.శ్యామ్‌సుందర్, డాక్టరు సీఎం త్రివిక్రమవర్మ, జి.పాలరాజు

బదిలీలు

అధికారి	ప్రస్తుత పదవి	బదిలీస్థానం
ఎస్.శ్యామ్‌సుందర్	ఇంటర్ కేడర్ డిప్యుటేషన్, కేరళ	-
కుమార్ విశ్వజిత్	సంస్థాగత, సమన్వయం, ఛైర్మన్, పోలీసు నియామకమండలి	హోదా పెంచి కొనసాగింపు
డాక్టరు ఏ.రవిశంకర్	ఐజీపీ, శాంతి భద్రతలు	ఏడీజీపీ, శాంతి భద్రతలు
ఎన్.బాలసుబ్రమణ్యం	కమిషనర్, రవాణాశాఖ	ఏడీపీజీగా అదేస్థానంలో కొనసాగింపు
కృపానంద్ త్రిపాఠి	ఐజీపీ, హోమ్‌గార్డ్స్	ఏడీజీపీ, హోమ్‌గార్డ్స్
హరీష్‌కుమార్ గుప్తా	శాంతిభద్రతల విభాగం	ఏడీజీపీ, ప్రొవిజనింగ్, లాజిస్టిక్స్
వినీత్ బ్రిజాల్	డీఐజీ గ్రేహౌండ్స్	ఐజీపీ, గ్రేహౌండ్స్
డా.సీఎం త్రివిక్రమవర్మ	ఎస్పీ, శ్రీకాకుళం	డీఐజీ, ఏలూరు రేంజి
జి.పాలరాజు	ఎస్పీ, విజయనగరం	డీఐజీపీ, విశాఖపట్నం రేంజి
సీహెచ్ శ్రీకాంత్	డీఐజీ, విశాఖపట్నం రేంజి	డీఐజీ, సాంకేతిక సేవలు (డీజీపీ కార్యాలయం)



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00